28-7Pg1exHMNWJQE:28-7Pg1exHMNWJQE.qxd 7/28/2026 12:01 AM Page 1

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తిరుపతి

fb.com/vaartha Digital



ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్‌కు స్వర్ణం
-'ఆట'లో

Published from Tirupathi, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-7-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 178 పేజీలు: 10+4 వెల: 6.50

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన పెంచండి

### ప్రత్యామ్నాయ పంటలను వివరించండి..

### ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ఉద్యోగుల పనితీరు మారాలి

### ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు



**విజయవాడ, జులై 27, ప్రభాతవార్తప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంపై రైతుల్లో అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. రాష్ట్ర సచివాలయంలో సోమవారం ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి వివిధ శాఖల పనితీరుపై సీఎం చర్చించారు. ఈ ఏడాది అంతటా ఎల్ నినో ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని అంచనాలు వస్తున్న నేపథ్యంలో ఇప్పటికే తీసుకున్న చర్యలతో పాటు, రైతుల్లో మరింత అవగాహన కల్పించాలని సీఎం ఆదేశించారు. ఎల్ నినో ప్రభావం వల్ల ఉత్పన్నమయ్యే పరిణామాలను రైతులకు వివరించడంతోపాటు ప్రత్యామ్నాయ పంటలు వేసుకునేలా రైతులను ప్రోత్సహించాలని సూచించారు. దీని నిమిత్తం క్యాంపెయిన్ మోడ్‌లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అలాగే ఏప్రాంతాల్లో ఏయే పంట సాగు చేయాలనేదానిపై రైతులకు వివరించాలని ముఖ్యమంత్రి చెప్పారు. పంటల బీమా యాక్షన్ ప్లాన్‌ను అమలు చేయాలని సూచించారు. వరి పంటకు చివరి తేదీ 2026 ఆగస్టు 15 అని చెప్పారు. అర్హులైన రైతులు గరిష్ఠ సంఖ్యలో నమోదు అయ్యేలా సంబంధిత భాగస్వాములందరూ విస్తృత అవగాహన మరియు ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. ఖరీఫ్-2026 సీజన్‌లో రైతుల ప్రయోజనాలపై చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో వర్షపాతం లోటు పరిస్థితుల నేపథ్యంలో రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ రైతులకు అండగా ఉంటుందని తెలిపారు. సీజన్ సాధారణ వర్షపాతం 580.1 మి.మీ. కాగా, ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా 225.7 మి.మీ. వర్షపాతం నమోదవ్వాల్సి ఉందని, అయితే కేవలం 104.5 మి.మీ. మాత్రమే నమోదై 53.7 శాతం లోటు ఏర్పడిందని వివరించారు. మొత్తం 28 జిల్లాల్లో 21 జిల్లాలు వర్షపాతం లోటు కేటగిరీలో ఉన్నాయని తెలిపారు. పశ్చిమ గోదావరి, అన్నమయ్య, తూర్పు గోదావరి, విశాఖపట్నం, చిత్తూరు, ప్రకాశం జిల్లాలు కలిపి ఆరు జిల్లాలుతీవ్ర వర్షపాతం లోటు కేట గిరీలో ఉన్నాయని, నెల్లూరు జిల్లాలో మాత్రమే >>2



## లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

### ప్రవేశపెట్టిన కేంద్రమంత్రి జితేంద్ర సింగ్

### విపక్షాల రగడతో ఉభయసభలు నేటికి వాయిదా

**న్యూఢిల్లీ,జులై 27:** పేపర్ లీకేజీ నిరోధక బిల్లుపై చర్చించేందుకు అన్ని పార్టీలు సిద్ధంగా ఉన్నట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. అన్ని పార్టీలను ఆయన ఒప్పించినట్లు పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి. సోమవారం కేంద్రసిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. పేపర్ లీకేజీ నిరోధక సవరణబిల్లును మంగళవారం చర్చించేందుకు అన్ని పార్టీలు అంగీకరించాయని, స్పీకర్ ఓం బిర్లా చేపట్టిన చర్యలవల్ల ఫ్లోర్‌లీడర్లు ఆ చర్చకు ఒప్పుకున్నారని స్పీకర్ కార్యాల వర్గాలుప్రశ్నపత్రాల లీకేజీలు, పబ్లిక్ పరీక్షల్లో అక్రమాలను కట్టడి చేయడానికి >>2



## తిరుపతిలో తొలి కరోనా కేసు

### 65యేళ్ల వృద్ధురాలికి పాజిటివ్

**తిరుపతి,జులై 27ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మళ్లీ ఆందోళనకర అలజడి సృష్టిస్తున్న కరోనా వైరస్ వ్యాప్తి తాజాగా యాత్రాస్థలం తిరుపతిలో కేసు నమోదు కావడంతో యాత్రికులు, తిరుపతి వాసులు ఆందోళన చెందుతున్నారు. 2020-21 మధ్యకాలంలో ప్రపంచవ్యాప్తంగా తీవ్రంగా వ్యాపించి ఎందరో ప్రాణాలు బలిగొన్న ఈ కరోనా వైరస్ ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్థంగా మారిన విషయం విదితమే. మళ్ళీ ఐదేళ్ళ తరువాత కరోనా వైరస్ రాష్ట్రంలో కలకలంగా మారింది. ఇప్పటికే రాష్ట్రంలో కరోనా వైరస్ కేసులు తీవ్రంగా నమోదవుతున్న తరుణంలో తిరుపతి నగరంలో ఓ కరోనా వైరస్ >>2

రాజమండ్రిలో మరో ఇద్దరికి కరోనా 2లో

## ఇక దృష్టంతా ఫలితాలపైనే



పునాదిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

### విద్యారంగంలో సంస్కరణలు పూర్తి

### విద్యార్థులకు మార్కులు రాకపోతే సిఎం నా మార్కులు తగ్గిస్తారు..

### పునాదిపాడు జెడ్పీ హైస్కూలును ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి లోకేష్

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలని అధికారులను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం పునాదిపాడులోని జడ్పీ ఉన్నత పాఠశాలను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో వసతులు, విద్యా ప్రమాణాలపై మంత్రి ఆరా తీశారు. ముందుగా పాఠశాలలోని పదో తరగతి ఏ సెక్షన్ విద్యార్థులతో మంత్రి సంభాషించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మీ సీనియర్స్ కంటే మీరు బాగా చదవాలి. గతేడాది పదో తరగతిలో 67శాతం మంది విద్యార్థులు మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణులయ్యారు. రాష్ట్ర సరాసరి కంటే ఇది 11శాతం తక్కువ. మీకు మార్కులు రాకపోతే సీఎం చంద్రబాబునాయుడు గారు నా మార్కులు తగ్గిస్తారు. కాబట్టి మీరంతా బాగా చదవాలని వారిని ఉత్సాహపరిచారు. విద్యార్థులకు పదో తరగతి చాలా ముఖ్యం. పది, ఇంటర్మీడియట్ చదివే సమయంలో నా జీవితంలో మార్పు వచ్చిందని ఈ సందర్భంగా మంత్రి చెప్పారు. ఇప్పుడు మంచి మార్కులు వస్తేనే భవిష్యత్ బాగుంటుందని అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ అందజేత, పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులను మంత్రి ఆరా తీశారు. బాగుందని విద్యార్థులు సమాధానం ఇచ్చారు. ప్రజాప్రభుత్వంలో మధ్యాహ్న భోజనానికి ఫైన్ రైస్ ను వినియోగిస్తున్నామని చెప్పారు. రాగి జావ ఎంతమందికి ఇష్టం, చిక్కీ ఎంతమందికి ఇష్టం అని మంత్రి సరదాగా ప్రశ్నించగా అధికశాతం మంది విద్యార్థులు చిక్కీ ఇష్టమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజాప్రభుత్వం కృషిచేస్తోందని, అన్ని వసతులు, సౌకర్యాలు కల్పిస్తోందని, మీరు చేయాల్సిందల్లా బాగా చదవడమేనని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. చదువుకున్నది జీవితంలో ఎంతవరకు ఉపయోగపడుతున్నదన్నది ముఖ్యం, లోకజ్ఞానం కూడా అవసరమేనని పేర్కొన్నారు. బాగా చదువుకోవాలని విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు.

**అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసంతృప్తి**

గతేడాది కంటే ఈ ఏడాది 19 మంది విద్యార్థులు పాఠశాలలో కొత్తగా ప్రవేశాలు పొందారు. ఇందుకు పాఠశాల సిబ్బందిని మంత్రి అభినందించారు. మౌలిక సౌకర్యాల్లో పాఠశాల 2.76 రేటింగ్ సాధించింది. అయితే పాఠశాలలోని విద్యార్థులు అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉండటంపై మంత్రి అసృతృప్తి వ్యక్తం చేశారు. అద్భుతమైన మౌలిక సౌకర్యాలు, మంచి ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ లెర్నింగ్ అవుట్ కమ్స్, సమ్మెటివ్, ఫార్మాటివ్ అసెస్‌మెంట్స్ లో స్కూల్ వెనుకబడి ఉంది. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో 0.9శాతం రేటింగ్ సాధించింది. పట్టణ ప్రాంతానికి దగ్గరగా ఉన్న పాఠశాల అభ్యసన సామర్థ్యాల్లో వెనుకబడి ఉందని, లెర్నింగ్ అవుట్ కమ్స్ పై ప్రత్యేక దృష్టిసారించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. వెనుకబడిన విద్యార్థులపై దృష్టి పెట్టాలని సూచించారు. అనుమతి లేకుండా ఉపాధ్యాయులు గైర్హాజరు కావడాన్ని నివారించాలన్నారు. ఒకేషనల్ ల్యాబ్స్ పైనా దృష్టిసారించాలని ఆదేశించారు. ఇంటర్‌లో ఒకేషనల్ కోర్సులపై దృష్టి సారించడం ద్వారా ఉద్యోగాలు లభిస్తాయని చెప్పారు. పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల విషయంలోనూ మంత్రి ఆరా తీశారు. వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాల అభివృద్ధిలో పూర్వ విద్యార్థులను కూడా భాగస్వామ్యం చేయాలని సూచించారు. ఫలితాల మెరుగుదలకు విద్యార్థుల్లో స్ఫూర్తి >>2



మృతి చెందిన శివాని(ఫైల్)

## సిఎం ప్రశంసలు అందుకొన్న టెన్త్ విద్యార్థిని అనూహ్యంగా ఆత్మహత్య

### బాలిక మృతిపై సమగ్రవిచారణకు తక్షణమే సిఎం ఆదేశం

### రంపచోడవరంలో విషాదం

**పోలవరం జిల్లా ప్రతినిధి, జులై 27 ప్రభాత వార్త:** పోలవరం జిల్లా రంపచోడవరం మండలం ఇర్లపల్లిలో 10 తరగతి విద్యార్థిని శివాని(14) సోమవారం ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనతో రంపచోడవరంలో విషాదం నెలకొంది. ఈ నెల 24 తేదిన పి. టీ.యం.తల్లికి వందనం వేదికపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కార్యక్రమంలో మాట్లాడిన విద్యార్థిని భవిష్యత్తులో 'షైనింగ్ స్టార్'గా ఎదిగి, ఆయన చేతుల మీదుగా అవార్డు అందుకోవాలనే తన ఆకాంక్షను వ్యక్తం చేసింది. విద్యార్థిని మాటలకు ముఖ్యమంత్రి స్పందించి, ఆమెతో సెల్ఫీ దిగడంతో పాటు భవిష్యత్తులో తనకు నివేదిక ఇవ్వాలని సూచించారు. ఆ విద్యార్థిని వచ్చే యేడాది మంచి మార్కులతో శైనింగ్ స్టార్ అవార్డు అందుకుంటాను అని వేదికపై వెల్లడించి, అందరి చేత చప్పట్లు కొట్టించుకుంది. ఈ విద్యార్థిని ప్రసంగానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ >>2

## నిన్న 'కాక్రోచ్'.. నేడు ఇ-20 జనతాపార్టీ




### స్వచ్ఛ పెట్రోలు కోసం ఉద్యమం

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీక్ వ్యవహారం నేపథ్యంలో కాక్రోచ్ జనతా పార్టీ(సిజెపి) పుట్టుకొచ్చింది. సోషల్ మీడియా నుంచి ప్రారంభమైన ఈ ఉద్యమం చివరకు విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వరకు సాగింది. ఇప్పుడు సిజెపి లాగే కొత్తగా ఇజెపి అంటే 'ఇ20 జనతా పార్టీ' పుట్టుకొచ్చింది. ఈ పేరుతో కొత్తగా డిజిటల్ ప్రచారం మొదలైంది. ఇ20 పెట్రోల్‌తో పాటు వినియోగదారులకు 100 శాతం స్వచ్ఛమైన పెట్రోల్ కొనుగోలు చేసే అవకాశం ఇవ్వాలనేది ఈ పార్టీ ప్రధాన డిమాండ్. ఇ20 జనతాపార్టీ ఇప్పటికే ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ప్రత్యేక అకౌంట్లు క్రియేట్ అయ్యాయి. >>2

## విజయ్ 'ఉద్యోగ' ఉత్తర్వులు కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

### కరూర్ తొక్కిసలాట బాధితులకు ఎలా ఇస్తారని ప్రశ్న



**మదురై, జులై 27:** సెప్టెంబర్ 2025లో 'తమిళగ వెట్రి కజగం (టివికె) అధ్యక్షుడు సి. జోసెఫ్ విజయ్ ప్రసంగించిన ఎన్నికల ర్యాలీ సందర్భంగా కరూర్‌లో జరిగిన విషాదకరమైన తొక్కిసలాటలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులను మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం రద్దు చేసింది. >>2



## తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు

### ఆగస్టు 1 నుంచి ప్రజలకు సదవకాశం: డి.సిఎం పవన్

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు జరుగుతున్నాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. ఈ మేరకు డీసీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం సామాన్యుడికి అండగా నిలుస్తుందని చాటి చెప్పేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ తీసుకున్న నిర్ణయం స్వాగతించదగినదని పవన్ వ్యాఖ్యానించారు. బహిరంగ మార్కెట్లో పెరుగుతున్న బియ్యం ధరల నుంచి సామాన్యుడికి సాంత్వన చేకూర్చేలా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో తక్కువ ధరకే బియ్యం అమ్మకాలు చేపట్టాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమ్ అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ అన్నారు. బీపీటీ సూపర్ ఫైన్ బియ్యం కేజీ రూ.52లకు, గ్రేడ్ 1 పచ్చి బియ్యం (రా రైస్ ) రూ.50లకు రాష్ట్రంలోని 130 రైతుబజార్లు, 500 రైసు మిల్లర్ల ప్రత్యేక కౌంటర్లలో ఆగస్టు 1వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉంచేలా ఏర్పాట్లు చేశారు. ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రివర్యులు, సోదరులు నాదెండ్ల మనోహర్ అమలులోకి తీసుకుని వచ్చిన ఈ సౌకర్యం ప్రశంసనీయమన్నారు.. సామాన్యుడిపై ధరల భారం పడకుండా కూటమి ప్రభుత్వం తరఫున ఆయన ప్రత్యేకంగా చొరవ తీసుకోవడం స్వాగతించదగినదని చెప్పారు. బహిరంగ మార్కెట్ ధరలను సమీక్ష చేసి, మిల్లర్లతో అత్యవసరంగా సమావేశం నిర్వహించి ప్రజలకు అందుబాటులో ఉండేలా మేలైన ధరలను నిర్ణయించారని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ పాలనపరమైన నిర్ణయం సామాన్య ప్రజల ఆర్థికభారాన్ని తగ్గిస్తుందని విశ్వాసం వ్యక్తంచేశారు.

## సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట 2లో



## బడులు, హాస్టల్స్‌లో స్టీమ్ రైస్ వాడకం

### మధ్యాహ్న భోజన పథకం మరింత నాణ్యతతో అమలు: మంత్రి నాదెండ్ల

### ఢిల్లీలో విద్యామంత్రి ప్రహ్లాద్ జోషితో భేటీ

**విజయవాడ.జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రజలకు స్టీమ్ రైస్ అందించడం ద్వారా వారికి పౌర సరఫరాల శాఖ సేవలను మరింత చేరువ చేయొచ్చని రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. దీనిద్వారా ప్రజలకు నాణ్యమైన బియ్యం అందడంతో పాటు, బియ్యం అక్రమ రవాణా నిరోధానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని దీనికి కేంద్ర పౌర సరఫరాల శాఖ సహకారం ఎంతో అవసరమన్నారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమవారం ఆయన ఢిల్లీలో కేంద్ర పౌర సరఫరాల శాఖా మంత్రి ప్రహ్లాద్ జోషి తో పాటు శాఖ ఉన్నతాధికారులను వరుసగా కలిశారు. ఈ క్రమంలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, ప్రజాపంపిణీ శాఖ జాయింట్ సెక్రటరీ రవిశంకర్, పాలసీ అండ్ ఎఫ్సీఐ జాయింట్ సెక్రటరీ శిఖా కలిశారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టబోయే అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మనోహర్ సీఎంఆర్ సేకరణ, స్టీమ్ రైస్ పంపిణీ, మీ మార్టుల ప్రారంభం, రాష్ట్రం నుంచి విదేశాలకు ఎగుమతులు వంటి అనేక అంశాలను చర్చించారు. ఆగస్టు 1వ తేదీ నుంచి రాష్ట్రంలోని 130 రైతు బజార్లు, 500 ప్రత్యేక పాయింట్ల ద్వారా తక్కువ ధరకే బియ్యం విక్రయాలను చేపడుతున్నవిషయాన్ని కేంద్ర మంత్రి వద్ద ఆయన ప్రస్తావించారు. ఈ సందర్భంగా కేంద్రం నుంచి రావల్సిన అనుమతులు, సహకారం, పెండింగ్ నిధుల విషయాలను ప్రత్యేకంగా కేంద్రమంత్రి ముందుంచారు. రాష్ట్రంలోని 41 వేల పాఠశాలలు, 4 వేల వసతి గృహాల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో స్టీమ్ రైస్ వాడకం ద్వారా అందుతున్న నాణ్యమైన భోజనంపై సానుకూలత ఉందని, దీన్ని ప్రజాపంపిణీ వ్యవస్థకు >>2



ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోను ఆవిష్కరించిన మంత్రి దుర్గేష్

## వన్ ఇండియా, వన్ సినిమా దిశగా ఎఫ్‌టిపిసి అడుగులు

### క్రియేటివ్ ఎకానమీకి ఎపి చిరునామా: మంత్రి దుర్గేష్

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జులై27,ప్రభాతవార్త:** సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వం లో ఏపీలో క్రియేటివ్ ఎకానమీని అభివృద్ధి చేయాలని ఆలోచిస్తున్నట్లు తద్వారా రాష్ట్రాన్ని వినోద రంగానికి సరికొత్త గమ్యస్థానంగా నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఫిల్మ్ అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్ టీపీసీఐ) ప్రతినిధులు సోమవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్‌ని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎఫ్‌టీపీసీ జాతీయ కార్యకలాపాలకు సంబంధించిన అధికారిక పోస్టర్, లోగోలను మంత్రి దుర్గేష్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎఫ్‌టీపీసీఐ ప్రతినిధులు తమ భవిష్యత్ ప్రణాళికలను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాజమహేంద్రవరం లాంటి సాంస్కృతిక వేదికపై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. "ఒకప్పుడు తెలుగు, తమిళం, హిందీ అని వేర్వేరు ప్రాంతీయ చిత్రాలుగా చూసేవాళ్లం. కానీ నేడు పాన్ ఇండియా విప్లవం, ఓటీటీల రాకతో సినిమా స్వరూపమే మారిపోయింది. ప్రేక్షకులకు భాషతో సంబంధం లేకుండా అన్ని రకాల వినోదం అందుతోంది. సినిమాకి ఏ భాషా సరిహద్దు కాదని నిరూపితమైంది" అన్నారు. ఈ నేపథ్యంలో "దేశమంతా ఒకే వినోద వేదికపైకి రావాలనే ఎఫ్‌టీపీసీ ఆశయం అభినందనీయం. ఈ వన్ >>2

28-7pg2exHMNWJQE:28-7pg2exHMNWJQE.qxd 7/27/2026 11:58 PM Page 1





సోమవారం న్యూఢిల్లీలో ప్రధాని మోడీతో సమావేశమైన పంజాబ్ బిజెపి అధ్యక్షుడు కేవల్‌సింగ్ ధిల్లాన్

# సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంలో ఊరట

**విజయవాడ,జులై27,ప్రభాతవార్తప్రతినిధి:** గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ఊరట లభించింది. మాజీ సీఐ నాగరాజు కస్టడీ విచారణ అంశంలో హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు ధర్మాసనం సవరించింది. కస్టడీ విచారణ నిబంధనలను రద్దు చేసింది. సిట్ విచారణకు సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు విజయవాడ ఆఫీసులో నాగరాజును ప్రశ్నించనున్నారు. కృష్ణలంక యువకుడు గాదె సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసులో నిందితుడిగా ఉన్న సీఐ నాగరాజు కస్టడీ విచారణపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పును వెలువరించింది. నిందితుడిని రాజమండ్రి జైలులోనే విచారించాలంటూ గతంలో ట్రయల్ కోర్టు, హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సర్వోన్నత న్యాయస్థానం పక్కన పెట్టింది. ఈ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం, దర్యాప్తుకు అనుకూలంగా ఈ ఆదేశాలు జారీ చేసింది. విచారణ కోసం సీఐ నాగరాజును విజయవాడలోని దర్యాప్తు కేంద్రానికి గానీ, ఇతర సురక్షిత ప్రాంతాలకు గానీ తీసుకెళ్లి ప్రశ్నించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో ఈ కేసు దర్యాప్తు అధికారులకు విచారణ ప్రక్రియలో కీలక వెసులుబాటు లభించినట్లయింది. అయితే, కస్టడీ విచారణ సమయంలో నిందితుడిపై ఎలాంటి భౌతికదాడి లేదా హింసకు పాల్పడరాదని సుప్రీంకోర్టు షరతు విధించింది. అంతేకాకుండా, విచారణ ప్రక్రియ మొత్తాన్ని తప్పనిసరిగా వీడియో రికార్డింగ్ చేయాలని కఠినమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ తీర్పుతో సీఐ నాగరాజు కస్టడీ విచారణపై కొనసాగుతున్న న్యాయపరమైన అడ్డంకులు తొలగిపోయాయి.

## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం దృష్ట్యా సిఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్

**విజయవాడ,జులై27,ప్రభాతవార్తప్రతినిధి:** భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవం దృష్ట్యా సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 'ఉత్తరాంధ్ర కలలకు రెక్కలు' నినాదంతో కార్యక్రమాలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. విమానాశ్రయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఉత్తరాంధ్ర కలెక్టర్లు పోటీపడాలి. భోగాపురం విమానాశ్రయంతో ఉత్తరాంధ్ర గేమ్‌ఛేంజర్‌గా మారుతుంది. యువకులకు వాలీబాల్, రన్, పాటలు, పద్యాల పోటీలు నిర్వహించాలి. వివిధ విభాగాల్లో గెలుపొందిన 600 మందిని విజేతలుగా ప్రకటించాలి. విమానాశ్రయం ఏర్పాటు వల్ల కలిగే ప్రయోజనాలపై పోటీలు నిర్వహించాలి. విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. ఈనెల 31న రాత్రి నుంచే డ్రోన్‌షో ఏర్పాటు చేయాలి.ప్రధానికి జాతీయజెండాతో పిల్లలు స్వాగతం పలకాలి. విమానాశ్రయం ప్రారంభ సమయంలో 13వేల మందితో త్రివర్ణ ప్రదర్శన. 13 వేల మందితో నిర్వహించే త్రివర్ణ ప్రదర్శన గిన్నిస్‌రికార్డు సాధించాలి. కొవిడ్ నేపథ్యంలో ఆరోగ్యశాఖ అప్రమత్తంగా వ్యవహరించాలి. ప్రజలకుఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని చంద్రబాబు పేర్కొన్నారు. మరోవైపు 11 అంతర్జాతీయ, 25 జాతీయ ఛానళ్లలో ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవ కార్యక్రమం ప్రసారం జరగనుంది.

## కందుల జెస్సీకి విద్యామంత్రి లోకేష్ అభినందన

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ అసాధారణ ప్రతిభతో ప్రపంచ వేదికపైకి అడుగుపెట్టిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థినికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రపంచంలోనే తొలి అలెగ్జాండ్రియా గ్లోబల్ లూనార్ క్యాంపెయిన్ 'మిషన్ ఆర్టెమిస్'కు ఎంపికైన తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం విద్యార్థిని కందుల జెస్సీ, సోమవారం ఉండవల్లిలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను కలిసింది. ఈ సందర్భంగా జెస్సీని ప్రత్యేకంగా అభినందించిన మంత్రి, ఆమె భవిష్యత్ ప్రయత్నాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా మద్దతుగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. ధవళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న కందుల జెస్సీ, మిషన్ ఆర్టెమిస్ భారత్ నుంచి ఎంపికైన 20 మంది బాలికల్లో ఒకరిగా నిలిచింది. ఈ ఘనత సాధించిన ఏకైక ఆంధ్రప్రదేశ్ విద్యార్థినిగా ఆమె రికార్డు సృష్టించింది. తన పాఠశాలలోని అటల్ టింకరింగ్ ల్యాబ్స్‌లో చేసిన ప్రయోగాలే తనకు అంతరిక్ష విజ్ఞానంపై ఆసక్తిని పెంచాయని జెస్సీ మంత్రికి వివరించింది. ఏడో తరగతి నుంచే స్పేస్ సైన్స్ పట్ల ఆకర్షితురాలినయ్యానని, మిషన్ ఆర్టెమిస్‌లో భాగంగా 21 మాడ్యూళ్లలో 550 సెషన్ల శిక్షణ తీసుకున్నానని తెలిపింది. భవిష్యత్తులో ఏరోనాటికల్ ఇంజనీరింగ్ స్థిరపడటమే తన లక్ష్యమని ఆమె పేర్కొంది.



## ఉద్యాన పంటల కార్గో ఎయిర్ పోర్ట్‌కు అనంతలో రీసర్వే చేయండి

### కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడిని కోరిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**అనంతపురం, జులై 27, ప్రభాతవార్త బ్యూరో:** అనంతపురం జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు ప్రతిపాదనను పరిశీలించాలని కోరుతూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ రామ్మోహన్ నాయుడితో సోమవారం సమావేశమై కోరారు. ఈ మేరకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి స్పందించి సర్వే నిర్వహించి 30రోజుల్లో నివేదిక అందజేయాలని అధికారులను ఆదేశించారు.

# ఇక దృష్టంతా ఫలితాలపైనే

>> నింపాలని, విద్యావ్యవస్థ బాగుండాలంటే సాఫ్ట్ వేర్, హార్డ్ వేర్ రెండూ ముఖ్యమేనని చెప్పారు. పదో తరగతి పరీక్షా ఫలితాలమెరుగుదలపై దృష్టి సారించాలని ఆదేశించారు. విద్యారంగంలో సంస్కరణలు పూర్తయ్యాయని, ఫలితాలపై దృష్టిపెట్టాలన్నారు. 340 మంది ఉన్న పాఠశాలలో మార్పు కనపడాలని, ఆ మార్పుఫలితాల్లో ప్రతిబింబించాలని ఆదేశించారు.అనంతరం టెన్త్ క్లాస్ తరగతి విద్యార్థులతో మంత్రి మాట్లాడారు. మధ్యాహ్నభోజనం నాణ్యతపై ప్రశ్నించారు. విద్యార్థులకు ఆటోగ్రాఫ్ లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్ డీకే బాలాజీ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏ.వెంకటేశ్వరరావు,ఆర్డీఓ,ఎస్ నాగమణి,డీఈవో యూవీ సుబ్బారావు,ఎంఈవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నేడు ఇ-20 జనతాపార్టీ

>> ఇంధనం విషయంలో కూడా వినియోగదారులకు తాము ఎంచుకున్న పెట్రోల్ కొనుగోలు చేసే హక్కు కల్పించాలని డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఇ20ను అందుబాటులో ఉంచినా, దానితో పాటు 100 శాతం పెట్రోల్‌ను కూడా విక్రయించాలని కోరుతున్నారు. మా కార్లపై ప్రయోగాలు ఆపండి ఇంధనాన్ని ఎంచుకునే హక్కు భారతదేశానికి కావాలి మా వాహనాలు ప్రయోగ యంత్రాలు కావు. సంవత్సరాల ముందే పన్నులు చెల్లించి, మా కష్టార్జితంతో వాటిని కొన్నాము. మనది మధ్యతరగతి ప్రజలు అధికంగా ఉన్న దేశం, మరియు ఇంధన సామర్థ్యం ఫ్లెక్స్ వాహన వసతీరం మా రోజువారీ జీవనంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతాయి. అలాంటప్పుడు వాహన మన్నికలేమి అనుమానించకుండా, మా ఇంజిన్లపై ఎందుకు ప్రయోగాలు చేస్తున్నారని ఐజేపీ అడుగుతోంది. కొందరు వాహన యజమానులు 20 శాతం ఇథనాల్ కలిపిన ఇ20పెట్రోల్ వాడటం వల్ల వాహనాల ఇంజన్ల దెబ్బతింటున్నాయని, మైలేజ్ తగ్గిందని ఆరోపిస్తున్నారు. నిర్వహణ ఖర్చులు పెరిగినట్లు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం ఇ20 జనతా పార్టీ పేరిట ఉన్న ఎక్స్ ఖాతాకు 13 వేలకుపైగా, ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు 8,800కుపైగా ఫాలోవర్లు ఉన్నట్లు తెలుస్తోంది.

# కొట్టివేసిన మద్రాసు హైకోర్టు

>> తొక్కిసలాట బాధితుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలన్న ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని ప్రభుత్వనిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలపై సోమవారం జస్టిస్ సి.వి. కార్తికేయన్, జస్టిస్ ఆర్. శక్తివేల్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపి పిటిషన్లను సమర్థించింది. అంతకుముందు, నియామక ఉత్తర్వులను పంపిణీ చేయడానికి జులైలో కరూర్‌లో ఒక కార్యక్రమాన్ని నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు అనుమతినిచ్చింది. అయితే, ఆ ఉద్యోగ నియామకాలు తాత్కాలిక ప్రాతిపదికన ఉంటాయని, న్యాయ సమీక్షకు లోబడి ఉంటాయని కోర్టు అప్పుడే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ జరిపి విస్పష్ట తీర్పునిచ్చింది.

# అవగాహన పెంచండి

>> సాధారణ వర్షపాతం నమోదైందని చెప్పారు. మండల స్థాయిలో 249 మండలాలు తీవ్ర వర్షపాతం లోటులో, 359 మండలాలు వర్షపాతం లోటులో ఉండగా, కేవలం రెండు మండలాల్లో మాత్రమే అత్యధిక వర్షపాతం నమోదైందని తెలిపారు. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, కోస్తాంధ్ర, రాయలసీమ అనే నాలుగు వ్యవసాయ వాతావరణ మండలాలన్నీ ఇప్పటికీ వర్షపాతం లోటు కేటగిరీలోనే కొనసాగుతున్నాయని చెప్పారు. వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా జిల్లాస్థాయి ప్రమాద అంచనాలు, రైతులకు సూచనలు, ప్రత్యామ్నాయ విత్తనాల ప్రణాళిక మరియు దశలవారీ పంటల అత్యవసర ప్రణాళిక చర్యలను ఇప్పటికే ప్రారంభించామని సీఎం చంద్రబాబు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా అంచనా వేసిన 8,489 రైతు సేవా కేంద్రాలు మరియు 688 మండలాల్లో, 1,357 రైతు సేవా కేంద్రాలు, 168 మండలాలు అధిక ప్రమాద స్థాయిలో ఉన్నాయని సీఎం చంద్రబాబు చెప్పారు.సాగు విస్తీర్ణంపై ప్రత్యేక దృష్టి.జులై 25 నాటికి, 12 జిల్లాల్లో సాధారణంగా సాగు కావాల్సిన విస్తీర్ణంలో 50 శాతం కంటే తక్కువ విస్తీర్ణంలోనే పంటలు సాగయ్యాయని తెలిపారు. అన్నమయ్య జిల్లాలో 9 శాతం, బాపట్లలో 5 శాతం, ప్రకాశంలో 15 శాతం మరియు మార్కాపురంలో 15 శాతంతో పరిస్థితి అత్యంత ప్రభావితంగా ఉందన్నారు. 10 జిల్లాల్లో సాధారణ సాగు విస్తీర్ణంతో పోలిస్తే 51 శాతం నుంచి 100 శాతం మధ్య సాగు నమోదైందని చెప్పారు. శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, కర్నూలు, పశ్చిమ గోదావరి సహా ఆరు జిల్లాల్లో సాధారణ సాగు స్థాయిని మించి సాగు నమోదైందని వివరించారు. అధిక ప్రమాదంలో ఉన్న 168 మండలాల్లో, సీజన్ సాధారణ విస్తీర్ణంతో పోలిస్తే 39 శాతం సాగు నమోదైందని తెలిపారు. కర్నూలు జిల్లాలోని అధిక ప్రమాద మండలాలు సాగులో ముందంజలో ఉండగా, మార్కాపురం ప్రాంతంలోని అధిక ప్రమాద మండలాలు రాష్ట్రంలో అత్యంత వెనుకబడి ఉన్నాయని చెప్పారు. సీజన్ సాధారణ పంట విస్తీర్ణం 30.84 లక్షల హెక్టార్లుగా ఉండాల్సిన,ఇప్పటివరకు మొత్తం 16.35 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయని సీఎం చంద్రబాబు చెప్పారు. ఇది సీజన్ సాధారణ విస్తీర్ణంలో 39 శాతం మరియు ప్రస్తుత తేదీ నాటికి సాధారణంగా ఉండాల్సిన విస్తీర్ణంలో 74 శాతమని తెలిపారు.రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లో ప్రభుత్వ సేవల విషయంలో కొంత గ్యాప్ ఉందని సీఎం చంద్రబాబు చెప్పారు. ఆలూరు నియోజకవర్గ పర్యటనలో ఉద్యోగుల పనితీరును చవిచి విసిపించిన్నప్పుడు క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన ప్రతిస్పందనను అధికారుల వద్ద సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రంపచోడవరంలో విద్యార్థి శివాని ఆత్మహత్య చేసుకున్న ఘటనను సీఎం చంద్రబాబు అధికారుల వద్ద ప్రస్తావించారు. చదువులో టాపర్ అయిన శివాని చనిపోవడం చాలా ఆవేదన కలిగించిందని అన్నారు. విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని పరిశీలించేందుకు సైకో మెట్రిక్ టెస్టులను చేయించాలని విద్యా శాఖ ఆదేశించిందని, ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామని అధికారులు సీఎంకు వివరించారు. మానసిక పరిస్థితిని అంచనా వేసేందుకు నిపుణుల సేవలు తీసుకోవడంతోపాటు... టీచర్లకు కూడా అవసరమైన మేరకు శిక్షణ ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తిరుపతిలో తొలి కరోనా కేసు

>> పాజిటివ్ కేసు నమోదుతో యాత్రికుల్లో ఆందోళన భావం నెలకొంది. తిరుపతి అర్బన్ ప్రాంతానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి ఆదివారం కోవిడ్ పాజిటివ్‌గా తేలడంతో తిరుపతిలో మొదటి కేసు నమోదైంది. గత కొన్ని రోజులుగా ఆమె తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బాధపడుతోంది. ఆమెను కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించగా ఆమె పరిస్థితి నిలకడగా ఉంది. నాలుగురోజుల క్రిందట నిర్వహించిన పరీక్షల్లో కరోనా నిర్ధారణ అయింది. అయితే ఆమె కుటుంబ సభ్యులకు జరిపిన పరీక్షల్లో ఎలాంటి వైరస్ లక్షణాలు లేవని వైద్యారోగ్య శాఖ స్పష్టం చేసింది. గత శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో మరో 10 మందికి పైగా కరోనా బారిన పడ్డారనీ వైద్యశాఖ అధికారులు సమాచారం. దీంతో రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 498 చేరగా, ప్రస్తుతం వివిధ ఆసుపత్రుల్లో 24 మంది చికిత్స పొందుతున్నారు. ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో కొత్త కేసులు నమోదవగా కృష్ణా, తిరుపతి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ఒక్కో కేసు నమోదైంది. ఇప్పటివరకు రాష్ట్రంలో కరోనాతో నలుగురు మృతి చెందినట్లు వైద్యశాఖ గణాంకాల ద్వారా తెలుస్తోంది. కేసుల సంఖ్య పెరుగుతుండటంతో వైద్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు.తిరుపతిలోని రుయా ప్రభుత్వ ఆస్పత్రిలో కరోనా వైరస్ సోకిన వారికోసం ప్రత్యేక వార్డులు, పడకలు, వైద్యపరికరాలు, వైద్యసదుపాయాలు అందుబాటులో ఉంచడం జరిగిందని రుయా వైద్యులు తెలిపారు. తిరుపతి యాత్రాస్థలం కావడంతో ఇక్కడకు నిత్యం 70వేలమంది వరకు వివిధ రాష్ట్రాల నుండి విదేశాల నుండి యాత్రికులు తరలివస్తుంటారు. వీరిలో ఎవరికైనా అనుమానాస్పదంగా జ్వరం, జలుబు,దగ్గు ,శ్వాసకోశ సమస్యలు తీవ్రంగా ఉన్నా కరోనా వైరస్ భయం నెలకొంది.

# రాజమండ్రిలో మరో ఇద్దరికి కరోనా

**ఉప్పుటి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జులై27,ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జీజీహెచ్ లో సోమవారం నిర్వహించిన కోవిడ్ టెస్ట్ లో ఇరువురు మహిళలకు పాజిటివ్ నిర్ధారణ అయింది. జీజీహెచ్ లో 14 మందికి ర్యాపిడ్ టెస్టులు చేయగా ఇరువురు మహిళలలకు కోవిడ్ లక్షణాలు ఉన్నాయని వైద్యులు తెలిపారు. రాజమహేంద్రవరం శ్రీరంగం పట్నం చెందిన 29 ఏళ్ల మహిళ కు అలాగే రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం కి చెందిన 45 సంవత్సరాల మహిళకు పాజిటివ్ అయింది. ఆర్టీ పి సీఆర్ టెస్ట్ కోసం కాకినాడ పంపించినట్లు తెలిపారు రెండు రోజుల్లో రిపోర్ట్ రానున్నదని వివరించారు. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

# టెన్త్ విద్యార్థిని అనూహ్యంగా ఆత్మహత్య

>> మంత్రముగ్ధులు అయ్యారు. ఇంతలోనే ఈ విద్యార్థిని ఆత్మహత్య చేసుకోవటం అందరి మనసులను కలిచి వేసింది. విద్యార్థిని మృతి పై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్య మంత్రి పోలవరం జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ట్విట్టర్ వేదికగా విద్యార్థిని మృతి పై విచారం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి తన మనసును ఈ ఘటన కలచివేసింది అని పోస్ట్ చేశారు. మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా రంపచోడవరం మెగాపేరెంట్ టీచర్ మీటింగ్లో ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడిన శివాని మృతి తీవ్ర విషాదం నింపింది అని విషయం తెలిసినప్పటి నుంచి శివాని మాటలు పదేపదే గుర్తొస్తున్నాయి అని.సోదరి శివాని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నాను అని.ఎంత క్లిష్టమైనా పోరాడదాం. ఎంతటి సమస్యనైనా ఎదుర్కొందాం. మీకు నేనున్నాను ఈ ప్రభుత్వం ఉంది మన దేశ భవిష్యత్తు సంపద మీరు. అని లోకేష్ పోస్ట్ చేశారు. ఈ ఘటనపై ఇప్పటికే పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. కుటుంబ సభ్యులు అంత కలిసి ఉండాలని ఈ విద్యార్థిని రాసిన లేఖ ఘటన స్థలంలో లభించింది.ముఖ్యమంత్రి ప్రశంసలు అందుకున్న విద్యార్థిని ఆత్మ హత్య చేసుకోవటంతో రంపచోడవరం లో జరిగిన పి. టీ.యం కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరు శోక సంద్రంలో మునిగి పోయారు. ఈ విషాదం.

# బడులు, హాస్టల్స్‌లో స్టీమ్ రైస్ వాడకం

>> అనుసంధానం చేసి పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలోని ఒక జిల్లాలో మొదలు పెట్టేలా అనుమతి ఇవ్వాలని కోరారు. దీనికి కేంద్ర మంత్రివర్యులు సానుకూలంగా స్పందన వచ్చినట్లు ఆయన తెలిపారు. బియ్యం సంచులపై ఆర్ ఎఫ్ఐడిను ముద్రించడం ద్వారా అక్రమ రవాణా అరికట్టడానికి దోహదపడుతుందని, దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా రాష్ట్రంలో అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలన్నారు. రేషన్ బియ్యంలో 10 శాతం నూకల బియ్యం అందిస్తే, దీని వల్ల ప్రభుత్వానికి మంచి ఫలితాలు ఉంటాయని, దీన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్నామని తెలిపారు.అలాగే పెండింగ్ ఉన్న నిధులను విడుదల చేయాలని కోరారు. మంత్రి వెంట పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్నబాబు , పౌర సరఫరాల సంస్థ ఎండీ ఢిల్లీరావు, తదితరులు ఉన్నారు.

# లోక్‌సభకు 'పరీక్షల' బిల్లు

>> ఉద్దేశించిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను కేంద్ర ప్రభుత్వం సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఈనెల 20న విద్యార్థులపై జరిగిన పోలీసుల బలప్రయోగాన్ని నిరసిస్తూ ప్రతిపక్ష సభ్యులు నినాదాలు చేయడంతో సభలో గందరగోళం నెలకొంది. అటు రాజ్యసభలో కూడా ఇదే పరిస్థితి నెలకొనడంతో ఉభయసభలకు మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. పార్లమెంట్‌లో సంసద్ ఛలో కార్యక్రమం సందర్భంగా విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. పక్క సభ్యులు ఆందోళనల మధ్య కేంద్రమంత్రి జితేంద్రసింగ్ ఈ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్షాలు నిరసన కొనసాగించడంతో లోక్‌సభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. అటు రాజ్యసభలోనూ విద్యార్థులపై పోలీస్ గస్తీ హింసాకాండలో విపక్షాలు ఆందోళన చేపట్టాయి. విపక్షాల నిరసనల మధ్య మొదట మధ్యాహ్నం 12 గంటల వరకు రాజ్యసభ వాయిదా పడింది. తిరిగి సభ ప్రారంభమైన తర్వాత విద్యార్థులపై లాఠీఛార్జి పాటు పలు అంశాలపై చర్చ జరగాలని విపక్షాలు పట్టుబట్టాయి. ఈ క్రమంలో రాజ్యసభ మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా పడింది. ఆ బిల్లు ప్రకారం లీకేజీ పాల్పడే నిందితులకు పదేళ్ల జైలుశిక్ష, 50 లక్షల పైన విధించనున్నారు. వాస్తవానికి ఇవాళ 5 గంటలకు ఆ బిల్లుపై చర్చ చేపట్టాలని భావించారు. కానీ విద్యార్థులపై లాఠీఛార్జి ఇండిస్తూ విపక్షాలు సభలో నినాదాలు చేశాయి. దీంతో గందరగోళం మధ్య సభను మరుసటిరోజుకు వాయిదా వేశారు. సుమారు 6 గంటల పాటు బిల్లుపై చర్చ జరిగే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పరీక్షల సవరణ బిల్లుపై సమగ్ర చర్చ నిర్వహించాలని కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు మరోసారి విజ్ఞప్తి చేశారు. పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించకుండా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని బిల్లుపై నిర్మాణాత్మక చర్చ జరపాలని కోరారు. ప్రశ్నపత్రాల లీకేజీలు వంటి సమస్యలను పరిష్కరించేందుకు కీలక బిల్లును తీసుకొచ్చామని, కానీ కాంగ్రెస్, మరికొన్ని ప్రతిపక్ష పార్టీలు దీనిపై చర్చకు సిద్ధం కాకుండా సభలో అంతరాయం కలిగిస్తున్నాయని ఆయన అన్నారు. పరీక్ష వ్యవస్థలో సంస్కరణల కోసం ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపాదించిన చర్యలను ప్రతిపక్షాలు గుర్తించాలని రిజిజు కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలోఉంచుకుని ఈ బిల్లును ఆమోదించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. నాలుగు గంటల చర్చ ఈ బిల్లుపై లోక్‌సభలో నాలుగు గంటలపాటు చర్చ నిర్వహించాలని బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) నిర్ణయించినట్లు సమాచారం. బీజేపీ ఎంపీలు బన్సూరి స్వరాజ్, తేజస్వి సూర్యలతోపాటు జేడీయూ, టీడీపీ,శివసేన, ఎన్సీపీ, అప్నాదళ్, ఎల్‌జేపీ (రామ్‌విలాస్) తదితర పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొనే అవకాశం ఉంది.

**బిల్లులో ఏడు కీలక సవరణలు**

ఈ సవరణ బిల్లులో మొత్తం ఏడు కీలక మార్పులు ప్రతిపాదించారు. పేపర్ లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం, నిందితులకు కఠిన శిక్షలు విధించడం, అమలు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం పేర్కొంది. బిల్లు ప్రకారం, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది. ఛార్జిషీట్ దాఖలు చేసిన ఆరు నెలల్లో విచారణ పూర్తి చేయాలని ప్రతిపాదించారు. రెండు నెలల్లో దర్యాప్తు ముగించాల్సి ఉంటుంది. పరీక్ష అక్రమాల దర్యాప్తు కోసం కేంద్రం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయవచ్చు. రాష్ట్రాలు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమించుకునే అధికారం పొందుతాయి. నేరస్తులకు మరింత కఠిన జైలు శిక్షలు, భారీ జరిమానాలు విధించే అవకాశం ఉంటుంది. హైకోర్టు డివిజన్ బెంచ్‌లో నేరుగా అప్పీల్ చేసే విధానాన్ని కూడా బిల్లులో చేర్చారు.



సోమవారం న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్ వద్ద భార్యతో కలిసి బాపూజీకి నివాళులర్పిస్తున్న వాంగ్‌చుక్

## ఆకివీడు రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** ఆకివీడు రామాలయం నిర్మాణానికి సుప్రీంకోర్టు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిర్మాణానికి కలెక్టర్ ఇచ్చిన ఎన్‌ఓసీని సుప్రీంకోర్టు సమర్థించింది. అనుమానాలు ఉంటే మరో పిటిషన్ దాఖలు చేసుకోవచ్చన్నారు. ఆకివీడు రామాలయానికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురు

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** సుప్రీంకోర్టులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి చుక్కెదురైంది. ఏపీ లిక్కర్ స్కాంలో నిందితుడు దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. సోమవారం ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం విచారించింది. ఈ పిటిషన్‌లో పలు సందేహాలను చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏమైనా సందేహాలుంటే సరైన సమయంలో తమ అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించవచ్చని ఆ వైసీపీ నేతకు ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం స్పష్టం చేసింది. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌ను అప్రూవర్‌గా మార్చి.. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నారంటూ ఆ పిటిషన్‌లో వైసీపీ నేత చెవిరెడ్డి ఆరోపించారు. దొడ్డా వెంకట సత్యప్రసాద్‌కు ఇచ్చిన ముందస్తు బెయిల్ కొట్టివేయాలంటూ సుప్రీంకోర్టులో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేశారు.ఆంధ్రప్రదేశ్ మద్యం కుంభకోణం కేసులో దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి, దొడ్డా వెంకట సత్యప్రసాద్‌లను అప్రూవర్లుగా మార్చి తద్వారా వైసీపీ అధినేత వైఎస్ జగన్‌ని ఇరికించేందుకు కూటమి ప్రభుత్వంతోపాటు ఈ కేసు విచారిస్తున్న ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) కుట్ర పన్నుతున్నాయని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆరోపిస్తున్నారు.

## తమ్మినేని సీతారామ్ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**విజయవాడ, జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** వైఎస్సార్సీపీ నేత, మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్ కుమారుడికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తమ్మినేని కుమారుడు నాగ్‌కు ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. ఫోర్జరీ డిగ్రీపత్రాలతో అక్రమ రిజిస్ట్రేషన్‌కు పాల్పడిన కేసులో నాగ్ పిటిషన్ కొట్టివేసింది. ఇదే కేసులో తమ్మినేని సీతారామ్ సతీమణి వాణికి మధ్యంతర బెయిల్ మంజూరయ్యింది. ఎప్పుడు పిలిస్తే... అప్పుడు విచారణకు రావాలని వాణిని హైకోర్టు ఆదేశించింది.

## వన్ ఇండియా, వన్ సినిమా దిశగా ఎఫ్‌టిసి అడుగులు

>> ఇండియా వన్ సినిమా అనే విప్లవాత్మక లక్ష్యం ప్రతి ఒక్కరికీ చేరాలి. థియేటర్, టెలివిజన్, ఓటీటీ, ఈ మూడు రంగాలు సమానంగా వృద్ధి చెందడమే ప్రభుత్వ ఆకాంక్ష." అన్నారు."రాష్ట్రంలో క్రియేటివ్ ఎకానమీ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. భవిష్యత్తులో ఎఫ్‌టీపీసీ చేపట్టే అన్ని రకాల ప్రమోషనల్ కార్యక్రమాలకు, సినీ అభివృద్ధి చర్యలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సహకారం ఉంటుంది." అని హామీ ఇచ్చారు. క్రియేటివ్ ఎకానమీ ప్రతినిధులు త్వరలోనే రాజధాని అమరావతి, తిరుపతి కేంద్రాలుగా ఫిల్మ్, టెలివిజన్, థియేటర్ కార్యకలాపాలను విస్తృతంగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. భారతదేశంలో సినీసాంకేతిక, వినోదరంగాన్ని ఒకే గొడుగు కిందకి తెచ్చేందుకు ఎఫ్‌టీపీసీచేస్తున్న కృషిని మంత్రి దుర్గేష్ కొనియాడారు. మంత్రిని కలిసిన వారిలో ఎఫ్‌టీ పీసీ ఇండియా ప్రెసిడెంట్ చైతన్య జంగా, సెక్రటరీ వర్మ పాకలపాటి, నళినీ వెల్ఫేర్ ఫౌండేషన్ (పాన్ ఇండియా) ప్రెసిడెంట్ జయ పదేరియా, శ్రీనివాస్, ఈశ్వర్ ఉన్నారు.

## పొగాకు కొనుగోళ్లకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల మద్దతు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జులై 27,ప్రభాతవార్తప్రతినిధి:** పొగాకు కొనుగోళ్లకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మద్దతిస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఉమ్మడిగా రూ.188 కోట్లు భరించేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. ధరల లోటు భర్తీ కింద పొగాకు రైతులకు కిలో పొగాకు రూ.20 ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది.94 మిలియన్ కేజీల పొగాకు కొనుగోళ్లకు మద్దతిచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.పొగాకు బ్రైట్ రకం కిలో రూ.240, మీడియం రకం పొగాకు రూ.190, లో గ్రేడ్ పొగాకు రూ.110 మేర తగ్గకుండా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు.పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్రంతో నిత్యం సీఎం చంద్రబాబు సంప్రదింపులు జరిపారు.రాష్ట్ర ప్రభుత్వం.ఇందు రోజుల క్రితం సీఎం చంద్రబాబును కలిసిన కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, డైరెక్టర్. సీఎం సూచనల మేరకు పొగాకు రైతులను ఆదుకునేందుకు సహకరించాలని కోరుతూ రాష్ట్రం లోని కేంద్ర ప్రతినిధులు.బయ్యర్లతో చర్చలు జరిపారు.

### వారం - వర్జ్యం

28-07-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢమాసం, దక్షిణాయనం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, పుష్యమి కార్తె
చతుర్దశి సా.6.17,
పూర్వాషాఢ ను.1.09
వర్జ్యం : రా.9.58-రా.11.44
దు.ఉ.8.21-ఉ.9.13,
రా.11.50-రా.12.42
రాహుకాలం – మ.3.00-4.30

### వారఫలం

**మేషం:** బంధువుల నుండి ఆహ్వానాలు అందుతాయి. ఆదాయం ఆశ్చర్యకరంగా లభిస్తుంది. ప్రయాణాలు వాయిదా వేస్తారు.

**వృషభం:** జీవిత భాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. దేవాలయ సందర్శనం చేసుకుంటారు.

**మిథునం:** ముఖ్యమైన విషయాలలో తొందరపాటు వద్దు. భూముల క్రయ విక్రయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం మంచిది.

**కర్కాటకం:** పెట్టుబడులకు అనుకూల కాలం. సంఘాలలో మీ వంతు సహకారాన్ని అందిస్తారు. వ్యాపారాల్లో లాభాలు పొందుతారు.

**సింహం:** ఇంటి యందు శుభకార్యాల ప్రస్తావన వస్తుంది. సంతానపు విద్య విషయంలో జాగ్రత్తలు తీసుకుంటారు.

**కన్య:** వృత్తిపరంగా ఎదురుదెబ్బలు తగిలినా కుదుటపడతారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. పని ఒత్తిడి తగ్గుతుంది.

**తుల:** ఆలోచనలు ఫలిస్తాయి. కొత్త అనుభవాలు ఎదురవుతాయి. కోపతాపాలకు దూరంగా ఉండండి.

**వృశ్చికం:** ఆందోళనలో ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుంది. సాంకేతిక రంగంలోనివారికి అనుకూలంగా ఉంటుంది.

**ధనుస్సు:** వివాదాస్పద అంశాలు పరిష్కారం అవుతాయి. ఆరోగ్యం మెరుగుపడుతుంది.

**మకరం:** అన్ని విషయాలు సవ్యంగా జరుగుతాయి. ఆర్థిక స్థితి మెరుగవుతుంది. ఇతరుల సలహాలు పాటించండి.

**కుంభం:** మొండి వైఖరితో ఇబ్బందులు ఎదురవుతాయి. నిర్ణయాలు తీసుకునే ముందు ఆలోచించండి.

**మీనం:** సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. నూతన ఒప్పందాలలో నిదానం అవసరం. ప్రయాణాలలో జాగ్రత్తలు పాటించండి.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## అబ్దుల్ కలాంకు సిఎం, డి.సిఎం నివాళి



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** భారతరత్న, మాజీ రాష్ట్రపతి ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నివాళి అర్పించారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ దేశానికి శాస్త్ర, సాంకేతిక పరంగా అబ్దుల్ కలాం ఎన్నో విజయాలను అందించారని సిఎం చంద్రబాబు కొనియాడారు. దేశానికి శాస్త్ర, సాంకేతికపరమైన ఎన్నో విజయాలను అందించి, మిస్సైల్ మ్యాన్‌గా గుర్తింపు పొందిన భారతరత్న ఏపిజె అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా నివాళి అర్పిస్తున్నాను అంటూ సిఎం పోస్ట్ చేశారు. తన నిరాడంబరత, నిజాయితీ, మానవతా దృక్పథం వంటి విశిష్ట లక్షణాలతో ప్రజల రాష్ట్రపతిగా కలాం పిలువబడ్డారు. ఆ మహనీయుని వర్ధంతి సందర్భంగా స్మరిస్తూ నివాళి అర్పించారు. డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం ఒక జాతి భవిష్యత్తును తీర్చిదిద్దుతూనే ఉన్న ఒక దార్శనికతను వదిలి వెళ్లారని డిప్యూటీ సిఎం పవన్ 'ఎక్స్' ఖాతాలో అన్నారు. ఆయన వర్ధంతి సందర్భంగా, భారతరత్న డా. ఏ.పి.జె. అబ్దుల్ కలాంకు వినయపూర్వక నివాళి అర్పించారు. ఆయనను భారత క్షిపణి మానవుడు ఇస్రో, డిఆర్‌డిఓ ద్వారా భారతదేశ అంతరిక్ష, రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసిన ప్రముఖ శాస్త్రవేత్త, భారతదేశ 11వ రాష్ట్రపతి, స్ఫూర్తిదాయకమైన ఉపాధ్యాయుడు, ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఒకరు అంటూ పవన్ కల్యాణ్ కొనియాడారు. ఆధునిక భారతదేశపు గొప్ప జాతి నిర్మాతలలో ఏపిజె ఒకరని పవన్ అన్నారు.

## సిఆర్‌పిఎఫ్ జవాన్లకు డి.సిఎం శుభాకాంక్షలు



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** సిఆర్‌పిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్‌కు చెందిన ధైర్యవంతులైన జవాన్లకు డి.సిఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియజేశారు. 'దేశం చూసే ప్రతి శాంతియుత సూర్యోదయం.. చీకటి వేళల్లోనూ మెలకువగా ఉండే జవాన్ల ధైర్యంతో భద్రంగా ఉంటున్నారు. వారి అచంచలమైన ధైర్యం, సాటిలేని క్రమశిక్షణ, నిస్వార్థ సేవ భారతదేశ అంతర్గత భద్రతకు ఒక శాశ్వతమైన స్తంభంగా నిలిచాయి. ఉగ్రవాదంతో పోరాడటంలో, వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కోవడంలో, ప్రజాస్వామ్య సంస్థలను పరిరక్షించడంలో, ప్రకృతి వైపరీత్యాలకు స్పందించడంలో, లేదా సంక్షోభ సమయాల్లో పౌరులను రక్షించడంలో అయినా సిఆర్‌పిఎఫ్ ఎల్లప్పుడూ అసాధారణ శౌర్యంతో దేశం పట్ల అచంచలమైన నిబద్ధతతో ముందు వరుసలో నిలిచింది. ప్రతి యూనిఫాం త్యాగానికి ప్రతీక. ప్రతి మిషన్ స్వార్థానికి అతీతమైన కర్తవ్యాన్ని ప్రతిబింబిస్తోంది. ప్రతి ధైర్యసాహసాల చర్య దేశ విశ్వాసాన్ని, ఐక్యతను బలపరుస్తోంది. ధైర్యవంతులైన సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కుటుంబాలకు వందనం. వారి నిశ్శబ్ద త్యాగాలు, స్థిరమైన మద్దతు ప్రతి సిఆర్‌పిఎఫ్ యోధుని సంకల్పాన్ని బలపరుస్తాయి' అని ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## ముర్రం శివాని బలవన్మరణం తీవ్ర విషాదంలోకి నెట్టేసింది: సిఎం చంద్రబాబు

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ముర్రం శివాని తనువు చాలించడం తీవ్ర విషాదంలోకి నెట్టేసిందని సిఎం చంద్రబాబు తెలిపారు. మెగా పిటిఎం వేదికపై ఉత్సాహంగా మాట్లాడిన శివాని బలవన్మరణం ఆవేదన కలిగించిందని 'ఎక్స్' వేదికగా అన్నారు. 'ఆమె తన చదువు, ఉన్నత లక్ష్యాలపై శివాని చెప్పిన మాటలు గుర్తుకొస్తున్నాయి. ఎంతో భవిష్యత్తు ఉన్న గిరిజన బిడ్డ ఇలా తనువు చాలించడం బాధాకరం. కారణాలు ఏమైనా తన కలలు నిజం కాకుండానే విద్యార్థిని దూరమవడం కలచివేస్తోంది. శివాని మృతిపై పూర్తి దర్యాప్తు జరిపాలని అధికారులను ఆదేశించాను. సమస్యలు, కష్టాలు వచ్చినా విద్యార్థులు, యువత ధైర్యంగా నిలబడాలి. ఎవరూ ఒత్తిడి, నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దని కోరుతున్నా. ఎంతటి సమస్యకైనా పరిష్కారం ఉంటుంది. మీ బాధ, ఆవేదనను మీ కుటుంబసభ్యులు, స్నేహితులతో పంచుకోండి. ఒత్తిడిని అధిగమించి మీ కలలను నిజం చేసుకునేలా ముందుకు సాగండి. ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని తెలియజేస్తున్నా' అని సిఎం చంద్రబాబు అన్నారు. శివాని మృతి పట్ల దిగ్భ్రాంతికి లోనవుతున్నట్లు చంద్రబాబు తెలిపారు.

## శివానీ మృతిపై విచారణ జరిపించాలి: సిపిఎం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రంపచోడవరం మండలం ఇర్లపల్లి కొత్త కాలనీకి చెందిన గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ (15) అకాల మరణం దిగ్భ్రాంతిని, విచారాన్ని కలిగించిందని సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తెలిపారు. శివానీ మృతి అత్యంత బాధాకరమని, వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. నిన్నటివరకు ముఖ్యమంత్రితో సహా అందరి చేత ప్రశంసలు పొంది, ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన ఒక విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం అనేక అనుమానాలకు, ప్రశ్నలకు తావిస్తోంది. చిన్నారిని ఆత్మహత్యకు పురికొల్పిన పరిస్థితులు ఏమిటి? ఆమె ఎదుర్కొన్న మానసిక ఒత్తిడికి కారణాలు ఏమిటి? అనే అంశాలపై సమగ్రంగా, నిష్పాక్షికంగా ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. శివానీ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. ఆ కుటుంబానికి తక్షణమే రూ. 25 లక్షల పరిహారం అందించాలనీ వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

## శివానీ మృతిపై సమగ్ర దర్యాప్తు జరపాలి: సిపిఐ

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** గిరిజన విద్యార్థిని ముర్రం శివానీ (15) మరణంపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరిపించి, ఆత్మహత్యకు గల కారణాలను వెలికితీయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. విద్యార్థిని ముర్రం శివానీ అకస్మాత్తుగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి, మరణించడం కలచివేసింది. శివానీ మృతిపట్ల ప్రగాఢ సంతాపాన్ని, కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తున్నామని పేర్కొన్నారు. ముర్రం శివానీ మరణం ఒక ప్రశ్నగా మిగిలిపోకూడదు. శివానీని ఆత్మహత్యకు పురిగొల్పిన పరిస్థితులు, మానసిక సంఘర్షణకు గల కారణాలను కనుగొనేలా రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి, నిజానిజాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు.

## సెప్టెంబర్‌లో జిఎన్‌యం సప్లిమెంటరీ పరీక్షలు

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త:** రాష్ట్రంలోని జిఎన్‌యం విద్యార్థులకు సెప్టెంబర్ నెలలో సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ సోమవారం ఓప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ బోర్డు ఆధ్వర్యంలో జరుగనున్న ఈపరీక్షలకు అర్హులైన విద్యార్థులు సంబంధిత ప్రభుత్వ, ప్రయివేటు కళాశాలల ప్రిన్సిపాళ్ళ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, పరీక్షల షెడ్యూల్ పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను సందర్శించాలని వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ ఏ.విష్ణువర్ధన్ సూచించారు.

# డిఎస్సీ ఆరోపణలపై చర్చకు సిద్ధం

● వైసిపి హయాంలో లిక్కర్, భూకుంభకోణాలపై కూడా చర్చిద్దాం ● అభివృద్ధి - సంక్షేమం మా సిద్ధాంతం, విధ్వంసం, బూతులు గొడ్డలిపార్టీ విధానం ● స్థానిక సంస్థల ఎన్నికల్లో నూరుశాతం విజయమే లక్ష్యంగా కేడర్ పనిచేయాలి ● పెనమలూరు నియోజకవర్గ టిడిపి కార్యకర్తల సమావేశంలో మంత్రి నారా లోకేష్





**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** డిఎస్సీపై గొడ్డలి పార్టీ అధినేత చేస్తున్న ఆరోపణలపై చర్చకు తాను సిద్ధం అని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ జగన్‌కు సవాల్ విసిరారు. కంకిపాడు ఆయాన్ కన్వెన్షన్ సెంటర్‌లో సోమవారం నిర్వహించిన పెనమలూరు అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ డిఎస్సీపై ఆరోపణలతోపాటు వైసిపి హయాంలో లిక్కర్ భూ కుంభకోణాలపై కూడా చర్చకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 2లక్షల టీచర్ పోస్టులు భర్తీచేసిన చరిత్ర టిడిపిది అని, ఐదేళ్ల వైసిపి హయాంలో ఒక్క టీచర్ పోస్టు కూడా భర్తీ చేయలేని నీచ చరిత్ర జగన్‌ది అని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను అమలుచేసి అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహిస్తే బురద జల్లుతున్నారు, 150రోజుల్లో విజయవంతంగా డిఎస్సీ నిర్వహిస్తే 150కేసులు వేసి అడ్డుకోవాలని చూశారు, వారు వేసిన కేసులన్నీ న్యాయస్థానాలు కొట్టివేయడం మా చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెడ్ల బండిలా ముందుకు తీసుకెళ్తున్నామని, వీటన్నింటినీ పార్టీ కేడర్ ప్రజల్లోకి తీసుకెళ్లాలని లోకేష్ కోరారు. ఇంటింటికీ తెలుగుదేశం (డోర్ టు డోర్) కార్యక్రమం ద్వారా పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను పట్టుదల, క్రమశిక్షణతో అమలుచేయాలని కోరుతున్నా. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, గొడ్డలి పార్టీ విధ్వంసం, ఫేక్ ప్రచారాలను ప్రజలకు వివరించాలి. టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తల మధ్య ఐక్యత చాలా అవసరం. నాయకులు, కార్యకర్తలంతా రాష్ట్రంలోని ప్రతి గడప తొక్కాలి అని పార్టీ శ్రేణులకు మంత్రి లోకేష్ పిలుపునిచ్చారు.

**బిళ్ల సత్యనారాయణను పరామర్శించిన మంత్రి లోకేష్**

పెనమలూరు మండలం గోసాలలోని వేణుగోపాలస్వామి నగర్‌లో నివాసం ఉంటున్న టిడిపి సీనియర్ కార్యకర్త బిళ్ల సత్యనారాయణను పరామర్శించారు. పార్టీ ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలో అంకితభావంతో బిళ్ల సత్యనారాయణ పనిచేస్తున్నారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమానికి పసుపు రంగు చొక్కా ధరించి, తన ద్విచక్ర వాహనంపై టిడిపి జెండాతో హాజరవుతూ గుర్తింపుపొందారు. గత మూడేళ్లుగా కిడ్నీ వైఫల్యంతో బాధపడుతున్నారు. చిన్న కిరాణషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె అనారోగ్య సమస్యల కారణంగా మరణించగా చిన్న కుమార్తె ఇటీవల భర్తను కోల్పోయి తన పిల్లలతో కలిసి తల్లిదండ్రుల వద్ద నివసిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లిన మంత్రి నారా లోకేష్, బిళ్ల సత్యనారాయణ, ఇతర కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బిళ్ల సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితిని, కుటుంబ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ బాధ్యత తాను తీసుకుంటానని, అన్ని విధాల అండగా ఉంటానని మంత్రి వారికి హామీ ఇచ్చారు.

# డిఎస్సీపై గొడ్డలి పార్టీ అబద్ధాలు

● సమైక్యాంధ్ర, నవ్యాంధ్రలో ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త చంద్రబాబు ● 9 డిఎస్సీలతో 1.80 లక్షల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ ఘనత బాబుదే ● డిఎస్సీ ఎందుకు పెట్టలేదో వైసిపి నేతలు జగన్‌నే అడగాలి ● డిఎస్సీపై బొత్స కామెంట్లు వెనక్కు తీసుకోవాలి: మంత్రి కొండపల్లి శ్రీనివాస్



**విజయనగరం, జులై 27 ప్రభాతవార్త:** గొడ్డలి పార్టీ అవాస్తవాలతో కూటమి ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ, యువతలో అపోహలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విమర్శించారు. డిఎస్సీపై వైసిపి నేతల ఆరోపణలు, మంగళవారం తలపెట్టిన ధర్నా నేపథ్యంలో మంత్రి సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ సమైక్యాంధ్రలోనూ, నవ్యాంధ్ర లోనూ ఉపాధ్యాయ ఉద్యోగాల సృష్టికర్త అంటే చంద్రబాబు ఒక్కరే అని ఆయన ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 9 డిఎస్సీలతో 1.80 లక్షలకు పైగా ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేశారని మంత్రి కొనియాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మెగా డిఎస్సీపై తొలి సంతకం పెట్టి ఆరు నెలల్లోనే 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసిన ఘనత కూడా చంద్రబాబుకే దక్కిందన్నారు. డిఎస్సీపై వైసిపి ప్రభుత్వం 230కి పైగా కేసులు వేసినా ప్రభుత్వం ఆన్సర్ షీట్లు, ఫలితాలు, ఎంపిక అన్ని విషయాలు ఆన్‌లైన్‌లో పొందుపరిచి తన పారదర్శకత నిరూపించుకుందన్నారు. గత ప్రభుత్వం 8 వేల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క డిఎస్సీ కూడా నిర్వహించలేక నిరుద్యోగులు, యువతను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఐదేళ్ల పాలనలో ఒక్క డిఎస్సీ నిర్వహించని జగన్‌ను వైసిపి నేతలు ఎందుకు? ప్రశ్నించడం లేదని మంత్రి వైసిపి నేతలకు చురకలు అంటించారు. కూటమి ప్రభుత్వం వచ్చాకే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు షైనింగ్ స్టార్స్ అవార్డులు వస్తున్నాయని, ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలల విద్య ఏ స్థాయిలో ఉందో చెప్పేందుకు నిదర్శనం అన్నారు.

**బొత్స కామెంట్లకు మంత్రి కొండపల్లి చురకలు:** డిఎస్సీపై బొత్స కామెంట్లకు మంత్రి కొండపల్లి చురకలు అంటించారు. గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స గౌరవ ప్రదంగా తన స్థాయికి తగినట్టుగా మాట్లాడాలని మంత్రి కొండపల్లి హితవు పలికారు. వోక్స్ వ్యాగన్ లావాదేవీలతో బొత్స రాష్ట్రానికి పెద్ద మచ్చ తేవడంతోనే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు మహారాష్ట్రకు వెళ్లిందని విమర్శించారు. గత డిఎస్సీలో విజయనగరం జిల్లాలో 583 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు వచ్చాయని, డిఎస్సీ పరీక్ష ఎంత పారదర్శకంగా జరిగిందో బొత్స ఆ ఉపాధ్యాయులను అడిగితే చెపుతారన్నారు. బొత్స తక్షణమే డిఎస్సీపై చేసిన కామెంట్లను వెనక్కు తీసుకోవాలని మంగళవారం వైసిపి ధర్నా చేస్తే ఉపాధ్యాయులు, నిరుద్యోగులు వాళ్లనే ఛీ కొడతారని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వంలో ఒక్క డిఎస్సీ పరీక్ష కూడా ఎందుకు నిర్వహించలేదన్న ప్రశ్నకు బొత్స ఏమని సమాధానం చెపుతారని మంత్రి ప్రశ్నించారు.

# ఎపిలో 1000 'మీ మార్ట్స్'

● ఎన్‌సిసిఎఫ్‌తో పౌరసరఫరాల శాఖ కీలక ఒప్పందం



మంత్రి నాదెండ్ల సమక్షంలో కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో పౌర సరఫరాల శాఖ ఎంఒయు చేసుకున్న దృశ్యం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు నాణ్యమైన నిత్యావసర వస్తువులను సరసమైన ధరలకు అందించేందుకు ఎపి ప్రభుత్వం కీలక కార్యాచరణకు ఉపక్రమించింది. కేంద్ర ప్రభుత్వ నేషనల్ కోఆపరేటివ్ కన్స్యూమర్ ఫెడరేషన్‌తో ఎపి పౌర సరఫరాల శాఖ కీలక అవగాహన ఒప్పందం (ఎంఒయు) కుదుర్చుకుంది. ఢిల్లీలో పౌర సరఫరాల కమిషనర్ కన్నబాబు ఎన్‌సిసిఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అనీస్ జోసెఫ్ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,000 'మీ మార్ట్స్' ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఈ సేవలను ప్రారంభించనున్నారు. రేషన్ దుకాణాల ద్వారానే 'మీ మార్ట్స్' సేవలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మార్ట్స్‌లో 70రకాల నాణ్యమైన వినియోగ వస్తువులు పోటీ ధరలకు విక్రయించనున్నారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులను సరసమైన ధరల్లో అందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,000 'మీ మార్ట్స్' ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మరింత ప్రయోజనం చేకూరనుంది. ఈ సమాచారాన్ని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తన 'ఎక్స్' ఖాతాలో వెల్లడించారు.

# రాష్ట్రం, ప్రజల గురించే సిఎం చంద్రబాబు తపన

● కుటుంబం గురించి ఆలోచించరు.. అభివృద్ధికి చర్యలు ● ప్రభుత్వం ప్రజల ఇంటి గడప తొక్కుతోంది ● ప్రజలు కూటమి ప్రభుత్వంతో చేయి కలపాలి ● సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి



రామకుప్పం మండలం ననియాలతో మహిళలనుద్దేశించి ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి

**కుప్పం, జులై 27 ప్రభాతవార్త:** సిఎం చంద్రబాబు నాయుడు నిత్యం రాష్ట్రం, రాష్ట్ర ప్రజల గురించే తపన పడుతుంటారని కుటుంబం గురించి ఆలోచించరని సిఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. నాలుగు రోజుల కుప్పం పర్యటనలో భాగంగా సోమవారం నారా భువనేశ్వరి రామకుప్పం మండలం కావలి మడుగు గ్రామంలో ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంను ప్రారంభించారు. ననియాల, పిఎంకె తాండా, పంద్యాలమడుగు, రామకుప్పం గ్రామాల్లో పర్యటించి మహిళలు, ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా నారా భువనేశ్వరి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఉన్న సమయంలో సిఎం చంద్రబాబు విజన్ 2020తో ఐటి రంగాన్ని అభివృద్ధి చేశారన్నారు. నేడు రాష్ట్ర విభజన అనంతరం ప్రతి నియోజకవర్గం అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. వైజాగ్ ఐటి హబ్‌గా, అనంతపురం ఆటో మొబైల్ హబ్‌గా రూపుదిద్దుకుంటున్నాయని చెప్పారు. కుప్పానికి సైతం ముప్పై పరిశ్రమలు తీసుకువచ్చారన్నారు. 732కి.మీ.ల దూరంలో ఉన్న కృష్ణాజలాలను రూ.3600 కోట్ల ఖర్చుతో కుప్పానికి తెచ్చారని పేర్కొన్నారు. నదుల అనుసంధానంతో అన్ని ప్రాంతాలకు సాగు, తాగునీరు అందిస్తున్నారన్నారు.

**వైఎస్సార్సీ పాలనలో నోరు తెరవలేని దుస్థితి:** ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో ప్రజలు నోరుతెరవలేని దుస్థితి నెలకొనడంతో పాటు ఎవరు ఉంటారో ఎవరు పోతారో తెలియని పరిస్థితి ఉండేదని నారా భువనేశ్వరి పేర్కొన్నారు. ఐదేళ్లలో అరాచకాలు చేశారని ఈ విషయం ప్రజలు గుర్తించే సిఎం చంద్రబాబుపై విశ్వాసంతో గెలిపించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలు ఎన్టీఆర్ భరోసా, దీపం 2, స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికివందనం పథకాలు అమలు చేస్తున్నారన్నారు. పేదల ఆకలి తీర్చేందుకు అన్నక్యాంటీన్లు ప్రారంభించాం న్నారు. తాను కష్టపడతానని సంపద సృష్టించి ప్రజలకు పంచుతానని సిఎం చంద్రబాబు పేర్కొంటుంటారన్నారు.

**ప్రజలు ప్రభుత్వంతో చేయి కలపాలి:** ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రజల ఇంటి గడప తొక్కుతోందని ప్రజలు కూడా ప్రభుత్వంతో చేయి కలపాలని నారా భువనేశ్వరి పిలుపునిచ్చారు. నలభై సంవత్సరాలుగా సిఎం చంద్రబాబుకు ఓట్లేసి నాలుగుసార్లు ముఖ్యమంత్రిని చేసిన కుప్పం ప్రజలకు తాను చంద్రబాబు భార్యగా మరువనని పేర్కొన్నారు. కుప్పం ప్రజలంటే సిఎం చంద్రబాబుకు ఎంతో అభిమానం అన్నారు. కుప్పాన్ని మరింత అభివృద్ధి చేసి టూరిజం చిత్రపటంలో కుప్పానికి స్థానం కల్పిస్తారని పేర్కొన్నారు. అంతకుముందు గ్రామాల్లో నారా భువనేశ్వరికి మహిళలు మంగళహారతులతో ఘనస్వాగతం పలికారు. నారాయణపురం తాండాలో దివంగత ఎన్టీఆర్ విగ్రహాన్ని నారా భువనేశ్వరి ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ బిఆర్ సురేష్‌బాబు, సిఎం పిఎ శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, ఎఎంసి ఛైర్మన్ జిఎం రాజు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరమణ, మాజీ అధ్యక్షులు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, నేతలు పట్ర నారాయణ, కృష్ణానాయక్, మనోహర్, రఫీ, చంద్రారెడ్డి

## కృష్ణా జలాల్లో వాటాపై సుప్రీంలో విచారణ

● కర్ణాటక విజ్ఞప్తిని తిరస్కరించిన ధర్మాసనం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జలాల్లో వాటాకు సంబంధించి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తీర్పును సవాల్ చేస్తూ ఎపి ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం కేసును పరిశీలించింది. సుదీర్ఘ విచారణ చేయాల్సి ఉన్నందున ఈ కేసును ప్రత్యేక బెంచ్ ముందు విచారణకు నివేదిస్తామని వెల్లడించింది. అనంతరం తదుపరి విచారణను సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా వేసింది. ఈలోగా తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేయాలంటూ కర్ణాటక ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాల్సిన అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. కృష్ణా నదీ జలాల వాటాలపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ట్రిబ్యునల్ తీర్పును కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేయకుండా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఎపి ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పైనే ప్రస్తుతం సుప్రీంకోర్టులో విచారణ కొనసాగుతోంది.

## బిజెపి మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశం

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** బిజెపి రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర మైనారిటీ మోర్చా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అన్ని మతాలు ఒకటిగా ఉండాలని అన్నారు. రామజన్మ భూమి అంశాన్ని హిందూ- ముస్లిం కోణంలో చూడొద్దని మాధవ్ పేర్కొన్నారు. మత సమభావన అనేది మా సిద్ధాంతమని, వివక్ష లేని పాలన అందిస్తున్నామని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ అన్నారు.

## 15 మంది బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కులు



**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** అనారోగ్య సమస్యలతో ఆర్థిక సహాయం కోసం ఎదురు చూస్తున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా సహాయం అందించేందుకు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి కార్యాలయానికి వచ్చిన సిఎంఆర్ఎఫ్ అర్జీలను స్వయంగా పరిశీలించి ప్రత్యేక సాయం అందేలా చూశారు. సోమవారం మధ్యాహ్నం మంగళగిరి జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో సిఎంఆర్ఎఫ్ చెక్కులను శాసనమండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కళ్యాణం శివ శ్రీనివాసరావు 15 మంది బాధితులకు రూ.12.78 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయానికి, తమ సమస్యలను గుర్తించి స్పందించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# పిహెచ్‌సిల పనితీరుకు 'ఆరోగ్య ఫలితాల్లే' ప్రామాణికం: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు మదింపులో కూటమి ప్రభుత్వం సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఎంతమంది రోగులకు సేవలు అందించారు? ఎన్ని పరీక్షలు చేశారు? ఎన్ని ప్రసవాలు నిర్వహించారు? అనే లెక్కలను మాత్రమే కాకుండా అందించిన వైద్య సేవల వల్ల ప్రజల ఆరోగ్యంలో ఎంత మార్పు వచ్చింది? మాతా శిశు మరణాలు తగ్గాయా? రక్తపోటు, మధుమేహ రోగులకు నిరంతర చికిత్స అందుతోందా? లేదా? సేవలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారా? అనే ఫలితాల ఆధారంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గుర్తించనున్నారు. ఇందుకోసం మొత్తం 21 కీలక పనితీరు సూచికలతో కొత్త ర్యాంకింగ్, గ్రేడింగ్ విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. సంజీవని. మాతృత్వ, క్షేమ కార్యక్రమాలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును అనుసంధానిస్తూ గ్రామస్థాయి వైద్య వ్యవస్థను మరింత జవాబుదారీగా, ఫలితాల ఆధారితంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దడమే ఈ కొత్త ర్యాంకింగ్ విధానం ప్రధాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఐదు అంశాల పరిమితికి స్వస్తి ప్రస్తుతం 5 అంశాల ఆధారంగానే వైద్యారోగ్య శాఖ ర్యాంకులను ప్రకటిస్తోంది. ఓపీ విధానంలో రోగుల సంఖ్య, ఆసుపత్రిలో చేరినవారు, ల్యాబ్ పరీక్షలు, ప్రసవాలు, గర్భనిరోధక సాధనాల వాడకం వంటి ఐదు అంశాల ఆధారంగానే పిహెచ్‌సిల పనితీరును అంచనా వేసేవారు. ఈ విధానంలో సేవల సంఖ్య మాత్రమే తెలుస్తోందని, వ్యాధుల నివారణలో సాధించిన పురోగతి, మాతా శిశు ఆరోగ్య ఫలితాలు, దీర్ఘకాలిక వ్యాధుల నియంత్రణ, రోగులకు నిరంతర చికిత్స వంటి కీలక అంశాలు ప్రతిబింబించడం లేదని అధికారుల పునస్సమీక్షలో తేలింది. ఈ విధానం అమలు, ఫలితాలపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ జారీ చేసిన ఆదేశాల మేరకు అధికారులు పునస్సమీక్ష జరిపారు. సేవలు మెరుగుపడాలంటే 21 కొలమానాల ఆధారంగా ర్యాంకులను ప్రకటించాల్సిన అవసరం ఉందని మంత్రికి నివేదించారు. వీటికి మంత్రి ఆమోదం తెలుపుతూ గ్రామీణులకు వైద్య సేవలు అందించడంలో కీలకంగా ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరు ఈ కొత్త ర్యాంకింగ్ విధానంతో మరింత మెరుగుపడుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. పిహెచ్‌సిల్లో వైద్య సేవలు పొందిన ప్రజలు ఐవిఆర్ఎస్ ద్వారా తెలియజేసే అభిప్రాయాన్ని కూడా ర్యాంకింగ్‌లో భాగం చేశారు. "నెలనెలా ర్యాంకులు ప్రకటించడం ద్వారా వెనుకబడిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను వెంటనే గుర్తించి లోపాలను సరిదిద్దుతాం. ఈ కొత్త ర్యాంకింగ్ విధానాన్ని అమలు ప్రక్రియను ప్రారంభించామ్మ అని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జి.వీరపాండియన్ తెలిపారు.

28-7pg4:28-7pg4.qxd 7/27/2026 10:48 PM Page 1



వార్త

తెలివిగల వ్యక్తి తన ఆర్థిక విషయాలను, మానసిక సంఘర్షణలను, గృహసంబంధమైన విషయాలను ఎప్పుడూ రహస్యంగానే ఉంచుతాడు.

న- శామ్యూల్ జాన్సన్

# సర్టిఫికెట్లు కాదు, విద్యార్థులకు నైపుణ్యం ముఖ్యం

**విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్ర మలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించడం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరిపోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రాల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే.**

డి.వి.బి శ్రీహరిన్

ఒకప్పుడు విద్య ఉద్యోగానికి మార్గం. నేడు విద్య ఉద్యోగానికి హామీ కాదు. ఇదే ఇరవై ఒకటో శతాబ్దపు అతి పెద్ద సామాజిక, ఆర్థిక వైరుధ్యం. ప్రతి సంవత్సరం లక్ష లాది మంది యువత డిగ్రీలు, పీజీలు, వృత్తిపరమైన అర్హ తలు సంపాదించి ఉద్యోగ విపణిలోకి ప్రవేశిస్తున్నారు.అయినప్పటికీ నిరుద్యోగం తగ్గడం లేదు. అదే సమయంలో పరిశ్రమలు మాత్రం 'పనికి సిద్ధంగా ఉన్న నైపుణ్యం కలిగిన యువత దొరకడం లేదు' అని వాపోతున్నాయి. ఒకవైపు సర్టిఫికెట్లు పెరుగుతుంటే, మరోవైపు సామర్థ్యం కొరత కొనసాగుతోంది. సమస్య ఉద్యోగాల్లో లేదు. సమస్య విద్యలో లేదు, సమస్య ఈ రెండింటి మధ్య తెగిపోయిన సంబంధంలో ఉంది. ప్రపంచ ఆర్థికవ్యవస్థ నైపుణ్యాలను కోరుతున్న వేళ, మన విద్యా వ్యవస్థ ఇంకా సర్టిఫికెట్లను ఉత్పత్తి చేస్తోంది. ఈ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలంటే ముందు భారత ఉన్నత విద్య విస్తరణను చూడాలి. ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్ఈ) ప్రకారం దేశంలో 4.3 కోట్లకు పైగా విద్యార్థులు ఉన్నత విద్యలో ఉన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉన్నత విద్యా వ్యవస్థల్లో భారత్ ఒకటి. స్వాతంత్ర్యం తర్వాత విద్యను ప్రజలకు చేరువ చేయడంలో ఇది గొప్ప విజయమే. ఇది విద్యఅందుబాటులోకి వచ్చిందనే విజయాన్ని సూచిస్తుంది. కానీ అదే విద్య ఆర్థికవ్యవస్థకు అవసరమైన నైపుణ్యాలుగా మారకపోవడమే అసలు ఆందోళన. అందుకే విద్యా విస్తరణ, ఉద్యోగ యోగ్యత విస్తరణగా మారలేదు. ఇండియా స్కిల్స్ రిపోర్టు ప్రకారం సుమారు సగం మంది గ్రాడ్యుయేట్లు మాత్రమే పరిశ్రమలకు వెంటనే ఉపయోగపడే స్థాయిలో ఉన్నారు. అంటే సమస్య చదువుకున్న వారి సంఖ్యలోలేదు. వారు సంపాదించిన విద్య, ఉద్యోగ మార్కెట్‌కు అవసరమైన సామర్థ్యంగా మారకపోవడంలో ఉంది. ఇక్కడే డిగ్రీల ద్రవ్యోల్బణం అనే భావన ప్రాధాన్యం సంతరించుకుంటుంది. ద్రవ్యోల్బణంలో కరెన్సీ కొనుగోలు శక్తి తగ్గినట్లే, డిగ్రీలు విపరీతంగా పెరిగినప్పుడు వాటి ప్రత్యేకత కూడా తగ్గుతుంది.ఒకప్పుడు ఇంటర్ లేదా డిప్లొమాతో లభించిన ఉద్యోగానికి ఇప్పుడు డిగ్రీ అవసరమవుతోంది. నిన్న డిగ్రీ సరిపోతే, నేడు పీజీ కోరుతున్నారు. ఉద్యోగ స్వభావంఅంతగా మారకపోయినా, విద్యార్హతలు మాత్రం పెరుగుతున్నాయి. డిగ్రీలు జ్ఞానాన్ని కొలిచే సాధనంగా కాకుండా, అభ్యర్థులను వడపోసే సాధనంగా మారుతున్నాయి. ఆర్థిక శాస్త్రంలో 2001 నోబెల్ బహుమతి గ్రహీత మైకేల్ స్పెన్స్ ఈ పరిస్థితిని దాదాపు అర్థశతాబ్దం క్రితమే వివరించాడు. ఉద్యోగం ఇవ్వబోయే సంస్థకు అభ్యర్థి నిజంగా ఎంత సమర్థుడో ముందుగానే తెలుసుకోవడం సాధ్యం కాదు. అందుకే అది డిగ్రీని ఒక సంకేతంగా ఉపయోగిస్తుంది. మంచి డిగ్రీ అంటే నేర్చుకునే సామర్థ్యం, క్రమశిక్షణ, పట్టుదల ఉన్న వ్యక్తి అని భావిస్తుంది. కానీ అదే డిగ్రీ లక్షల మందికి వచ్చినప్పుడు ఆ సంకేతం బలహీనపడుతుంది. అప్పుడు మరింత ఉన్నత విద్యార్హతలను కోరడం ప్రారంభమవుతుంది. ఇదే డిగ్రీల ద్రవ్యోల్బణానికి మూల కారణం.సమస్య విద్యార్థుల్లోలేదు. విద్యను ఎంపిక ప్రమాణంగా ఉపయోగించే వ్యవస్థలోఉంది. ఆర్థిక శాస్త్రంలో 1992 నోబెల్ బహుమతి గ్రహీత గ్యారీ బెకర్ విద్యను మానవ మూలధనంగా అభివర్ణించాడు. యంత్రాల్లో పెట్టుబడి పెడితే ఉత్పత్తి పెరిగినట్లే, విద్యపై పెట్టుబడి పెడితే మనిషి ఉత్పాదకత పెరగాలి. కానీ విద్య సామర్థ్యాన్ని పెంచకుండా కేవ



లం సర్టిఫికెట్‌ను మాత్రమే ఇస్తే, అది మానవ మూలధనంగా మారదు. నేడు భారత్ ఎదుర్కొంటున్న అసలు సమస్య ఇదే. మనం విద్యలోపెట్టు బడి పెడుతున్నాం, కానీ ఉత్పాదకతలో అదే స్థాయి పెరు గుదల కనిపించడం లేదు. డిగ్రీల సంఖ్య పెరుగుతోంది. కానీ సమస్యలను పరిష్కరించే సామర్థ్యం అదే వేగంతో పెరగడం లేదు. అందుకే విద్య విస్తరిస్తున్నా, ఆర్థిక వ్యవస్థకు అవసరమైన మానవ మూలధనం అదే వేగంతో పెరగడం లేదు. ఇది కేవలం విద్యావ్యవస్థ వైఫల్యం కాదు. ఇది సమాజం నిర్మించుకున్న ఒక ఆలోచనా విధాన ఫలితం. దశాబ్దాలుగా భారతీయ కుటుంబాల్లో 'మంచి డిగ్రీ అంటే మంచి ఉద్యోగం' అనే సమీకరణ బలంగా స్థిరపడింది.పాఠ శాలలు మార్కుల కోసం, కళాశాలలు డిగ్రీల కోసం, విద్యా ర్థులు ఉద్యోగాల కోసం పరుగు తీశారు. కానీ ప్రపంచఆర్థిక వ్యవస్థ అంతలోనే మారిపోయింది. నేడు ఉద్యోగదాత అడుగుతున్న ప్రశ్న 'ఏ డిగ్రీ చేశావు?' కాదు. 'ఏం చేయగలవు?' అన్నది. ఈ మార్పును మరింత వేగవంతం చేసింది కృత్రి మ మేధ. గత పారిశ్రామిక విప్లవాలు శారీరక శ్రమను భర్తీ చేశాయి. కానీ కృత్రిమ మేధ విశ్లేషణ, సమాచార ప్రాసెసింగ్, పునరావృత మేధోపరమైన పనులను కూడా స్వీకరిస్తోంది. అందువల్ల పరీక్షల్లో ఎక్కువ మార్కులు సాధించడం కంటే, సమస్యలను కొత్త కోణంలో చూడడం, వేగంగా నేర్చుకోవడం, సృజనాత్మకంగా ఆలోచించడం, విభిన్న రంగాల జ్ఞానాన్ని అనుసంధానించడం వంటిసామర్థ్యాలే ఎక్కువ విలువ పొందుతున్నాయి. ప్రపంచ ఆర్థిక నివేదిక విడుదల చేసిన ఫ్యూచర్ ఆఫ్‌జాబ్స్ రిపోర్టు-2025 ఈ మార్పును స్పష్టంగా ప్రతిబింబించింది. 2030నాటికి ఉద్యోగాలకు అవసరమైన ప్రధాన నైపుణ్యాల్లో దాదాపు 39శాతంమార్పు వస్తుందని ఆ నివేదిక అంచనా వేసింది. అదే సమయంలో 17 కోట్ల కొత్త ఉద్యోగాలు ఏర్పడగా, 9.2 కోట్ల ఉద్యోగాలు కనుమరుగయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఈ గణాంకాలు ఉద్యోగాల సంక్షోభాన్ని కాదు, నైపుణ్యాల సంక్షోభాన్ని సూచిస్తున్నాయి. ప్రపంచం ఇప్పుడు డిగ్రీల ఆధారంగాకాదు, నైపుణ్యాల ఆధారంగా మానవ వనరులను అంచనా వేయడం ప్రారంభించింది. భారత్‌కు ఈమార్పు మరింత కీలకం. ప్రతి సంవత్సరం ఒక కోటినుంచి 1.2కోట్ల మంది యువత ఉద్యోగ మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారు. ఇదే మన జనాభా ప్రయోజనం. కానీ నైపుణ్యాలుగా మారని విద్య ఈజనాభా ప్రయోజనాన్ని నిరుద్యోగ భారంగా మార్చేప్రమాదం ఉంది. ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగాలకు వేల సంఖ్యలో ఇంజినీర్లు, పీజీలు దరఖాస్తు చేస్తుండగా, మరోవైపు పరిశ్రమలు శిక్షణ పొందిన వెల్డర్లు, యంత్ర నిర్వహణ నిపుణులు, డేటా విశ్లేషకులు, సైబర్ భద్రత నిపుణులు, కృత్రిమ మేధ ఇంజినీర్ల కోసం వెతుకుతున్నాయి. చదువుకున్న నిరుద్యోగం, నైపుణ్యాల కొరత ఒకేసారి కనిపించడం కంటే పెద్ద హెచ్చరిక ఇంకేముంటుంది? విద్య జ్ఞానాన్ని ఇస్తుంది. నైపుణ్యం ఆ జ్ఞానాన్ని ఆర్థిక విలువగా మారుస్తుంది. ఈ రెండింటిమధ్య సంబంధం తెగిపోయినప్పుడు డిగ్రీల ద్రవ్యోల్బణం ప్రారంభమవుతుంది. అందుకే సంస్కరణలు కూడా విద్యార్థులతో మొదలై విద్యార్థుల దగ్గరే ముగియ కూడదు. విశ్వవిద్యాలయాలు పరిశ్రమలతో కలిసి పాఠ్యాంశాలను రూపొందించాలి. శిక్షణను మార్కుల కోసం చేసే కార్యక్రమంగా కాకుండా, ఉద్యోగానికి సిద్ధం చేసే ప్రక్రియగా మార్చాలి. పరిశ్రమలు కూడా శిక్షణను ఖర్చుగా కాకుండా పెట్టుబడిగా చూడాలి. సమాజం డిగ్రీని గౌరవించినంతగా నైపుణ్యాన్నీ గౌరవించడం నేర్చుకోవాలి. భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే మరిన్ని విశ్వవిద్యాలయాలు నిర్మించ డం ఒక్కటేసరిపోదు. మరిన్ని డిగ్రీలు ఇవ్వడం కూడా సరి పోదు. విశ్వవిద్యాలయాలు సర్టిఫికెట్లు ముద్రించే కేంద్రా ల నుంచి మానవ మూలధనాన్ని తీర్చిదిద్దే కేంద్రాలుగా మారాలి. భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడాన్ని నిర్ణయించేది విశ్వవిద్యాలయాలు ఎన్ని డిగ్రీలు ఇచ్చాయన్నది కాదు, ఎన్ని సమస్యలను పరిష్కరించగల మనుషులను తీర్చిదిద్దాయన్నదే. •

# 'జై యువ'తకు సెల్యూట్!

ఎవరు అన్నా అనకున్నా ఇప్పుడు భారతీయ యువతను అభినందించాల్సిన పరిణామాలే తారసపడుతున్నాయి. ఓ పక్కజీవితాల్లో వెలుగులు నింపాల్సిన ప్రభుత్వాలు ఇన్నాళ్లూ వారి వారి సొంత ఎజెండాలతో కాలక్షేపం చేసేస్తాయి. కొత్త తరపు ఆలోచనలను ఎవరైనా, ఎప్పుడైనా స్వాగతించవలసిందే. యువత తమ భవిత కోసం రోడ్డెక్కితే వారిని ఏలిన వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తున్నారన్న భావనతో విదేశీ నిధులు వస్తున్నాయనో, వారి వెనుక ఉండి ఎవరో నడిపిస్తున్నారనో ఒకవర్గం సామాజిక మాధ్యమాల్లో ఊదరగొడుతున్నాయి. అంటే ప్రశ్నించే వారు ఉండకూడదనేది వారి ఆంతర్యమా!? ప్రశ్నిస్తే తప్పా? మరెందుకలా ఉద్యమకారులపై బురద జల్లి యువత గొంతు నొక్కాలన్న ప్రయ్నత్న మంచిది కాదేమో? ఉద్యమకారుల్లో గత రాజకీయ నేపథ్యం ఉండడం నేరమా? వాళ్ళకి సిద్ధాంతాలు ఉండవా? ఉండకూడదా? అయినా యువ చైతన్యాన్ని ఎవరూ ఆపలేకపోయారు. నిజానికి అతి చిన్న వయసు లోనే ఈ తరం యువత పరిణితి చెందారు. ఎన్నో విషయాలపై అవగాహన పెంచుకొని పట్టుసాధిస్తున్నారు. వాళ్లల్లో మేధాశక్తికి కొదువ లేదు. వారికి అనుభవం తక్కువని అనుకోవాలి తప్ప కొత్త తరంలో మానసిక పరివర్తనను ఏమాత్రం తక్కువ చేయలేం. వీధుల్లోకి వచ్చిన యువత ఆగ్రహం ఒక్క పరీక్ష గురించో, ఒక్క మంత్రి రాజీనామా గురించో కాదు. అది చాలా కాలంగా విద్యావ్యవస్థపై పేరుకుపోయిన అసంతృప్తి. తమ చదువుకు విలువ ఉందో లేదో? ఉద్యోగం వస్తుందో రాదో? భవిష్యత్తు ఎలా ఉంటుంది? అనే ఆందోళన. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన 'నీట్' ఉద్యమాన్ని ప్రభుత్వం గుర్తించి వారి ఆకాంక్షలపై సానుకూలంగా స్పందించడం, తమకు తమ భవితవ్యమే తప్ప ఈ దేశ రాజకీయాలతో సంబంధం లేదని చెప్పడంలో యువత విజ్ఞత చెప్పుకోదగినది. అందుకే యువత వైఖరితో యావత్తు భారత దేశం ఊపిరిపీల్చుకున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద యువదేశం భారత్ . 2026 నాటికి భారత జనాభాలో 65 మంది 35 ఏళ్లలోపు వారు. 15-29 ఏళ్లమధ్య ఉన్న యువత 25కోట్లకు పైగా ఉంది. ప్రపంచంలోని ప్రతి 5గురు యువకుల్లో ఒకరు భారతీయుడు. దీన్నే 'యూత్ బల్జ్ లేదా డెమోగ్రాఫిక్ డివిడెండ్' అంటారు. యువత ఎక్కువ, వృద్ధులు తక్కువ ఉన్నప్పుడు పని చేసే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. దీనివల్ల ఉత్పత్తి, పొదుపు, పెట్టుబడి పెరుగుతాయి. 2026-2047 వరకు ఇదే భారత్ వికసిత్ భారత్‌గా మారేందుకు స్వర్ణావకాశం. జపాన్, చైనా, యూరప్ వృద్ధుల దేశాలుగా మారుతున్నాయి. 2030 నాటికి ప్రపంచానికి 12 కోట్ల మంది పనివారు కావాలి. ఆ ఖాళీని భారత యువత మాత్రమే భర్తీ చేయగలదు. భారత యువత ప్రపంచంలోనే అత్యంత ధైర్యవంతులు, ఆశావాదులు, టెక్ సావీ.వారికి సరైన విద్య, నైపుణ్యం, అవకాశం ఇస్తే వారు 'వికసిత్ భారత్'ని నిర్మించడమే కాదు, ప్రపంచాన్నే నడిపిస్తారు. ప్రతి ఏడాది కోటికి పైగా యువత డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగ మార్కెట్లోకి వస్తున్నారు. 2023-24లో సుమారు 1.1 కోట్ల మంది, 2024-25లో దాదాపు 1.2 కోట్ల మంది గ్రాడ్యుయేట్లు బయటకు వచ్చారు. కానీ వారందరికీ ఉద్యోగాల వేటలో తలపండిపోతోంది ఫలితం శూన్యం. 2000 నుంచి 2010 మధ్య దేశంలో ప్రతి ఏడాది సగటున రెండున్నర కోట్లమంది పిల్లలు జన్మించారు. ఆ తరం ఇప్పుడుఉపాధి కోసం బయటకు వస్తోంది. రాబోయే మరో 15 నుంచి 20 సంవత్సరాల పాటు ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఆర్థికవేత్తలు దీనినే "డెమోగ్రాఫిక్ డివిడెండ్"లేదా 'యూత్ బల్జ్' అంటారు. ఇది ఏ దేశానికైనా ఒక్కసారి మాత్రమే దక్కే అవకాశం. 2050 నాటికి ఈ అవకాశం క్రమేపీ ముగుస్తుంది.అంటే మరో పాతికేళ్లే భారత్ భవిష్యత్తును నిర్ణయిస్తాయి. ప్రతి ఏడాదిసంక్షేమ పథకాల కోసం లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న కేంద్ర, రాష్ట్ర విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, తయారీరంగం, చిన్న పరిశ్రమలపై కూడా భారీ పెట్టుబడులు పెట్టాల్సిన సమయం వచ్చింది. యువత ఉచితాలు కోరుకోవడం లేదు. భారత్ ప్రపంచంలోనే అగ్రశ్రేణి ఆర్థికశక్తిగా నిలిపేయువతమనకు సొంతం.'జెన్ జి' ఉద్యమ స్పందనతో యువశక్తిని సరైన దారిలో నడిపించి దేశభవితలో వారిని అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రత్యేక సందర్భంలో అభిప్రాయపడ్డారు. 'జై జవాన్', 'జై కిసాన్' లతో ముందుకువెళ్తున్న కాంగ్రెస్ పార్టీ 'జై యువ' నినాదాన్ని కలుపుకొనిముందుకెళ్తున్నట్లు ప్రకటించారు. అందరికీ విద్య అందుబాటులోకి వచ్చినందున 21ఏళ్ల వయసుకే ఐఎఎస్, ఐపిఎస్‌లు అవుతున్నారు. అదేదారిలో యువతను పార్లమెంట్ తదితర చట్టసభల్లో భాగస్వాములు అయ్యేందుకు వీలుగాఎన్నికల్లో పోటీ చేసే వయసును తగ్గించే అంశంపైచర్చ పూర్తిస్థాయిలో కొనసాగాలని అభిలషించారు. అసెంబ్లీ, లోక్‌సభకు పోటీచేసే వయసు 21 సంవత్సరాలకు, రాజ్యసభ, శాసనమండలికి పోటీ చేసే వయసు 25 సంవత్సరాలకు తగ్గించాలని ప్రధానికి విజ్ఞప్తి చేశారు. యువతకు ఉద్యమాలతో పనిలేకుండా వారి ఆకాంక్షలను నెరవేర్చగలిగితే వారిలో అసంతృప్తి దూరమవుతుంది. యువతకు రాజకీయ నాయకత్వ అవకాశాలు ఇవ్వడమే కాదు ప్రజాసేవపట్ల నిబద్ధత ఉన్న వారికే ఆ అవకాశం దక్కేటట్లు చూస్తేనే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. అనేకరంగాల్లో యువత నిర్మాణాత్మక హోదాల్లో తమను తాము నిరూపించుకున్న యువతకు పాలనలో భాగస్వామ్యం కల్పించడంలోనూ ఎవరికీ ఏ అభ్యంతరం ఉండదు. యువశక్తిని గుర్తించిననాడే వారి ఆశలు, ఆకాంక్షలు నెరవేరి వికసిత్ భారత్‌కు కొత్తదారి గోచరమవుతుంది.

నిన్నటి తప్పుల గురించి కాని, రేపు రాబోయే కష్టం గురించి కాని దిగులుపడడమే అతి గొప్ప కాలహరణం.



మహాత్మా గాంధీ

మనం ఎప్పుడూ ఏదో ఒకటి ఆశిస్తూనే ఉంటాం. ఆశ నెరవేరినా, నెరవేరకపోయినా మనిషిలో ఆశ చావదు. జీవితమే ఆశల వల.



సెసిల్

## ప్రజావాక్కు

### వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం

**పోటీ పరీక్షలు** లక్షలాది మంది విద్యార్థుల జీవితాలను ప్రభావితం చేస్తాయి.అలాంటి పరీక్షల్లోప్రశ్నపత్రాల లీకేజీ జరగడంవల్ల నిజాయితీగా శ్రమించిన అభ్యర్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రశ్నపత్రాల లీకేజీ కేసుల విచారణ కోసం ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలన్న నిర్ణయం ఎంతో స్వాగతించదగ్గది. ఇలాంటి కేసుల్లో వేగవంతమైన విచారణ నిందితులకు త్వరగా శిక్షపడేలా చేయడమే కాకుండా, పరీక్షా వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది.చాలా సందర్భాల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సంవత్సరాలపాటు సాగుతుంటాయి. దీనివల్ల పరీక్షలురాసిన అర్హులైన అభ్యర్థులు తీవ్రమానసిక ఒత్తిడికి గురవుతారు. వారి విద్య,ఉద్యోగ అవకాశాలు ఆలస్యమవుతాయి. మరోవైపు నేరస్థులకు చట్టంపై భయం తగ్గే ప్రమాదం కూడా ఉంటుంది. అందువల్ల వేగవంతమైన న్యాయ ప్రక్రియ అవసరం. పరీక్షా నిర్వహణలో అత్యాధునిక భద్రతా వ్యవస్థలు, డిజిటల్ పర్యవేక్షణ, ప్రశ్నపత్రా ల రవాణా, నిల్వ ప్రక్రియల్లో కట్టుదిట్టమైన రక్షణ చర్యలు అమలు చేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### హెల్త్ కార్డులు ఎవరికోసం?

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయులందరికీ హెల్త్‌కార్డులు అందజేయనున్నామని ఈ మేరకు ఉద్యోగులు తమ వివరాలను అప్లోడ్ చేయాలని ప్రకటన చేయడంతో రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులందరూ ఈ విధానం ద్వారా తమకు హెల్త్‌కార్డులు అవసరం లేదనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.డిఎలు పిఆర్‌సిలు అడిగితే హెల్త్ కార్డులు మాత్రమే ఇస్తామని ప్రభుత్వం చేతులు దులుపుకోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు కంగుతింటున్నారు.

- బి. దేవయ్య, హైదరాబాద్

### కూలీల రేట్లు నియంత్రించాలి

సన్న చిన్నకారు రైతుల వ్యవసాయ పనుల దృశ్య, సామాన్య ధరలు, ఆర్థికవ్యవస్థ,కూలీల రేట్లు అమాంతం వందలు వందలుగా విపరీతంగా పెరగడంతో రైతులకు పెనుభారంగా మారుతుంది. గ్రామంలో కమిటీలు వేసి ధరలను నియంత్రించాలి లేదంటే వ్యవసాయం చేసి వృథా. కూలీ రేట్లు తగ్గించి రైతులను ఆదుకోవాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ప్రజాస్వామ్యం గెలిచింది

**బొద్దింకల** దెబ్బకు 56 ఇంచిల బాహుబలి దిగివచ్చింది. ఈ దేశాన్ని మత రాజ్యంగా చేయాలనుకున్న వారికి చెంప దెబ్బ.'తమకున్న మతవాద బలంతో ఈదేశాన్ని రామరాజ్యంగా చెయ్యాలని పలుమార్లు ఊకదంపుడు మాటలు పలికే 56 ఇంచిల బాహుబలి బొద్దింకల దెబ్బకు దిగి రాక తప్పలేదు. బలవంతుమైన పాము చలి చీమల చేత చచ్చునట్లు మాకు తిరుగులేదు, మేము చెప్పిందే వేదం అనే రీతిలో నడుస్తున్న, ఎదురు తిరిగినవారిపై దేశద్రోహం కేసులు అంటూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న బీజేపీ ప్రభుత్వం చివరికి దేశ యువతకు తలవంచక తప్పలేదు.నెహ్రూ ప్రాజెక్టులు కడితే, మోడీ దొంగబాబాల ఆశ్రమాలు, బాలరాముని గుళ్ళు, పటేల్ విగ్రహాలు కట్టారు. నెహ్రూ శాస్త్రీయ విద్య విద్యార్థులకు నేర్పితే, మోడీఇతిహాసాలు, పుక్కిటి పురాణాలు, అశాస్త్రీయ వాస్తు, జ్యోతిష్యాలు, మంత్ర తంత్రాలు, చేతబడులు, గాయత్రీమంత్రాలు,పాఠ్యాంశాలుగా పెట్టాడు.సైన్స్ కాంగ్రెస్ సదస్సులను మంత్రగాళ్ల సభలుగా మార్చారు.అహంకారంతో ఏదైనా చేస్తాం అనుకునే వాళ్లకు ఇది ఒక గొప్ప గుణపాఠం. ఇప్పటికైనా ప్రభుత్వాల తీరు మారాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### ఉద్యోగాల కోత

**ఇప్పటివరకు** ఇంజనీరింగ్ విద్య చదివిన వారందరూ అధిక జీతాలకు ఆశపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎగబడి దేశ విదేశాలలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. కొందరికి ఉద్యోగాలు దొరకక ప్రయివేటు సంస్థలలోను చిన్నదో పెద్దదో ఎంతోకొంత జీతానికి పని చేస్తున్నారు.పెద్దపెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఈమధ్య తమ సీనియర్ ఉద్యోగులను వేలసంఖ్యలో తొలగిస్తున్నారు. కొత్తగా జాయిన్ అయిన వాళ్ల కూడా ఎప్పుడు తమ ఉద్యోగాలు ఊడుతాయోననే భయపడుతున్నారు. నైపుణ్యం గలవారే ఎక్కువ కాలం ఉంటున్నారు. ఉద్యోగాలు కల్పోతున్నవారికి ప్రత్యామ్నాయం ఏమిటి?

- ఎం. నాగరాజు, కరీంనగర్‌జిల్లా

### స్పెషల్ ప్రమోషన్లు ఇవ్వాలి

**తెలంగాణా** రాష్ట్రంలో ఉన్న వివిధ శాఖల వికలాంగుల ఉద్యోగులకు స్పెషల్ డిపార్టుమెంటు ప్రమోషన్స్ ఇవ్వాలి. ఉన్నత అర్హత, డాక్టరేట్ పట్టభద్రుల వికలాంగులకు స్పెషల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలి. వీరికి తప్పకుండా జి. ఓ 34 వర్తింపజేయాలి.దివ్యాంగులైన ఉన్నత ఉద్యోగులకు ప్రమోషన్స్ కల్పిస్తే వారికి కూడా గౌరవం దక్కుతుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# డిజిటల్ కరెన్సీతో ఆర్థిక వ్యవస్థకు మరింత భద్రత

సి.హెచ్.ప్రతాప్

సాంకేతిక విప్లవం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేగంగా రూపాంతరం చెందిస్తోంది. ఒకప్పుడు వస్తు మార్పిడి విధానం నుంచి నాణేలు, కాగితపు నోట్లు,బ్యాంకింగ్ సేవలు, డిజిటల్ చెల్లింపుల వరకు అభివృద్ధి చెందినద్రవ్య వ్యవస్థ ఇప్పుడు కేంద్ర బ్యాంకు డిజిటల్ కరెన్సీ యుగంలోకి అడుగుపెట్టింది. ఈ మార్పులో భాగంగానే భారతీయ రిజర్వ్ బ్యాంకు డిజిటల్ రూపాయిని ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక కొత్త అధ్యాయానికి శ్రీకారంచుట్టింది. డిజిటల్ రూపాయి అనేది మనం వినియోగించే కాగితపు నోట్లకు డిజిటల్ రూపం. ఇది సాధారణ డిజిటల్ చెల్లింపు విధానాలైన యూపీఐ లేదా మొబైల్ వాలెట్లతో సమానం కాదు. యూపీఐలో ఒక బ్యాంకు ఖాతా నుంచి మరొక ఖాతాకు నిధులు బదిలీ అవుతాయి. అయితే డిజిటల్ రూపాయి విషయంలో డబ్బు స్వరూపమే డిజిటల్‌గా ఉంటుంది. ఇది నేరుగా ఆర్‌బీఐ జారీచేసే చట్టబద్ధమైన అధికారిక కరెన్సీ కావడంతో భౌతిక నగదుకు సమానమైన విశ్వసనీయతను కలిగి ఉంటుంది. డిజిటల్ రూపాయి వల్ల అనేక ప్రయోజనాలున్నాయి. కరెన్సీనోట్ల ముద్రణ,రవాణా, భద్రత, నిర్వహణ వంటి వ్యయాలు తగ్గుతాయి. లావాదేవీలు వేగంగా, సులభంగా పూర్తవడంతో సమయం ఆదా అవుతుంది. నగదు వినియోగం తగ్గడంవల్ల నకిలీ నోట్ల సమస్యను నియంత్రించడంతో పాటు ఆర్థికవ్యవస్థలో పారదర్శకత పెరుగుతుంది. చిన్న మొత్తాల చెల్లింపుల నుంచి పెద్ద లావాదేవీల వరకు దీన్ని వినియోగించే అవకాశం ఉంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల కోసం హోల్‌సేల్ డిజిటల్ రూపాయి, సాధారణ ప్రజల కోసం రిటైల్ డిజిటల్ రూపాయిని ఆర్‌బీఐ దశలవారీగా ప్రవేశపెడుతోంది. డిజిటల్ రూపాయి వ్యాపార రంగానికి కూడా మేలు చేస్తుంది. నగదు నిర్వహణ ఖర్చుతగ్గడం, తక్షణ చెల్లింపులు, మెరుగైన నగదు ప్రవాహం వంటి ప్రయోజనాలు లభిస్తాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, పన్నుల వసూళ్లు, ఆర్థిక లావాదేవీలలో పారదర్శకత పెరగడానికి కూడా ఇది తోడ్పడుతుంది. భవిష్యత్తులో అంతర్జాతీయ చెల్లింపులను మరింత వేగవంతంగా, తక్కువ వ్యయంతో నిర్వహించే అవకాశాలను కూడా ఇది విస్తరించగలదు. అదేవిధంగా, డిజిటల్ రూపాయి డిజిటల్ ఇండియా, ఫైనాన్షియల్ ఇన్‌క్లూజన్ వంటి జాతీయ లక్ష్యాలకు మరింత బలం చేకూరుస్తుంది. బ్యాంకింగ్ సేవలు పూర్తిగా అందని ప్రాంతాల్లో కూడా డిజిటల్ లావాదేవీలను విస్తరించే అవకాశాన్ని కల్పిస్తుంది. విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులకు వేగంగా,పారదర్శకంగా అందించడానికి కూడా ఇది ఉపయోగపడుతుంది. అయితే డిజిటల్ కరెన్సీ విజయవంతం కావాలంటే కొన్ని సవాళ్లనుఅధిగమించాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్‌మౌలిక సదుపాయాల విస్తరణ, సైబర్ భద్రత బలోపేతం,ప్రజల్లో డిజిటల్ అక్షరాస్యత పెంపు,వినియోగదారుల గోప్యత పరిరక్షణ వంటి అంశాలకు అధికప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా వృద్ధులు, గ్రామీణ ప్రజలు, సాంకేతిక పరిజ్ఞానంపై పరిమిత అవగాహన ఉన్నవర్గాలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. డిజిటల్ రూపాయిని బిట్‌కాయిన్ వంటి క్రిప్టోకరెన్సీలతో పోల్చడం సరైందికాదు. క్రిప్టోకరెన్సీలు మార్కెట్ ఆధారంగా విలువ మారే ప్రైవేట్ డిజిటల్ ఆస్తులు కాగా, డిజిటల్ రూపాయి భారతీయ రిజర్వ్ బ్యాంకు జారీ చేసే అధికారిక చట్టబద్ధకరెన్సీ. ప్రపంచంలోని అనేకదేశాలు కేంద్రబ్యాంకు డిజిటల్ కరెన్సీలను అభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో,భారత దేశం కూడా ఈ రంగంలో ముందంజలో నిలుస్తోంది.డిజిటల్ కరెన్సీ సాంకేతిక ఆవిష్కరణ మాత్రమే కాదు, భవిష్యత్ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది. సమర్థవంతమైన నియంత్రణ, అత్యున్నత భద్రతా ప్రమాణాలు, బలోపేతమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు, ప్రజల విశ్వాసం కలిసి నడిస్తే డిజిటల్ రూపాయి భారత ఆర్థిక వ్యవస్థను మరింత ఆధునికంగా, పారదర్శకంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే శక్తివంతమైన సాధనంగా నిలుస్తుంది. •

# బాధ్యత కలిగిన యువతతోనే దేశ భవిష్యత్తు

దాడిశెట్టి శ్యామ్ కుమార్

దేశంలో వివిధ వైద్య కళాశాలలో వైద్య కోర్సులలో ప్రవేశం కోసం నిర్వహించే అర్హత పరీక్షలో జరిగిన ప్రశ్నాపత్రం పరీక్ష కంటే ముందుగానే బయటికి రావడం గత కొంతకాలం నుండి పెద్ద దుమారాన్నే రేపింది. ఈ క్రమంలో అభ్యర్థుల నుండి మొదలైన నిరసనలు క్రమ క్రమంగా అధికమై దేశంలో యువతరం వరకు వ్యాప్తి చెంది పరీక్ష లీక్ తీరుపై వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తం కావడం ప్రభుత్వాన్నీ ఆలోచనలో పడవేయడం, యువత చేసిన నిరసనలో భాగంగా ఆ శాఖను నిర్వహిస్తున్న కేంద్ర మంత్రితప్పని పరిస్థితుల్లో యువత కోరుకున్న విధంగానే రాజీనామా చేయవలసిన పరిస్థితి రావడం ఇదంతా ఒక ఎత్తు అయితే, యువత జరిపి నిరసనతో ప్రభుత్వమే దిగి రావడం యువత అనుకుంటే సాధించలేనిది ఏమీ లేదనే ఇలాంటి విషయం ఎల్లప్పుడు ప్రతి ఒక్కరు గుర్తించుకొనే విధంగా మిగిలిపోవడంతో ఇకపై అవినీతికి అక్రమాలకు పాల్పడుతున్న వారి తీరు మారాల్సిన అవసరం ఉంటుంది. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడిన నాయకులు కూడా యువతను దృష్టిలో పెట్టుకొని జాగ్రత్తగా ఆలోచించి నిర్ణయాలు చేయాల్సిన అవసరం ఉంటుందని పలువురు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తుండడం విశేషం. పరీక్ష విధానంలో కూడా పారదర్శకత కలిగిన విధానంతో సరికొత్త సంస్కరణలు రావాల్సిన అవసరం ఉంది. నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ సందర్భంగా నెలకొన్న పరిస్థితులను గమనిస్తే భారతదేశంలో నవతరం నిరంతరం దేశ పరిణామాలపై స్పందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు గోచరిస్తుంది. ప్రధానంగా ప్రభుత్వాలు విధానపరమైన కఠినమైన చర్యలు తీసుకోకపోవడం, జాగ్రత్తలు పాటించకపోవడం వలన అవినీతి అక్రమాలు లాంటి సంఘటనలు తరచుగా జరుగుతున్నాయనే విషయాలు ఎంతో కాలం నుండి చదువుకున్న యువతలో ఎంతో కొంత అశాంతికి అలజడికి కారణం అవుతున్నాయి. ఈ అంశంపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా నిరుద్యోగ యువత పార్టీలకతీతంగా తొలిసారిగా బయటికి వచ్చి నీట్ ప్రవేశ ప్రశ్నాపత్రం లీక్ బాధ్యులైన వారిపై తక్షణం చర్యలు తీసుకోవాలని అంతేకాకుండా దేశంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరిగినా మొదట ప్రజలు ఎన్నుకొన్న ప్రభుత్వంలోని సంబంధిత శాఖ మంత్రులు బాధ్యత వహించాలని డిమాండ్ చేసింది. అయితే ప్రస్తుతం ఆధునిక సాంకేతిక యుగంలో దేశంలోని యువత మధ్య కమ్యూనికేషన్ వ్యవస్థ సందేశాల పురోగతి అతివేగంగా జరగడంతో చాలామంది తొలిసారిగా యువతను మేల్కొలిపే విధంగా గ్రూపులను రూపొందించుకుని సమస్యలపై స్పందించేందుకు నిర్భయంగా యువతరం నేడు ప్రభుత్వాలను నేరుగా ప్రశ్నిస్తున్నది అంటే ప్రభుత్వాలు ఎంతో కొంత యువతరం ఆలోచనలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టవలసిన ఆవశ్యకత ఉంది. ఈ విధంగా దేశంలోని యువతరానికి జరు




గుతున్న నష్టాన్ని ప్రశ్నించడానికి మాత్రమే కాకుండా ఎన్నుకున్న ప్రభుత్వాల అజెండా అమలు విధానాల పైన కూడా రాబోవు కాలంలో యువత ప్రశ్నించేందుకు వెనుకాడదేమో. ఏ విషయంలోనైనా సమాజానికి భంగం వాటిల్లే క్రమంలో అందుకు సంబంధించిన వారు ఎవరైనా జవాబుదారీతనం గాఉండాల్సి వస్తుంది అనేచర్చ జరుగుతుంది. నేటి యువత రేపటి భారత దేశ భవిష్యత్తుకు పునాదులు అలాంటి యువత భారతదేశ సమైక్యతను దేశభక్తి సమగ్రతతోపాటుజాతీయ వాదాన్ని బలంగా వినిపిస్తున్నారు. అలాంటి యువతరం భారతదేశం ఉన్నతికి భద్రతకు వెన్నంటి ఉంటారు అనేది అక్షరసత్యం. అందుకు ప్రభుత్వాలు కూడా దేశ భవిష్యత్తులో కీలకంగా మారనున్న యువత సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కాలయాపన చేయకూడదనే విషయంపై అన్ని రాజకీయ పార్టీల్లో చర్చ జరగాల్సిన అవసరం ఉంది. విద్యావంతులు చదువుకున్న వారు భారత దేశంలో ఎక్కువ అవుతున్నారు. దేశంలో ఎలాంటి అంశాల్లోనైనా లోపాలు కనపడితే ప్రశ్నించేందుకు నేటితరం యువత సిద్ధంగా ఉంటుందని, లోపాలను సవరించే వరకు జవాబుదారీతనం వచ్చేంతవరకు నిరసన వ్యక్తం అవుతుందని, తలచుకుంటే సాధించేందుకు యువతరానికి ఏది అడ్డు లేదని చెప్పే రీతిలో యువతరం దేశవ్యాప్తంగా చేసిన శాంతియుత నిరసన విధానాలు చెప్పకనే చెప్తున్నాయి. నేటితరం యువతరం ప్రశ్నించే విషయాలను నిజానిజాలను విశ్లేషించుకోవాలి, నిర్ధారణ చేసుకోవాలి. సరైన విధానం ఉంటే దాన్ని తప్పనిసరిగా అమలు చేసే విధంగా సమస్య కఠినతరం కాకుండా యువతరాన్ని కూడా కలుపుకుపోతూ వారి అభిప్రాయాన్ని కూడా స్వాగతించాల్సిన అవసరం కొన్ని సందర్భాల్లో ప్రభుత్వాలకు ఉండాల్సిందేమో. ఈ క్రమంలో దేశ పరిస్థితుల విషయాలపై యువత మేల్కొని అప్రమత్తంగా ఉంటుందని పాలకులు అందించే విధానాలను నిరంతరం గమనిస్తూ సమాధానం కొరకు నిరంతరం ప్రశ్నిస్తామంటూ ముందుకు వస్తున్న యువతరానికి పాతతరం అనుభవాల సారం కూడా భవిష్యత్ భారత దేశ యువతకు దిశా నిర్దేశం ఆధిక్యత మార్గదర్శకం అవుతాయని భావించే వారు లేకపోలేదు. యువత ఐక్యత రాగానికి సంబంధించి ప్రభుత్వ ప్రజాపాలనలో ఎటువంటి లోపాలు జరిగినా సంబంధిత పరిపాలనా ప్రతినిధులు బాధ్యత వహించవలసి ఉంటుందనే సందేశం దేశవ్యాప్తంగా వ్యాప్తి చెందింది. దేశ సమగ్రతకు దేశ భద్రతకు ఎటువంటి విఘాతం కలగకుండా యువత మంచి ఆలోచన విధానాలు న్యాయ సమ్మతమైనవి అయితే పార్టీలకు రాజకీయాలకతీతంగా యువత ప్రశ్నిస్తే దానికి తప్పనిసరిగా జవాబుఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉంటుందేమో. రాబోవు కాలంలో ఎలాంటి ప్రభుత్వాలు వచ్చినా యువతకు నష్టం చేసే ప్రతి అంశాన్ని జాగ్రత్తతో ఆచితూచి ఆలోచించి ముందుగానే సరిదిద్దుకునే ప్రయత్నం చేస్తారేమో. ఏదేమైనప్పటికీ భారతదేశ భవిష్యత్తుకు యువతరం పాత్ర అత్యంత కీలకమైనది. ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత పారదర్శకమైన పాలన విధానాలు అనుసరించడమే కాకుండా ప్రతి అంశంలో జవాబుదారీతనాన్ని ప్రదర్శించడంతో పాటు అడపాదడపా తలెత్తుతున్న సమస్యలపై యువత చేస్తున్న నిరసనలపై స్పందించి ఆచితూచి సమయానుకూలంగాసరైన సమయంలో వివరణ ఇచ్చేందుకు తరచూ ప్రయత్నించి సఫలం కావడం ఒకఎత్తు. దేశభక్తి భారతదేశ జాతీయ సమైక్యత సమగ్రతకు భంగం కలగకుండా వ్యవహరిస్తున్న తీరు మరొక ఎత్తుకావడం దేశ భవిష్యత్తుకు శుభపరిణామమే. •

28-7Pg5:28-7Pg5.qxd 7/27/2026 10:50 PM Page 1



# మీ గుండె 'లయ' తప్పుతోందా?




**న్యూఢిల్లీ,జూలై 27:** గుండె వేగంగా కొట్టుకోవడం, ఛాతీలో దడ, లేదా కారణం లేకుండా ఆయాసం రావడం వంటి లక్షణాలను చాలామంది తేలిగ్గా తీసుకుంటారు. కానీ, ఇవి ఏట్రియల్ ఫిబ్రిలేషన్ అనే ఏఎఫ్ అని పిలిచే తీవ్రమైన గుండె జబ్బుకు సంకేతాలు కావచ్చు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత సాధారణమైన ఈ గుండె లయ రుగ్మత, నివారించగలిగే పక్షవాతానికి ఒక ప్రధాన కారణంగా మారుతోంది. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం ప్రకారం, భారతదేశంలో సుమారు 80 లక్షల మంది ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌తో జీవిస్తున్నారు. వృద్ధాప్యం, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు వంటి సమస్యలు పెరగడంతో ఈ పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్యూక్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ క్రిస్టోఫర్ గ్రాంగెర్ ప్రకారం, గుండె పై గదుల్లో అసాధారణమైన ఎలక్ట్రికల్ సంకేతాలు ఏర్పడినప్పుడు ఏట్రియల్ ఫిబ్రిలేషన్ సంభవిస్తుంది. దీనివల్ల గుండె పై గదులు ఒక క్రమపద్ధతిలో కాకుండా అస్తవ్యస్తంగా, వేగంగా కొట్టుకుంటాయిఅని ఆయన వివరించారు. కొంతమందిలో గుండె దడ, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, త్వరగా అలసిపోవడం వంటి లక్షణాలు స్పష్టంగా కనిపిస్తాయి. అయితే చాలా మందిలో ఇది సైలెంట్ ఏఎఫ్‌గా ఉంటుంది. అంటే, ఎలాంటి లక్షణాలు బయటకు కనిపించవు. తీవ్రమైన సమస్యలు ఎదురయ్యే వరకు ఈ వ్యాధి ఉన్నట్టు కూడా తెలియదు. అసాధారణ గుండె లయను గుర్తించే స్మార్ట్‌వాచ్‌ల ద్వారా కూడా ఈ పరిస్థితిని ముందుగా పసిగట్టే అవకాశం ఉందని డాక్టర్ గ్రాంగెర్ తెలిపారు. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల ఎదురయ్యే అతిపెద్ద ప్రమాదం పక్షవాతం. గుండె గదులు సరిగా సంకోచించనప్పుడు, రక్తం అక్కడే నిలిచిపోయి గడ్డకట్టే అవకాశం ఉంది. ఈ రక్తం గడ్డకట్టిన ముక్క మెదడుకు ప్రయాణించి రక్తనాళాలను అడ్డుకుంటే, ఇస్కీమిక్ స్ట్రోక్ (పక్షవాతం) వస్తుంది. ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వల్ల పక్షవాతం వచ్చే ప్రమాదం ఐదు రెట్లు పెరుగుతుందని, ప్రతి ఐదు పక్షవాత కేసులలో ఒకటి దీనితో సంబంధం కలిగి ఉంటుందని డాక్టర్ గ్రాంగెర్ తెలిపారు. ఈ రకమైన స్ట్రోక్స్ చాలా తీవ్రంగా ఉండి, శాశ్వత అంగవైకల్యానికి దారితీస్తాయి. ఏఎఫ్ సంబంధిత పక్షవాతాన్ని నివారించడానికి యాంటీకాగ్యులెంట్లు అంటే రక్తాన్ని పలుచనచేసే మందులు అత్యంత ప్రభావవంతమైన మార్గం. ఈ మందులు వాడటం ద్వారా ఏఎఫ్ వల్ల వచ్చే పక్షవాతాలలో 70 శాతం వరకు నివారించవచ్చని డాక్టర్ గ్రాంగెర్ పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో గుండె లయను నియంత్రించే మందులు లేదా కాథెటర్ అబ్లేషన్ అనే ప్రక్రియ ద్వారా కూడా చికిత్స అందిస్తారు. వయసు, జన్యుపరమైన కారణాలు ప్రమాదాన్ని పెంచినప్పటికీ, జీవనశైలి మార్పుల ద్వారా దీనిని నివారించవచ్చు లేదా ఆలస్యం చేయవచ్చు. రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్‌ను అదుపులో ఉంచుకోవడం, ఆరోగ్యకరమైన బరువును పాటించడం, క్రమం తప్పని వ్యాయామం, ధూమపానానికి దూరంగా ఉండటం, ఆల్కహాల్ పరిమితం చేయడం వంటివి చాలా ముఖ్యం. పక్షవాతం వచ్చిన తర్వాత చికిత్సకు అయ్యే భారీ ఖర్చుతో పోలిస్తే, ఏట్రియల్ ఫిబ్రిలేషన్‌ను ముందుగా గుర్తించి చికిత్స తీసుకోవడం ఎంతో మేలని నిపుణులు సూచిస్తున్నారు.

## ఇక 'జీహాద్' ఒక్కటే మార్గం

### ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ సంచలన ప్రకటన



**టెహ్రాన్, జూలై 27:** ఇజ్రాయెల్‌పై పోరాటం సాగిస్తున్న లెబనాన్‌లో హెజ్బొల్లా సాయుధ గ్రూప్‌కు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఇరాన్ సుప్రీంలీడర్ మొజ్తబా ఖమేనీ పునరుద్ఘాటించారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక దాడులు, కార్యకలాపాలు పూర్తిగా నిలిపిపోయే వరకు అమెరికాతో ఇరాన్ ఘర్షణ ముగుస్తుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా, ఇజ్రాయెల్‌పై ఇప్పుడు జీహాద్, ప్రతిఘటన తప్ప మరో మార్గం లేదని మొజ్తబా తేల్చిచెప్పారు. హెజ్బొల్లా సెక్రటరీ జనరల్ షేక్ నయీమ్ ఖాసీమ్, గ్రూప్ యోధులను ఉద్దేశించి ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన పోస్టు పెట్టారు. హెజ్బొల్లా దృఢత్వాన్ని ప్రశంసిస్తూ వారిని రక్షించుకోవడం ఇరాన్‌కు ఒక వ్యూహాత్మక బాధ్యత అని ఆయన నొక్కి చెప్పారు. అమెరికాతో ఇరాన్ యుద్ధం ముగియడానికి ఒప్పందం కుదరాలంటే, లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులను ఎటువంటి షరతులు లేకుండా వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇరాన్‌కు తమ విధేయతను ప్రకటిస్తూ హెజ్బొల్లా రాసిన లేఖకు సమాధానంగా ఇరాన్ సుప్రీం లీడర్ నుంచి ఈ స్పందన వచ్చింది. అమెరికా, ఇజ్రాయెల్‌లకు వ్యతిరేకంగా పోరాటానికి 'జీహాద్, ప్రతిఘటన తప్ప వేరే మార్గం లేదు' అని ఆయన పేర్కొన్నారు. తాత్కాలిక శాంతి ఒప్పందాన్ని అమెరికా, ఇరాన్‌లు ఉల్లంఘించిన తర్వాత మరోసారి పశ్చిమాసియాలో పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. 'ప్రజల ప్రాణాలను తీస్తూ, భవిష్యత్తు తరాలను నాశనం చేస్తున్న అమెరికా ప్రభుత్వం, జియోనిస్టుల(ఇజ్రాయెల్) అణచివేత, నిరంకుశత్వం, దుర్మార్గంతో ప్రపంచ దేశాలు విసిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో 'జీహాద్', ప్రతిఘటన తప్ప మనకు వేరే మార్గం లేదు' అని మొజ్తబా ఖమేనీ ప్రకటించారు. ఇజ్రాయెల్ దురాక్రమణ వ్యతిరేకంగా పోరాడే గ్రూపులకు హెజ్బొల్లా ఒక కొండలా ముందుండి నడిపిస్తుందని, ఈ తిరుగులేని పోరాట ప్రపంచంలోని స్వేచ్ఛ కోరుకునే దేశాలకు స్ఫూర్తిదాయక సందేశంగా మారిందని ఆయన ప్రశంసించారు.

## పాట్నాలో ఏకే47 ఉపయోగించిన కానిస్టేబుల్ సస్పెన్షన్



**పాట్నా,జూలై 27:** నీట్ పరీక్ష అక్రమాలపై బీహార్‌లో జరిగిన విద్యార్థుల నిరసనల సందర్భంగా ఏకే47తో కాల్పులు జరిపిన పోలీసు అధికారిని సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై రాజ్యసభ ఎంపీ మనోజ్ కుమార్ ఝా సుప్రీంకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. జూలై 25న నిర్వహించిన బీహార్ బంద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. పలు చోట్ల పోలీసులు, నిరసనకారులకు మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. లాఠీచార్జ్, టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను పోలీసులు వినియోగించారు. సివాన్‌లో జరిగిన కాల్పుల్లో ముగ్గురు గాయపడగా వారిలో 15 ఏళ్ల మహ్మద్ ఆరిఫ్ మెడలో బుల్లెట్ తగిలింది. శస్త్రచికిత్స ద్వారా బుల్లెట్‌ను తొలగించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో ప్రతిపక్ష నేత తేజస్వీ యాదవ్ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా స్పందిస్తూ ఢిల్లీలో విద్యార్థులపై పెల్లెట్ గన్స్, బీహార్‌లో ఏకే47 వినియోగించడం ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. మరోవైపు ఘటనపై శాఖాపరమైన విచారణ ప్రారంభించినట్లు పోలీసులు వెల్లడించారు. ఆయుధ వినియోగం నిబంధనలకు అనుగుణంగానే జరిగిందా లేదా అంశాన్ని విచారణలో తేల్చనున్నట్లు తెలిపారు.



## పార్లమెంటులో ధర్మేంద్ర ప్రధాన్‌కు ఘనస్వాగతం

### జైరామ్ రమేష్ వ్యాఖ్యలకు ప్రధాన్ కౌంటర్

**న్యూఢిల్లీ,జూలై 27:** నీట్ పేపర్ లీకేజీ వివాదం నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసిన ధర్మేంద్ర ప్రధాన్‌కు సోమవారం పార్లమెంటులో ఘన స్వాగతం లభించింది. చిరునవ్వుతూ కారు దిగిన ధర్మేంద్ర ప్రధాన్, అందరికీ అభివాదం చేస్తూ లోపలికి వెళ్లారు. పలువురు అధికార పక్ష ఎంపీలు ఆయనకు సంఘీభావం తెలుపుతూ శాలువా కప్పి, సంప్రదాయ టోపీతో సత్కరించారు. ఎలాంటి ఆరోపణలు లేకపోయినా ఒక మంత్రి స్వచ్ఛందంగా రాజీనామా చేయడం ఇదే మొదటిసారని ఒక ఎంపీ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో పార్లమెంట్ కారిడార్‌లో కాంగ్రెస్ ఎంపీ జైరాం రమేష్, ధర్మేంద్ర ప్రధాన్‌ను ఉద్దేశించి "అప్పుడప్పుడు ఇలా జరుగుతుంటుంది" అని వ్యాఖ్యానించారు. దీనికి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, "ఏమీ జరగలేదు. నేను వీధి పోరాటాల నుంచి వచ్చిన యోధుడిని, ఏసీ గదుల్లో కూర్చునే కార్యకర్తను కాదు" అని కౌంటర్ ఇచ్చారు.

## ఆ 'సిట్‌'లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను చేర్చండి

### యుపి సర్కార్‌కు సుప్రీంకోర్టు ఆదేశాలు

### రెండు వారాల్లో స్టేటస్ రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశం

**న్యూఢిల్లీ, జులై 27:** అయోధ్య రామమందిర విరాళాల చోరీ ఆరోపణల సంబంధిత కేసులో సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీచేసింది. కేసు దర్యాప్తు పారదర్శకంగా, సమగ్రంగా చేపట్టేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)లో ఫోరెన్సిక్ ఆడిటర్‌ను తప్పనిసరిగా చేర్చాలని ఉత్తర్వులిచ్చింది. అలాగే దర్యాప్తు పురోగతిపై కూడా రెండు వారాల్లోగా స్టేటస్ రిపోర్ట్ సమర్పించాలని సిట్‌ను ఆదేశిస్తూ డెడ్‌లైన్ విధించింది న్యాయస్థానం. ఈ కేసు విచారణ కోసం ఐజీ కిరణ్ నేతృత్వంలో సిట్‌ను ఏర్పాటుచేసినట్లు ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. కేసు విచారణ వేగంగా, నిష్పాక్షి కంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని ధర్మాసనం స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది ఆలయానికి వచ్చిన విరాళాల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండేలా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచాలని కోరారు. అయితే.. ప్రస్తుతం తా ము దర్యాప్తును పూర్తి చేయడంపైనే ప్రధానంగా దృష్టి సారిస్తున్నా మని న్యాయస్థానం పేర్కొంది. ఈ నేపథ్యంలో సదరు వివరాలను వెలువరించడంపై ఎలాంటి ఆదేశాలూ ఇవ్వలేదు. సిట్ సమర్పించే నివేదికను పరిశీలించాకే తదుపరిచర్యలపై నిర్ణయం తీసుకుం టామని స్పష్టం చేసింది.

## సిజెపి నేతలకు సొమ్ములెక్కడినుంచి వచ్చాయి?

### సుప్రీం న్యాయవాది మహేష్ జెత్మలానీ

**న్యూఢిల్లీ,జులై 27:** నిరవధిక ఆందోళన నిర్వహించిన సిజెపి నేతలకు సొమ్ములు ఎక్కడినుంచవ ఇచ్చాయో ఆరదృప్తు చేయించాలని సీనియర్ న్యాయవాది స్పందించారు. సిజేపీ నేతల సంబరాలపార్టీలపై సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది మహేశ్ జెత్మలానీ స్పందించారు. సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా పోస్టు పెట్టి పలు విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా సౌరవ్ దాస్, అశుతోశ్ రాంకా వేడుకల తీరును న్యాయవాది మహేశ్ జెత్మలానీ విమర్శించారు. హోటల్‌లో పార్టీ చేసుకోవడానికి నిధులు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. నిజంగానా సీజేపీ నాయకత్వం హోటల్‌లో విజయోత్సవం జరుపుకుంటోందా, ఢిల్లీలో రోజుల తరబడి హింసాకాండ జరిగిన తర్వాత ఈ యువ కార్యకర్తలమని చెప్పుకునే వారు డ్యా న్సులు చేస్తున్నారు అని ఆయన మండిపడ్డారు. అలాగే ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఆందోళనల వెనుక ఉన్న ఆర్థిక వనరులపైనా జెత్మలానీ ప్రశ్నలు లేవనెత్తారు. ఢిల్లీ ఆందోళనల సమయంలో సీజేపీ నేతలు, కార్యకర్తల ప్రయాణం, ఆహారం,వసతి, లాజిస్టిక్స్‌వంటి వాటికి నిధులు ఎక్కడ నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. ఢిల్లీని అట్టుడికించిన వారికి ఆర్థిక సహాయం ఎవరు చేశా రంటూ ప్రశ్నలు సంధించారు. నీట్ పేపర్ లీక్ ఘటనకు బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన కొద్దిసేపటికే ఈ పార్టీ జరిగినట్లు తెలుస్తోంది.

## నిరసనకారులపై ఎఫ్ఐఆర్‌లను ఇప్పటికీ ఎత్తివేయలేదు

### సిజెపి ప్రతినిధి సౌరవ్‌దాస్ నిరసన

**న్యూఢిల్లీ,జులై 27:** నీట్ పేపర్ లీకేజీ, పరీక్షల అక్రమాలపై తాము చేపట్టిన ఆందోళన విరమణ సందర్భంగా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) సోమవారం ఆరోపించింది. ఢిల్లీ వెలుపల నిరసనకారులపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని, వివిధ రాష్ట్రాల్లో అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేయాలని డిమాండ్ చేసింది. సీజేపీ అధికార ప్రతినిధి సౌరవ్ దాస్ మాట్లాడుతూ, అసోం, పశ్చిమ బెంగాల్, బీహార్ వంటి రాష్ట్రాల్లో విద్యార్థులు,నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని అరెస్టులు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ లేదా ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లో నిరసనకారులపై ఎలాంటి శిక్షార్హమైన చర్యలు తీసుకోబోమని కేంద్రం హామీ ఇచ్చిన నేపథ్యంలోనే మేము మా దేశవ్యాప్త ఆందోళనను విరమించుకున్నాం. ప్రస్తుతం వస్తున్న నివేదికలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్ తక్షణమే జోక్యం చేసుకుని, అదుపులోకి తీసుకున్న వారిని విడుదల చేసేలాచూడాలని కోరారు. మంగళవారం లోగా లిఖితపూర్వక హామీ ఇస్తామన్న విషయాన్ని గుర్తు చేస్తూ, ఒకవేళ హామీలను గౌరవించకపోతేతదుపరి కార్యాచరణ చేపట్టాల్సి వస్తుం దని హెచ్చరించారు.అయితే, ఢిల్లీలో నమోదైన సుమారు 15 ఎఫ్ఐఆర్‌ల ఉపసంహరణపై ఉన్నతాధికారుల నుంచి అధికారిక ఆదేశాలు వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.

## జెన్జీ సిజెపి ఉద్యమానికి పొరుగుదేశాల్లోను ప్రశంసలు



**న్యూఢిల్లీ,జులై 27:** భారత జెన్‌జీ తమ బలహీనతలనే బలంగా మార్చుకుంది. పరీక్షా పత్రాల లీకేజీపై వారు చేసిన వినూత్న ఉద్యమం, కేంద్ర ప్రభుత్వాన్ని కదిలించి ఏకంగా విద్యాశాఖ మంత్రి రాజీనామాకు దారితీసింది. ఈ ఉద్యమ ప్రభావం కేవలం దేశానికే పరిమితం కాలేదు. సరిహద్దులు దాటి పాకిస్థాన్, శ్రీలంక, నేపాల్ వంటి పొరుగు దేశాల యువతను సైతం ఆకర్షించి, వారి నుంచి ప్రశంసలు అందుకుంటోంది. కాక్రోచ్ జనతా పార్టీ సీజేపీ పేరుతో మొదలైన ఈ ఉద్యమంలో మీమ్స్ మేనిఫెస్టోలుగా, రీల్స్ నియామక సాధనాలుగా మారాయి. పోలీసుల చర్యలకు సంబంధించిన షార్ట్ వీడియోలు ఆధారాలుగా నిలిచాయి. ఈ వినూత్న పోరాట పటిమ ఇప్పుడు పొరుగు దేశాల్లో హాట్ టాపిక్‌గా మారింది. భారత జెన్‌జీ ఉద్యమంపై పాకిస్థాన్ నుంచి అనూహ్యమైన స్పందన వస్తోంది. అక్కడి యువత భారత యువతరం ధైర్యాన్ని, ఐక్యతను చూసి ముగ్ధులవుతున్నారు. మీరు ఇలాగే అద్భుతమైన పనులు చేస్తుంటే, మేం మిమ్మల్ని ఎలా ద్వేషించగలం బహుశా ప్రేమలో పడతామేమోనని ఒక పాకిస్థానీ యువతి చెప్పడం విశేషం. కులం, మతం వంటి విభేదాలను పక్కనపెట్టి భారత విద్యార్థులు ఏకతాటిపై నిలవడాన్ని వారు ప్రత్యేకంగా ప్రశంసిస్తున్నారు. ఈ ఉద్యమానికి పాకిస్థాన్ నిధులు ఇస్తోందని కొందరు అంటున్నారు. మా దేశాన్ని నడుపుకోవడానికే మా దగ్గర డబ్బు లేదు. ఇక మీకెలా ఇస్తామని బిలాల్ హసన్ అనే కంటెంట్ క్రియేటర్ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. 2022లో ఆర్థిక సంక్షోభంపై పోరాడి ప్రభుత్వాన్ని గద్దె దింపిన శ్రీలంక యువతకు, భారత జెన్‌జీ ఉద్యమం తమ పోరాటాన్ని గుర్తు చేస్తోంది. అక్కడి కార్టూనిస్టులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు భారత యువతకు మద్దతుగా పోస్టులు పెడుతున్నారు. ముంబైలో పోలీసు వ్యాన్‌ను ఒక యువతి ఒంటరిగా అడ్డుకున్న ఫొటోను, చైనాలోని చారిత్రక ట్యాంక్ మ్యాన్ ఫొటోతో పోలుస్తూ ప్రశంసిస్తున్నారు. నేపాల్ యువత కూడా భారత విద్యార్థుల ఆవేదనను అర్థం చేసుకుం టోంది. విద్యార్థులు రోడ్లపైకి రావడం చూస్తుంటే గుండె తరుక్కు పోతోంది. మీ పోరాటం సరైనదే. మీ లక్ష్యం ఏమిటో ఎప్పుడూ మర్చిపోవద్దని నేపాల్‌కు చెందిన ఓ కంటెంట్ క్రియేటర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నాడు.

## విద్యార్థులపై అణిచివేత ఇంకా ఆగలేదు

### మోడీజీ క్షమాపణలు చెప్పాల్సిందే: రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జులై 27:** దేశవ్యాప్తంగా నిరసనలు చేపడుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు అణచివేత ధోరణిని అవలంబిస్తున్నాయని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ మండిపడ్డారు. విద్యార్థులపై కాల్పులు, లాఠీఛార్జీలు, కేసులు నమోదు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన ఆగ్రహించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెడుతూ కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. బీహార్‌లో నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఏకే47తో కాల్పులు జరిపారని, వందలాది మంది విద్యార్థులను అరెస్టు చేసి వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారనే వార్తలు వస్తున్నాయని రాహుల్ గాంధీ అన్నారు. విద్యార్థులందరికీ ప్రధాని మోదీ బహి రంగంగా క్షమాపణ చెప్పాలన్నారు.

## పిఓకెలో జాక్ లాంగ్ మార్చ్..పరిస్థితులు ఉద్రిక్తం

**ముజఫరాబాద్,జులై 27:** పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ లో పరిస్థితులు మరోసారి ఉద్రిక్తంగా మారాయి. పాక్ అధికారులతో చర్చలు విఫలమవడంతో జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ) రావల్‌కోట్ నుంచి ముజఫరాబాద్ వరకు లాంగ్ మార్చ్‌కు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో శాంతియుత నిరసనకారులపై బలప్రయోగం చేయవద్దని యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ యూకేపీఎన్‌పీ పాకిస్థాన్ ప్రభుత్వాన్ని కోరింది. మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీలు రావల్‌కోట్‌లో కలుసుకున్నాయి. ఈ ర్యాలీని అడ్డుకునేందుకు పాక్‌ప్రభుత్వం రేంజర్స్, ఫ్రంటియర్ కానిస్టేబులరీ (ఎఫ్‌సీ),పంజాబ్ కానిస్టేబులరీ (పీసీ)దళాలను అదనంగా మోహరించినట్లు సమాచారం.

## అమిత్ షా వివరణ కోరుతూ పార్లమెంట్‌లో ప్రతిపక్షాల ఆందోళన

**న్యూఢిల్లీ,జులై 27:** పార్లమెంట్‌లో సోమవారం మరోసారి అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర ప్రతిష్ఠంభన నెలకొన్నాయి. జూలై 20న ఢిల్లీలో జరిగిన ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్వయంగా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉభయ సభల కార్యకలాపాలను అడుకున్నాయి.ఈ మేరకు రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గేపార్లమెంట్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటికే నిర్ణయించిన చర్చల్లో పాల్గొనకుండా, ఢిల్లీలో కాక్‌రోచ్ జనతా పార్టీ చేపట్టిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా పోలీసులు అతిగా వ్యవహరించారనే ఆరోపణలపై కేంద్ర హోంమంత్రి సభలో ప్రకటన చేయాలని పట్టుబట్టాయి.

సోమవారం ఉదయం 11 గంటలకు పార్లమెంట్ సమావేశాలు ప్రారంభమైన వెంటనే ఉభయ సభల్లో ప్రతిపక్ష సభ్యులు నినాదాలతో ఆందోళనకు దిగారు. దీంతో లోక్ సభ స్పీకర్ ఓంబిర్లా సభా కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ప్రతిపక్ష సభ్యులను హెచ్చరించారు. తీవ్ర గందరగోళం నెలకొనడంతో లోక్‌సభ, రాజ్యసభలను మధ్యాహ్నం 12 గంటల వరకు వాయిదా వేశారు.పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు2026ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టాం. అన్ని రాజకీయ పార్టీలు చర్చలో పాల్గొని తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరుతున్నామని రిజిజు చెప్పారు. పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాన్ని రూపొందిస్తున్నామని, ఇలాంటి కీలక బిల్లుపై చర్చకు దూరంగా ఉండి సభలో గందరగోళం సృష్టించడం ప్రజలకు మంచి సందేశం కాదని ఆయన స్పష్టం చేశారు.



## మత మార్పిడితో ఎస్సీ హోదా రద్దు

### మరోమారు సుప్రీంకోర్టు స్పష్టీకరణ

### రివ్యూ పిటిషన్ కొట్టేసిన ధర్మాసనం

**న్యూఢిల్లీ, జులై 27:** షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధ మతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, మత మార్పిడి జరిగిన క్షణం నుంచే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని పేర్కొన్న సుప్రీంకోర్టు తీర్పును సమీక్షి ంచాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. రికార్డులో ఎటువంటి లోపం కనిపించడం లేదని పేర్కొంటూ, జస్టిస్‌లు ప్రశాంత్ కుమార్ మిశ్రా, మన్మోహన్‌లతో కూడిన ధర్మాసనం మార్చి 24 నాటి తీర్పుకు వ్యతిరేకంగా దాఖలైన పిటి షన్‌ను కొట్టివేసింది. "సమీక్షా పిటిషన్‌పై మౌఖిక విచారణ కోరుతూ దాఖలు చేసిన దరఖాస్తును తిరస్కరించడమైనది. తాము సమీక్షా పిటిషన్‌ను పరిశీలించి, సమీక్షి ంచాలని కోరిన మార్చి 24, 2026 నాటి తీర్పును కూడా పరిశీలించాము. రికార్డులో ఎటువంటి లోపం స్పష్టంగా కనిపించడం లేదు. అందువల్ల, సమీక్షా పిటిషన్‌ను కొట్టివేస్తున్నామ్ణు అని సమీక్షా పిటిషన్‌పై జులై 15న జారీ చేసిన తన ఉత్తర్వులో సుప్రీంకోర్టు పేర్కొంది. మార్చి 24న, ఒక కీలకమైన తీర్పులో, షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి హిందూ, సిక్కు లేదా బౌద్ధమతం కాకుండా వేరే మతంలోకి మారినప్పుడు, పుట్టుకతో సంబంధం లేకుండా మతం మారిన క్షణం నుంచే షెడ్యూల్డ్ కుల హోదాను కోల్పోతారని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. షెడ్యూల్డ్ కుల వర్గానికి చెందిన వ్యక్తి క్రైస్తవ మతంలోకి మారిన వెంటనే తన షెడ్యూల్డ్ కుల హోదాను "తక్షణమే మరియు పూర్తిగ్గా కోల్పోతారని పేర్కొన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వును ఇది సమర్థించింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 342లోని క్లాజ్ (1) ప్రకారం, భారత రాష్ట్రపతి వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల (యూటీలు) కోసం "షెడ్యూల్డ్ తెగల్ణు గా గుర్తించబడిన తెగలు, గిరిజన వర్గాలను గుర్తిస్తూ 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ తెగలు) ఉత్తర్వును జారీ చేశారని సుప్రీంకోర్టు పేర్కొంది.

## నిరసనకారులపై బలప్రయోగాన్ని సమర్థించలేం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జులై 27:** నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలో జరిగిన విద్యార్థుల నిరసనల్లో పోలీసులు బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టు సోమవారం కీలక వ్యాఖ్యలు చేసింది. శాంతియుతంగా, చట్టబద్ధంగా జరిగే నిరసనల్లో పాల్గొనడం ప్రతి పౌరుడికీ రాజ్యాంగం కల్పించిన హక్కు అని స్పష్టంచేసింది. కేవలం ఆందోళన జరుగుతోందనే కారణంతో లాఠీచార్జ్‌కు దిగడం సరికాదని పేర్కొంది. పోలీసులు హద్దులు మీరి వ్యవహరించి ఉంటే స్వతంత్రంగా దర్యాప్తు జరగాలని సూచించింది. విద్యార్థులు, కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) చేపట్టిన 'సంసద్ చల్లో' నిరసన సందర్భంగా జరిగిన పోలీసు చర్యలపై దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం విచారించింది. దేశవ్యాప్తంగా నిరసనల సమయంలో పోలీసులు అనుసరించాల్సిన విధానంలో ఏకరూపత అవసరమని అభిప్రాయపడింది. నిరసన జరిగిందనే కారణంతో బలప్రయోగం చేయడం సమర్థనీయం కాదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా గాయపడిన పోలీసుల కుటుంబాల తరఫున వాదించేందుకు వచ్చిన న్యాయవాదికి కూడా కోర్టు అనుమతి ఇచ్చింది. విద్యార్థులకైనా, పోలీసులకైనా గాయాలు కావడం సమానంగా ఆందోళనకరమేనని జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి వ్యాఖ్యానించారు. నిరసనలను ఎదుర్కొనే పోలీసులకు హెల్మెట్లు వంటి రక్షణ పరికరాలు ఎందుకు అందించలేదని రాష్ట్రాలను ప్రశ్నించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఈ వ్యవహారానికి సంబంధించిన అన్ని పిటిషన్లను మంగళవారం కలిపి విచారించనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది.

## 'ఇ20 పెట్రోల్'తో లబ్ధి ఆరోపణలు, బాంబే హైకోర్టును ఆశ్రయించిన గడ్కరీ

**ముంబై, జులై 27:** తన పేరును 'ఇ20 పెట్రోల్' కార్యక్రమంతో ముడిపెడుతూ సోషల్ మీడియాలో ప్రచారమైన పోస్టులు, డీప్‌ఫేక్ వీడియోలపై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ న్యాయపోరాటానికి దిగారు. తనతోపాటు కుటుంబసభ్యులు ఇ20 విధానం వల్ల లబ్ధిపొందినట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపిస్తూ బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై మెటాతోపాటు ఇతర సోషల్ మీడియా వేదికలు, గుర్తుతెలియని వ్యక్తులపై సివిల్ దావా వేయడానికి హైకోర్టు అనుమతిచ్చింది. ఇ20 ఇథనాల్ కార్యక్రమంవల్ల తన కుటుంబం లాభపడిందంటూ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరిగిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వాస్తవానికి ఇథనాల్ మిశ్రమ ఇంధన విధానాన్ని కేంద్ర పెట్రోలియం, సహజవాయు మంత్రిత్వ శాఖ అమలు చేస్తోందని వివరించారు. ఈ పోస్టులు డీప్‌ఫేక్ కంటెంట్ ముంబైలో కూడా అందుబాటులో ఉండటంతో బాంబే హైకోర్టుకు ఈ కేసును విచారించే అధికారం ఉందని గడ్కరీ తరఫు న్యాయవాది వాదించారు. ఈ వాదనలు విన్న జస్టిస్ అభయ్ అహుజా.. సివిల్ సూట్ దాఖలు చేసేందుకు అనుమతి మంజూరు చేశారు.

# సంక్షిప్త వార్తలు


## ఉక్రెయిన్‌ను వదలం..తగిన బుద్ధి చెబుతాం: ఇరాన్



**టెహ్రాన్, జులై 27:** కాస్పియన్ సముద్రంలో తమ వాణిజ్య నౌకపై ఉక్రెయిన్ జరిపిన దాడిలో ఒక నావికుడు మరణించగా, మరొకరు గాయపడినట్లు ఇరాన్ తెలిపింది. ఈ ఘటనపై టెహ్రాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తమ దేశ ప్రయోజనాలు, ఆస్తులను కాపాడుకునేందుకు ఎలాంటి చర్యకైనా వెనకాడబోమని స్పష్టంచేసింది. ఈ దాడికి కారణమైన ఉక్రెయిన్ తగిన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. యుద్ధం మరింత విస్తరించకుండా ఉండాలంటే కీవ్‌ను కట్టడి చేయాలని ఐరోపా దేశాలను ఇరాన్ డిమాండ్ చేసింది.

## చెరువులో పడి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

**జైపూర్, జులై 27:** రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అక్కడి ఓ చెరువులో ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతదేహాలు లభ్యమవడం తీవ్ర కలకలం రేపుతోంది. అయితే వారంతా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రామ్‌దేవ్రా పోలీసు స్టేషన్ పరిధిలోని లోహార్కి గ్రామంలో ఆదివారం రాత్రి ఈ ఘటన జరిగింది. నీటిలోకి దూకిన నలుగురిలో జస్రాజ్ అనే వ్యక్తి కేకలు వేయడం గమనించి కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే అక్కడకు పరుగెత్తుకెళ్లారు. కానీ చెరువు దగ్గరికి చేరుకునే సరికే వారంతా నీటిలో మునిగిపోయారు.



## అమెరికాలో కాల్పులు, ముగ్గురి మృతి


**వాషింగ్టన్, జులై 27:** అమెరికాలోని సియాటెల్‌లో తుపాకీ సంస్కృతి పడగవిప్పింది. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన స్పేస్ నీడిల్ సమీపంలో జరుగుతున్న వార్షిక ఫుడ్ ఫెస్టివల్ దగ్గర దుం డగులు సామూ హిక కాల్పులకు తెగబడటంతో ముగ్గురు ఘటనాస్థలంలోనే ప్రాణాలు కోల్పోగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా పోలీసులు ఒక దుండగుడిని అరెస్టు చేశారు. స్థానిక కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఈ సామూ హిక కాల్పుల ఘటన జరిగింది. వందలాదిగా ఉన్న ఫుడ్‌స్టాళ్లు, లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌తో కళకళ లాడుతున్న సియాటెల్‌లో అకస్మాత్తుగా తుపాకీ మోతలు వినిపించాయి.

## తాహిర్ హుస్సేన్‌కు శిక్షపై తీర్పును రిజర్వ్ చేసిన కోర్టు




**న్యూఢిల్లీ, జులై 27:** 2020 ఈశాన్య ఢిల్లీ అల్లర్ల సమయంలో ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) అధికారి అంకిత్ శర్మ హత్య కేసులో దోషులుగా తేలిన మాజీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కౌన్సిలర్ తాహిర్ హుస్సేన్, మరో నలుగురికి విధించాల్సిన శిక్షా పరిమాణంపై ఢిల్లీ కోర్టు సోమవారం తన తీర్పును రిజర్వ్ చేసింది. శిక్షకు సంబంధించిన అంశంపై ప్రాసిక్యూషన్, డిఫెన్స్ తరఫు వాదనలు వివరంగా విన్న తర్వాత జులై 31న తీర్పును వెల్లడిస్తామని కర్కర్‌డూమా కోర్టు అదనపు సెషన్స్ జడ్జి(ఎఎస్‌జె) ప్రవీణ్ సింగ్ తెలిపారు. శర్మ హత్యను 'పక్కాని', 'క్రూరమైన' హత్యగా అభివర్ణిస్తూ, గరిష్ట శిక్షను కోరుతూ ఢిల్లీ పోలీసులు మరణశిక్ష విధించాలని కోర్టును అభ్యర్థించారు.

## రూ.25వేల వరకూ భారత్ కరెన్సీకి నేపాల్‌లో అనుమతి



**ఖాట్మండు,జులై 27:** భారత కరెన్సీ వినియోగంపై నేపాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దాదాపు పదేళ్లుగా కొనసాగుతున్న ఆంక్షలను సడలిస్తూ, రూ.200, రూ. 500 విలువైన భారత కరెన్సీ నోట్లను దేశంలోకి తీసుకురావడానికి, తీసుకెళ్లడానికి అనుమతించింది. భారతీయులు, నేపాలీ పౌరులు ఇరుదేశాల మధ్య ప్రయాణించేటప్పుడు రూ.25వేల పరిమితికి లోబడి ఈ నోట్ల ను తమ వెంట ఉంచుకోవచ్చని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో 2016లో భారత్ చేపట్టిన నోట్ల రద్దు అనంతరం విధించిన నిబంధనలకు తెరపడినట్లయింది.

## బ్యాంక్ ఆఫ్ బరోడా నుంచి ఒక టెరాబైట్ డేటా చోరీ

**ముంబయి,జులై 27:** దేశంలోని ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడాలో భారీ సైబర్ దాడి జరిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. బ్యాంక్ వ్యవస్థలోకి చొరబడ్డామని ప్రకటించిన ఓ హ్యాకర్ దాదాపు ఒక టెరాబైట్ కీలక డేటాను డార్క్‌వెబ్‌లో ఉచితంగా అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నాడు. ఇందులో ఖాతాదారుల ఆధార్ నంబర్లు, పేర్లు, రుణాల వివరాలు, సేవింగ్స్, కరెంట్ ఖాతాల సమాచారం, నెట్‌బ్యాంకింగ్, ఎన్ఆర్ఐ, కార్పొరేట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన రికార్డులు ఉన్నాయని చెబుతున్నాడు. ఈ డేటా లీక్‌కు సంబంధించిన కొన్ని నమూనా పత్రాలను కూడా హ్యాకర్లు ఆన్‌లైన్‌లో విడుదల చేశారు.

28-7Pg6exHMNWJQE:28-7Pg6exHMNWJQE.qxd 7/27/2026 10:51 PM Page 1





## గురుపౌర్ణమిన 155మందితో సమగ్రయోగా

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** పతంజలి సేవా కార్యకర్తల ఆధ్వర్యంలో 'డయాబెటిస్ రహిత తిరుపతి మిషన్' ప్రారంభిస్తున్నట్లు పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రితేవ్ జీ ప్రకటించారు. సమగ్ర యోగా విధానాల ద్వారా తిరుపతిని మధుమేహ రహిత నగరంగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమం లక్ష యమని తెలిపారు. ప్రీడయాబెటిస్, డయాబెటిస్‌తో బాధపడుతున్న వారు ప్రత్యేక యోగా శిబిరంలో నమోదు చేసుకుని వ్యాధి నియంత్రణ, నివారణకు యోగాను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని పతంజలి యోగా సమితి, భారత్ స్వాభిమాన్ జిల్లా ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యోదయ పాఠశాల ప్రాంగణంలో ఘనంగా గురుపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్ఎస్ఎస్ కుటుంబ ప్రబోధన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్ రాజు మాట్లాడుతూ భారతదేశం తన కుటుంబ విలువలు, సామాజిక వ్యవస్థను పరిరక్షి ంచి బలోపేతం చేయడం ద్వారా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పతంజలి యోగపీఠ్, హరిద్వార్ కేంద్ర సమన్వయకర్త స్వామి రితేవ్ జీ మాట్లాడుతూ యోగా ప్రచారంలో తిరుపతి జిల్లా విశేష పురోగతి సాధిస్తోందని ప్రశంసించారు. జిల్లాలో 155 మంది యోగా ఉపాధ్యాయులు విజయవంతంగా శిక్షణ అందించి, వారికి కార్యక్రమంలో ధ్రువ పత్రాలు ప్రదానం చేసినందుకు అభినందనలు తెలిపారు. పతంజలి యోగా రాష్ట్ర అధ్యక్షుడు కైలాష్ రాజ్ పురోహిత్, జిల్లా అధ్యక్షుడు హరి, మహిళా విభాగం అధ్యక్షురాలు రాధిక, ఉపాధ్యక్షురాలు ఉమ, భారత్ స్వాభిమాన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండ్ల సోమేశ్వర్ తదితరులు

## విద్యుత్ సమస్యలకు సత్వర పరిష్కారమే ధ్యేయం

● 'డయల్ యువర్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి'లో శివశంకర్ లోతేటి



**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** వినియోగదారుల విద్యుత్ సమస్యలను సత్వరం పరిష్కరిస్తున్నామని, ఆ దిశగా చొరవ తీసుకుంటున్నట్లు ఎస్పిడిసిఎల్ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి తెలిపారు. వ్యవసాయ విద్యుత్ సర్వీసుల మంజూరులో జాప్యం, ఓల్టేజ్ సమస్యలు, విద్యుత్ స్తంభాల మార్పిడి తదితర సమస్యలను సిఎండి దృష్టికి తీసుకు వచ్చారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా మాల్యవంతం గ్రామానికి చెందిన శైలజ మాట్లాడుతూ తమ పొలంలో ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చిన ఐదు రోజుల్లోనే తమ సమస్యను పరిష్కారం లభించడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ధన్యవాదాలు తెలియజేశారు. ఎస్పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ సిఎండి కార్యక్రమం జరిగింది. సిఎండి శివ శంకర్ లోతేటి మాట్లాడుతూ వినియోగదారుల విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించే విధంగా సంబంధిత సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అదేవిధంగా విద్యుత్ బిల్లుల ఆన్లైన్ చెల్లింపుల పట్ల వినియోగదారులకు సంస్థ అధికారులు, సిబ్బంది స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు 1912,1800 425 155333కు కాల్ చేయడంగానీ వాట్సాప్ నంబరు 91333 31912కు చాట్ చేయడం, ఎస్పిడిసిఎల్ చాట్ బోట్ ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చని తెలిపారు. డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, కె.రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె.ఆదిశేషయ్య, జె.రమణా దేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్.శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్, ఎస్.రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, భాస్కర్ రెడ్డి, జగదీష్, లత, పిఆర్ఒ తోట మధుసూదన తదితరులు పాల్గొన్నారు.

## రూఫ్ టాప్ సోలార్ పనులు



## ఆగస్టు నెలాఖరులోగా లక్ష్యాన్ని చేరుకోవాలి

● ఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎస్పిడిసిఎల్ పరిధిలో రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆ సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సూచించారు. కార్పొరేట్ కార్యాలయం నుండి సోమవారం సంస్థ పరిధిలోని తొమ్మిది జిల్లాల అధికారులు, కాంట్రాక్టర్లతో సిఎండి శివశంకర్ లోతేటి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంస్థ పరిధిలోని నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, కడప, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాల్లోని 2.07 లక్షల ఎస్సీ,ఎస్టీ విద్యుత్ వినియోగదారుల గృహాలపై సోలార్ సిస్టమ్స్ ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని ఆయా జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు, ఇతర అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ పనుల పురోగతిని ఆయా జిల్లాల నోడల్ ఆఫీసర్లు పర్యవేక్షి స్తూ, పనులను త్వరితగతిన పూర్తిచేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది, అధికారులు, కాంట్రాక్టర్లు సమన్వయంతో ఈ ఏడాది ఆగస్టు నెలాఖరులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తిచేయని కాంట్రాక్టర్లపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం సంస్థ పరిధిలోని వివిధ జిల్లాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులతో సమీక్షి ంచారు. వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తును సరఫరా చేసేందుకు ప్రాధాన్యతనివ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పి.అయూబ్ ఖాన్, కె.గురవయ్య, చీఫ్ జనరల్ మేనేజర్ కె.ఆదిశేషయ్య, జె.రమణాదేవి, ఆర్.పద్మ, ఎం.మురళి కుమార్, ఎన్ శోభా వాలెంటీనా, సిహెచ్ రామచంద్రరావు, కె. సంపత్ కుమార్, ఎస్. రమణ, జనరల్ మేనేజర్లు శ్రీకాంత్, చక్రపాణి, జగదీష్, భాస్కర్‌రెడ్డి, లత, 9 జిల్లాల సూపరింటెండింగ్ ఇంజనీర్లు శేషాద్రి శేఖర్, మోజెస్, ప్రదీప్ కుమార్, సుధాకర్, శ్రీనివాసులు, రాఘవేంద్రం, చంద్రశేఖరరావు, సోమశేఖర్‌రెడ్డి, అమర్‌బాబు, అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

# సంక్షేమం అభివృద్ధే కూటమి ప్రభుత్వం లక్ష్యం

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ళలో సంక్షేమ పథకాలు అమలుతో బాటు రాష్ట్ర అభివృద్ధి ప్రధాన లక్ష యంగా కృషి చేశామని తిరుపతి టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి జెబి శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ విజయాలపై ఇంటింటికి టిడిపి కార్యక్రమం తిరుపతి నగరంలోని 50వ డివిజన్ తిమ్మినాయుడు పాలెంలో సోమవారం ఉదయం ప్రారంభమైంది. పార్లమెంటర్ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి మ్మ, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్‌తో కలిసి జెబి శ్రీనివాస్ ప్రజలతో మమేకమయ్యారు.



ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందుతున్న పథకాల గురించి వివరించడంతో బాటు వారికి అందిన పథకాలపై ఆరా తీశారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బిజీ కృష్ణ యాదవ్, యూనిట్ ఇన్‌చార్జ్ ఖాయం వెంకటరత్నం, డివిజన్ అధ్యక్షుడు దండు విజయ్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, తాతయ్యగుంట ఆలయ ఛైర్మన్ మహేష్ యాదవ్, క్లస్టర్ ఇన్‌చార్జులు పులిగోరు మురళీకృష్ణ, ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్ కుమార్, దంపూరి భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్, టిడిపి నాయకులు, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

## బొండా ఉమా వివాదం... త్రిసభ్య కమిటీ ఏర్పాటు

### నేడు వివరణ తీసుకోనున్న పల్లా, నిమ్మల

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే బొండా ఉమమహేశ్వరరావు(ఉమా) నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. మాజీ మంత్రి ముద్రగడ్డ పద్మనాభం సంస్మరణ సభలో బొండా ఉమా, వైఎస్సార్సీపీ నేత అంబటి రాంబాబు తదితరులతో కలిసి వేదిక పంచుకున్నారు. 2019లో టిడిపి ఓటమిపై సంచలన వ్యాఖ్యలు చేసారు. ఈ అంశం వివాదాస్పదంగా మారింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే బోండా ఉమ, అంబటి రాంబాబు వ్యవహారంపై త్రిసభ్య కమిటీని టటిడిపి ఎపి అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఏర్పాటు చేసారు. పల్లాతో కలిపి మంత్రి నిమ్మల, కిలారు రాజేష్‌లతో త్రిసభ్య కమిటీ మంగళవారం సాయంత్రం పార్టీ కేంద్ర కార్యాలయానికి రావాలని బోండా ఉమకు పిలుపు పంపింది. చంద్రబాబు ఆదేశాలతో బొండా ఉమా నుంచి నుంచి మంత్రి రామానాయుడు, పల్లా శ్రీనివాస్ వివరణ తీసుకోనున్నారు. వైఎస్సార్సీపీ నేతలతో వేదిక పంచుకోవడంపై నేతలకు బొండా ఉమా వివరణ ఇవ్వనున్నారు. ఉమా నుంచి వివరణ తీసుకొని నివేదికను చంద్రబాబుకు సమర్పించనున్నారు. గతంలో వైఎస్సార్సీపీ నేతలతో టిడిపి నేతలు వేదిక పంచుకోవటాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించింది. ఘటనలు పునరావృతం కాకూడదని గతంలోనే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

## ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేయండి

● కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయకు

### ఎంపిలు కేశినేని చిన్ని, మాగుంట లేఖ

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఇఎస్ఐ ఆస్పత్రి అప్‌గ్రెడేషన్ చేయాలని లోక్‌సభ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర కార్మిక శాఖమంత్రి మన్సుఖ్ మాండవీయకు లేఖ రాశారు. ఇఎస్ఐసి మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేయాలని కేశినేని చిన్ని కేంద్రానికి తన లేఖలో విజ్ఞప్తి చేసారు. గుణదలలో ఇఎస్ఐ ఆస్పత్రిని 300 పడకల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిగా మార్చాలని ఎంపి విజ్ఞప్తి చేశారు. విజయవాడ ఇఎస్ఐ ప్రాంగణంలోనే నూతనంగా ఇఎస్ఐసి మెడికల్ కాలేజీ మంజూరుకు అవకాశాలు ఉన్నాయని లేఖలో పేర్కొన్నారు. ప్రస్తుత ఆసుపత్రి ఆవరణలోనే 25 ఎకరాల భూమి అందుబాటులో ఉందని, అదనపు భూమి అవసరం లేకుండానే నిర్మించవచ్చని ఎంపి కేశినేని చిన్ని స్పష్టం చేశారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు సహా 8 జిల్లాల్లోని 2.88 లక్షల మంది కార్మికులు, 10 లక్షల మంది వారి కుటుంబ సభ్యులకు ఆధునిక వైద్యం అందుబాటులోకి వస్తుందని ఎంపి కేశినేని చిన్ని లేఖలో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర మంత్రిని కలిసి విజయవాడ ఎంపి కేశినేని చిన్ని, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి లేఖను అందజేశారు.

## తిరుమల సమాచారం



### విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆషాడమాసంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన ఉడిపి అద్మార్ మఠం పీఠాధిపతి విశ్వప్రియతీర్థస్వామికి టిటిడి పెద్దమర్యాద చేసింది. సోమవారం శిష్యులతో కలసి తిరుమల ఆలయం వద్దకు విచ్చేసిన స్వామికి టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ పేష్కార్ రామకృష్ణ, అర్చకులు సాంప్రదాయంగా స్వాగతం పలికారు. తొలుత ధ్వజ స్తంభానికి నమస్కరించిన స్వామి ఆనందనిలయంలో శ్రీవారిని దర్శించుకున్నారు. కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు బహుకరించారు. కలియుగంలో ప్రజలు భక్తిభావంతో మోక్షం పొందాలని అనుగ్రహించారు.

### ఆగస్ట్‌లో రెండు సార్లు గరుడసేవ

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల్లో రానున్న ఆగస్ట నెలలో రెండు సార్లు గరుడసేవ నిర్వహించనున్నారు. సాధారణంగా నెలలో పౌర్ణమిన గరుడసేవ జరుగుతుంది. ఆగస్ట్‌లో 17వ తేదీ సోమవారం గరుడపంచమి పర్వదినాన ఆరోజు రాత్రి మలయప్పస్వామి గరుడుని అధిరోహించి ఆలయ మాఢవీధుల్లో ఊరేగుతారు. అలాగే 28న శ్రావణ పౌర్ణమి సందర్భంగా పౌర్ణమి గరుడ సేవ అత్యంత వైభవంగా జరగనుంది. సర్వాంగ సుందరంగా ముస్తాబైన మలయప్పస్వామి గరుడ వాహనంపై కొలువుదీరి భక్తులను కటాక్షించనున్నారు. ఈ అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టాన్ని కనులారా తిలకించడానికి లక్షలమంది భక్తులకు టిటిడి పిలుపునిచ్చింది. ఆగస్ట 28న జరిగే గరుడసేవ బ్రహ్మోత్సవాల గరుడసేవకు ట్రయల్‌రన్‌గా నిర్వహించనున్నారు.



### కపిలేశ్వరస్వామికి గ్రంధి పవిత్ర సమర్పణ

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుపతి కపిలేశ్వరస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాల్లో సోమవారం గ్రంధి పవిత్ర సమర్పణ కార్యక్రమం జరిగింది. వేదమంత్రోచ్చారణలు, మంగళ వాద్యాల నడుమ అత్యంత శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో కపిలేశ్వరస్వామిని మేల్కొలిపి, పవిత్ర అభిషేకం నిర్వహించారు. ఆలయ ఆగమ సంప్రదాయాల ప్రకారం నిత్యహోమం, గ్రంధి పవిత్ర సమర్పణ, మూలమూర్తులకు విశేష ఉపచారాలు ఘనంగా చేపట్టారు. పవిత్రోత్సవాల ఆధ్యాత్మిక వాతావరణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పరమేశ్వరుని కృపాకటాక్షాలను పొందారు. సాయంత్రం యాగశాలలో ప్రత్యేక పూజలు, హోమం, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ నాగరత్న, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

# కొండంత వివాదంలో అరకు కాఫీ రుచులు!

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యం లక్ష మంది వరకు భక్తులు వస్తున్న తిరుమలలో ఇప్పటికే దుకాణాల ఏర్పాటు కొండంత వివాదం రగులుతుండగా సందట్లో సడేమియా అన్నట్లు టిటిడి బోర్డు పెద్దలు, అధికారులు అరకు కాఫీ రిటైల్ ఔట్‌లెట్ ఏర్పాటుకు సుముఖత చూపడం చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే తిరుమలలో సిఆర్ఒ ప్రాంతం సమీపంలో, భక్తుల రద్దీ ఉండే ప్రాంతాల్లో ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన రెండు మూడు ప్రైవేట్ డెయిరీలతో బాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన పాల ఉత్పత్తుల విక్రయాల ఔట్‌లెట్‌లు నడుస్తున్నాయి.

తాజాగా తిరుమలలో భక్తుల కోసం జిసిసి ఔట్‌లెట్ ఏర్పాటుకు స్థలం ఎంపిక, అనుమతులివ్వడం వెనుక పెద్ద చర్చ మొదలైంది. తిరుమలలో ఏ వ్యాపారం అయినా భక్తుల సందడిపైనే ఆధారపడి నడుస్తుంది. అలాంటిది ఇప్పటికే స్థానికంగా వందల సంఖ్యలో టీ కేటిల్ నడుపుతున్న స్థానికులు ఉన్నారు. కొందరు అద్దెలు కూడా చెల్లించలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఈ సమయంలో తిరుమలో జిసిసి ఉత్పత్తుల ఔట్ లెట్ నిర్వహించుకునే అవకాశం దక్కిందనేది కూడా గుప్పుమంటోంది. టిటిడి మాత్రం ఇదీ ప్రభుత్వ నిర్ణయమని, ప్రభుత్వం ఆదేశాలతోనే మన రాష్ట్రంలో గిరిజనులు పండించే స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించామని చెబుతున్నారు. అదేగాక దేవదేవుడు తిరుమలేశుని అవసరాల కోసం గిరిజన సహకార సంస్థ (జిసిసి) నుండి వాటిని కొనుగోలు చేయాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు రూ.12.97కోట్లతో నాణ్యమైన సరకులు తీసుకునేందుకు అధికారికంగా ఆమోదముద్ర వేశారు. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు ఈ స్వచ్ఛమైన గిరిజన ఉత్పత్తులను అందుబాటులో ఉంచాలని ఆలోచనతో నిర్ణయం తీసుకోవడం జరిగింది. తిరుమలలో సిఆర్ఒ ప్రాంతంలో జిసిసి రిటైల్ ఔట్‌లెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఏడాది పాటు నామినేషన్ పద్ధతిలో జిసిసి నుండి సరకులను కొనుగోలు చేసి, మార్కెట్లో దొరికే ఇతర బ్రాండ్లతో పోలిస్తే జిసిసి అందించే ఇన్‌స్టంట్ కాఫీ పొడి ధర కాస్త ఎక్కువ. అయినా టిటిడి బోర్డు దీనికే మొగ్గుచూపింది. జిసిసి సరఫరా చేసే సరుకుల నమూనాలను కూడా తిరుమలలోని డబ్ల్యుఎఫ్ పరిశోధనశాలలో పరీక్షించారు. టిటిడి నిబంధనల మేరకు నాణ్యత ఉన్నట్లు క్వాలిటీ మేనేజర్ ధ్రువీకరించడంతో ఇతర బ్రాండ్ల కంటే జిసిసి ఇన్‌స్టెంట్ కాఫీ పొడి ధర కొంత అధికమైనా అందులో కల్తీ లేకపోవడం, జిఐ ట్యాగ్ గుర్తింపుతో అరాబికా కాఫీ కావడంతో టిటిడి బోర్డు పెద్దలు అంగీకారం తెలిపారు. టిటిడి పెద్దల తాజా నిర్ణయంతో తిరుమలకు వచ్చే భక్తులకు జిసిసి ఉత్పత్తులను అందుబాటులో ఉంచేందుకు విక్రయాలకు స్థలాన్ని కేటాయించింది. పిఎసి 2 వద్ద (రెండో న్యూ సత్రం దగ్గర గతంలో దొడ్ల డెయిరీ ఉన్న స్థలంలో) 144 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇనుపషీట్ రూఫింగ్‌తో ఈ ప్రత్యేక దుకాణం అందుబాటులోకి రానుంది. ఇక్కడ గిరిజనులు సేకరించిన స్వచ్ఛమైన తేనె, పసుపు, కుంకుమ, సుగంధ ద్రవ్యాలు తదితర ఉత్పత్తులను భక్తులకు విక్రయిస్తారు.

### తిరుమలలో జిసిసి రీటైల్ ఔట్‌లెట్‌కు టిటిడి సుముఖత




కేటాయింపు విషయంలో టిటిడి కొన్ని కఠిన నిబంధనలు విధించినట్లు తెలుస్తోంది. తేనె, కుంకుడు కాయల పొడి, ఎండుమిర్చి తదితర వస్తువులను నామినేషన్ పద్ధతిలో తీసుకోవాలని కమిటీ సూచించింది. కుంకుమ పొడి, కారం, పసుపు వంటి వాటిని తగ్గింపు ధరలపైన అందుబాటులోకి తేవాలని చర్చలు జరుగుతున్నాయి.



## అనధికార స్టిక్కర్లపై కొరఢా

**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** యాత్రాస్థలం, విద్యాకేంద్రం తిరుపతి నగరంలో పలు రకాలుగా వాహనాలపై స్టిక్కర్లు వేసుకుని పోలీస్ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనదారులపై తిరుపతి జిల్లా పోలీసులు కొరఢా ఝుళిపించారు. అంబులెన్స్‌లు కూడా రోగులు లేకున్నా రద్దీ ప్రాంతాల్లో, కూడళ్లలో సైరన్‌లు వేసుకుని వాహనాలతో దూసుకెళుతున్న వారిపై కూడా తనిఖీలు చేశారు. ట్రాఫిక్ డిఎస్పీ కొండయ్యనాయుడు ఆధ్వర్యంలో సిఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది తిరుపతిలోని అనేక ప్రధాన కూడళ్లలో వాహనాలకు ప్రెస్, పోలీస్, జ్యూడీషియల్, ప్రభుత్వ వాహనాలు, ఆన్‌డ్యూటీ గవర్నమెంట్, ఎస్‌పిడిసిఎల్, ఎడ్యుకేషన్, మెడికల్ వంటి తదితర విభాగాలు ఇలా రకరకాల పేరుతో స్టిక్కర్లు వేసుకుని ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి మందుసేవించి తిరుగుతున్నారు. దీనివల్ల నిజమైన ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నట్లు పోలీసులకు అందిన సమాచారం. ఈ సమాచారంతో సోమవారం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు తిరుపతి ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. వాహనాలపై ఉన్న అనధికారిక స్టిక్కర్స్ తీసివేశారు. కౌన్సెలింగ్ ఇచ్చారు.



శ్రీకాళహస్తి పురవీధుల్లో దర్శనం ఇస్తున్న ద్రౌపదీదేవి అమ్మవారు

### ద్రౌపదమ్మ వసంతోత్సవం

**శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో ధర్మరాజుల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వసంతోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ద్రౌపదమ్మ ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలో వైభవంగా ఊరేగింపు జరిపారు. వధువుగా పట్టణ ప్రజలు అమ్మవారిని దర్శించుకొని మొక్కలు తీర్చుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఉత్సవాల ఇన్‌చార్జిలు సుబ్రమణ్యం, దుర్గాప్రసాద్, ఆలయ చైర్మన్ ఎంఎస్‌రెడ్డి దఫేదార్ పాల్గొన్నారు.

## మృత్యుంజయునికి విశేషాభిషేకాలు

**శ్రీకాళహస్తి, జులై 28 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మృత్యుంజయస్వామికి సోమవారం ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. ఈ అభిషేకాల్లో ఆలయ ఇఓ బికె వెంకటేశులు, భక్తులు విశేషంగా హాజరయ్యారు. తరువాత స్వామి వారికి ప్రత్యేకాలంకారం జరిపారు. వర్షాభావ కారణంగా ఆగస్టు 1న మృత్యుంజ స్వామి ఆలయం వద్ద శత సహస్రఘట్టాభిషేకం నిర్వహించుటకు సన్నాహాలు చేపట్టినట్లు ఇఓ వెంకటేశులు తెలిపారు.



## కృత్రిమమేధ సాంకేతికత పరిశోధనపై డిసెంబర్ 4, 5తేదీల్లో అంతర్జాతీయ సదస్సు



**తిరుపతి, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలో డిసెంబర్‌లో 4, 5 తేదీల్లో రెండురోజులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రీసెర్చ్ సంబంధించిన పోస్టర్‌ను సోమవారం వర్సిటీ ఉప కులపతి ఆచార్య వెన్నం ఉమ ఆవిష్కరించారు. "కృత్రిమ మేధస్సులో డేటా, హార్డ్‌వేర్ ఫిన్‌టెక్ సమగ్రతతో నూతన సాంకేతిక సరిహద్దుల అభివృద్ధి" అనే అంశంతో ఈ అంతర్జాతీయ సదస్సు పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం డిఎస్టీ క్యూరీఏఐ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సదస్సు డిసెంబర్ 4, 5 తేదీలలో హైబ్రిడ్ విధానంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష, ఐసిఎఐఆర్ 2026 కన్వీనర్ ఆచార్య పి. వెంకట కృష్ణ పాల్గొన్నారు. ప్రత్యక్ష వర్చువల్ విధానాల్లో పరిశోధనా పత్రాల ప్రదర్శనకు అవకాశం కల్పించనున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, హార్డ్‌వేర్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అభివృద్ధి చెందుతున్న అంతరశాఖ పరిశోధనా రంగాల్లో తాజా పరిశోధనలు, సాంకేతిక పరిణామాలు, ఆవిష్కరణలపై చర్చించేందుకు పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు, పాలసీ మేకర్స్, పారిశ్రామికవేత్తలు విద్యార్థులను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ సదస్సు ప్రధాన ఉద్దేశ్యం. సదస్సులో ఏఐ డేటా సైన్స్, ఏఐ హార్డ్‌వేర్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్, ఫిన్‌టెక్ అండ్ ఎఐడ్రివెన్ ఫైనాన్షియల్ సిస్టమ్స్, ఎమర్జింగ్ ఇంటర్‌డిసిప్లినరీ ఏరియాస్ అనే నాలుగు ప్రధాన ట్రాక్‌లలో పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నారు.

ఉత్తమ పరిశోధనలకు బెస్ట్ పేపర్ అవార్డు, బెస్ట్ స్టూడెంట్ పేపర్ అవార్డు, బెస్ట్ ఉమెన్ రీసెర్చర్ ప్రజెంటేషన్ అవార్డు, బెస్ట్ ఇండస్ట్రీ ఇన్నోవేషన్ పేపర్ అవార్డులను అందించనున్నారు. పూర్తి పరిశోధనా పత్రాల సమర్పణకు ఆగస్టు 10 గడువుగా నిర్ణయించారు. ఎంపికైన పత్రాల వివరాలను సెప్టెంబర్ 10న తెలియజేస్తారు. కెమెరారెడీ పేపర్ సమర్పణకు సెప్టెంబర్ 30 చివరి తేదీగా నిర్ణయించారు. ఉపకులపతి ఆచార్య వి.ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉష దేశ, విదేశాలకు చెందిన అధ్యాపకులు, పరిశోధకులు, రీసెర్చ్ స్కాలర్లు, విద్యార్థులు, పరిశ్రమ నిపుణులు ఆవిష్కర్తలు తమ పరిశోధనా పత్రాలను సమర్పించి సదస్సులో చురుకుగా పాల్గొనాలని కోరారు.

28-7Pg7exHMNWJQE:28-7Pg7exHMNWJQE.qxd 7/27/2026 11:41 PM Page 1



## చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి కృషి

**• ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సుమన్**



సుమన్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న ఎఇఒ రవీంద్రబాబు

**కాణిపాకం, జులై 27 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఎపి ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్, ప్రముఖ హీరో సుమన్ అన్నారు. ఇటీవల ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన సుమన్ సోమవారం జిల్లా ఈడిగ సంఘం నాయకులతో కలసి ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సుమారు 11 భాషల్లో వెయ్యికి పైగా చిత్రాల్లో నటించి 45యేళ్ళ సుదీర్ఘ అనుభవం వున్న తనను ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం అనందంగా వుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని చలనచిత్ర నిర్మాతల సౌకర్యార్థం విజయవాడలో రీరికార్డింగ్, డబ్బింగ్ థియేటర్లును ఏర్పాటు చేయాల్సిన అవసరం వుందన్నారు. అలాగే సినిమా షూటింగ్‌ల కోసం తిరుపతి, తలకోన పరిసర ప్రాంతాల్లో లొకేషన్‌లను అభివృద్ధి చేయాల్సిన అవసరం వుందన్నారు. ముఖ్య ంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయను తమిళనాడులోని ఊటి తరహాలో ఉద్యానవనాలను అభివృద్ధి చేస్తే సినిమా షూటింగ్‌లకు ఎంతో అనువుంగా వుంటుందన్నారు. అలాగే ప్రబుత్వ లొకేషన్‌లను చిన ్న చిత్రాలు నిర్మించే నిర్మాతలకు ఉచితంగా ఇవ్వడంతో పాటు చలన చిత్రపరిశ్రమను ఆదుకునేందుకు పట్టణాల్లోని బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద చిన్నతరహా సినిమా థియేటర్‌లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా వుందని సుమన్ తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రంలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనుకబడిన ఈడిగ కులస్థులను ఎస్టీ జాబితాలో చేర్చి వారి అభివృద్ధికి అన్ని రకాలుగా ప్రభుత్వం తోడా ్పటు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు.

## శాకంబరిగా దుర్గమ్మ అనుగ్రహం

**• ఇంద్రకీలాద్రిలో శాకంబరి ఉత్సవాలు ప్రారంభం**



**ఇంద్రకీలాద్రి, జులై 27 ప్రభాతవార్త:** శాకంభరీ నమోస్తుతే అంటూ భక్తుల జయజయ నాదాల నడుమ కూరగాయలు, పండ్ల అలంకారంతో దుర్గమ్మ శాకంబరి మాతగా అనుగ్రహించారు. ఇంద్రకీలాద్రిపై వైభవంగా శాకంబరి ఉత్సవాలు సోమవారం ప్రారంభమైనాయి. జగన్మాత, అమ్మవారు ఈ సంవత్సరం పచ్చి వేరుసెనగ కాయల దండ, యాలకుల దండ, పుదీనా దండలు మెడలో ధరించి ప్రత్యేక ఆకర్షణగా భక్తులకు దర్శనమిచ్చారు. మూడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు ఈనెల 29తో ముగుస్తాయని ఇఒ తెలిపారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన పూజాదికాల్లో చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఒ వికె శీనా నాయక్ పాల్గొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల నుండి ఈ ఉత్సవానికి భక్తులు తరలివచ్చారు. ఆలయ అలంకరణ, కదంబం ప్రసాదం తయారీ నిమిత్తం సుమారు 45టన్నుల కూరగాయల వినియోగించారు. ప్రధాన ఆలయంలో శ్రీ కనకదుర్గ అమ్మ, మహా మండపంలో ఉత్సవర్లు, ఉపాలయాలల్లో దేవతా మూర్తులందరూ హరిత వర్ణంతో విరాజిల్లుతు భక్తులను అనుగ్రహించారు.

**భక్తులకు కదంబ ప్రసాదం పంపిణీ:** శాకంబరి ఉత్సవాల్లో భక్తులకు ఆయా కూరగాయలతో తయారు చేసిన కదంబం ప్రసాదాన్ని ఇఒ వికె శీనా నాయక్, ప్రధాన అర్చకులు లింగం బొట్ల దుర్గాప్రసాద్ పంపిణీ చేశారు.

**దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు:** దుర్గమ్మని సోమవారం హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సునీత, జస్టిస్ సుజాత దర్శించుకున్నారు. వారికి ఇఒ శీనా నాయక్ దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

**ఆషాఢం సారె తెచ్చిన భక్తులతో రద్దీ:** దుర్గమ్మకి ఆషాఢం సారె తెచ్చిన భక్తజనంతో ఆలయంలో ఆదివారం రద్దీ నెలకొంది. శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావిస్తూ పసుపు, కుంకుమలు, గాజులు, చీర, సారెలతో ఇంద్ర కీలాద్రికి 13వ రోజు సోమవారం సాయంత్రం గంటల వరకు 27 సారె బృందాలకు చెందిన 14,756 మంది మహిళలు అమ్మకి సారె సమర్పించారు. సాయంత్రం 4 గంటల సమయానికే సుమారు 78 వేల మంది భక్తులు అమ్మని దర్శించుకున్నారు. దుర్గమ్మవారి దర్శనానంతరం 6వ అంతస్తులోని శ్రీ అమ్మవార్లకు సారెను సమర్పించి పూజాదికాలు నిర్వహించారు. క్యూలైన్ దర్శనం మొత్తం సారె భక్తులకు కేటాయించారు.

## ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి: టిటిడి అదనపు ఇఒ



**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లోపు ఎస్వీ మ్యూజియం అభివృద్ధి పనులనువేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి ఆదేశించారు. ఎస్వీ మ్యూజియంలో ఏర్పాటు చేసిన గ్యాలరీలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. మ్యూజియంలోని గ్యాలరీలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతి కలిగేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం మ్యూజియం బయట పార్కింగ్, మైబైల్ కౌంటర్లు, పాద రక్షకాలు భద్రపరచే కేంద్రాల ఏర్పాటు గురించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఆరోగ్యవిభాగం డిప్యూటీ ఇఒ సోమన్నారాయణ, ఎస్ఇ వేణు గోపాల్, ఎలక్ట్రికల్ డిఇ చంద్రశేఖర్, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: కోవూరు ఎమ్మెల్యే

**కోవూరు (నెల్లూరు), జులై 27 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రాన్ని సరిదిద్దుకుంటూ అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలతో పాటు 90శాతం పైగా వాగ్దానాలను నెరవేర్చారన్నారు. కూటమి నాయకులు ధైర్యంగా ప్రతి ఇంటికి వెళ్లి మనం చేసిన అభివృద్ధిని వివరించాలన్నారు. ప్రజల్లో ఎవరికైనా సమస్యలు పరిష్కారం కాకపోతే నేరుగా తమ వద్దకు రావచ్చని పేర్కొన్నారు. అర్హులకు సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య, ఎంపిడిఒ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపిడిఒ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ జగదీష్, ట్రాన్స్‌కో డిఇ మధుసూదన్‌రెడ్డి, ఎఇ గిరీష్, పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, పాటూరు నీటి సంఘం అధ్యక్షుడు ఆదాల శివారెడ్డి, ట్రస్టు బోర్డు మాజీ సభ్యులు లక్ష్మీనరసారెడ్డి, బాల రవి, ఎంపిపి టి. పార్వతి, పురుషోత్తం, పెంచలయ్య, వెంకయ్య, వెంకోజీరావు, శివకృష్ణ, తదితరులు ఉన్నారు.

# నెల్లూరులో జాతరలా సైకిళ్ల పంపిణీ

## - 7 వేల మందికి మంత్రి నారాయణ ఉచిత సైకిళ్లు



**నెల్లూరు(వైద్యం), జులై 27 ప్రభాతవార్త:** వీఆర్సీ గ్రౌండ్ సోమవారం అక్షరాలా జాతరను తలపించింది. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ట్రంక్ రోడ్డు, వీఆర్సీ గ్రౌండ్ కిక్కిరిసిపోయాయి. 'థాంక్యూ నారాయణ సార్' అంటూ విద్యార్థుల నినాదాలతో ప్రాంగణం మార్మోగింది. నెల్లూరు నగర, రూరల్ నియోజకవర్గాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న 7 వేల మంది విద్యార్థులకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కుటుంబం సొంత నిధులతో ఉచిత సైకిళ్లు పంపిణీ చేసింది. మొత్తం 10 వేల మంది విద్యార్థులకు రూ.6 కోట్ల వ్యయంతో సైకిళ్లు అందించే కార్యక్రమంలో తొలి విడతగా ఈ పంపిణీ చేపట్టారు.

ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ తన జీవిత ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు. నేను పేదరికాన్ని పుస్తకాల్లో చదవలేదు.. జీవితంలో అనుభవించాను. గుడిసెలో పుట్టి, హరనాథపురం నుంచి వీఆర్సీ వరకు కాలినడకన వెళ్లి చదివాను. మా నాన్న ప్రైవేట్ బస్సు కండక్టర్‌గా పనిచేసి కుటుంబాన్ని పోషించారు. అప్పుడే బాగా చదివి పేదరికాన్ని జయించాలని నిర్ణయించుకున్నాను అని భావోద్వేగంగా చెప్పారు. ఎన్నికల సమయంలో 80 వేల ఇళ్లు తిరిగినప్పుడు పేద విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనను కలచివేశాయని, వారికి నాణ్యమైన విద్యను ఆస్తిగా అందిస్తానని అప్పుడే నిర్ణయించుకున్నానని తెలిపారు. తాను చదివిన విఆర్సీ విద్యాసంస్థను రూ.17 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దామని, ప్రస్తుతం అక్కడ 1,100 మంది నిరుపేద విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. నగరంలోని మరో 14 ప్రభుత్వ హైస్కూళ్లను ఆధునీకరిస్తున్నామని, వక్ఫ్ బోర్డు స్థలంలో రూ.20 కోట్ల సీఎస్ఆర్ నిధులతో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల మెటీరియల్‌ను ఉచితంగా అందించి, ఆగస్టు 1 నుంచి ఐఐటీ ఫౌండేషన్ శిక్షణ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందించిన మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టిన పీ4 కార్యక్రమానికి తన వంతు సహకారం అందిస్తానని ప్రకటించారు. ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ పేద పిల్లల భవిష్యత్తు కోసం మంత్రి కుటుంబం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమన్నారు. వేలాది మంది విద్యార్థుల కళ్లల్లో కనిపించిన ఆనందమే ఈ కార్యక్రమం విజయానికి నిదర్శనమన్నారు. మేయర్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ ఒకే రోజు 7 వేల సైకిళ్ల పంపిణీ చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. రూరల్ ఎంఎల్‌ఏ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ అడగ్గానే సైకిళ్ళు నెల్లూరు రూరల్‌కి ఇచ్చిన గొప్ప వ్యక్తి మంత్రి నారాయణ అని కొనియాడారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ ఈరోజు చాలా సంతోషమైన రోజన్నారు. నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ ఇది గిన్నిస్ బుక్‌లో నమోదయ్యే స్థాయి కార్యక్రమమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్, మంత్రి నారాయణ సతీమణి పొంగూరు రమాదేవి, అల్లుళ్ళు పునీత్, గంటా రవితేజ, నారాయణ విద్యాసంస్థల జిఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభి రామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, సంతపేట ఆంజనేయస్వామి ఆలయ చైర్ పర్సన్ విజేతా రెడ్డి, నగర పార్టీ అధ్యక్షులు మామిడాల మధు, టిడిపి నేతలు జహీర్, బాలాజీ, తిరుమల నాయుడు, కిన్నెర మాల్యాద్రి, మొయినుద్దీన్, కర్తం ప్రతాప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం!

**• ఆత్మకూరులో దళితవాడ నుంచి 'ఇంటింటికి టిడిప్పి' కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి ఆనం**



**ఆత్మకూరు (నెల్లూరు), జులై 27 ప్రభాతవార్త:** ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వ రెండేళ్ళ విజయాలను ప్రతి ఇంటా తెలిసేలా ఇంటింటి ప్రచార కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం ఆత్మకూరు పట్టణంలోని ముస్తాపురం దళితవాడలో ఇంటింటికి వెళ్ళి ప్రజలను కలిశారు. కూటమి ప్రభుత్వ రెండేళ్ళ పాలనలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. మంత్రి ఆనంకు స్థానిక ప్రజలు, కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. మంత్రి ఆనంతోపాటు ఆనం కుమార్తె లీలా కైవల్యారెడ్డి, సీనియర్ నేత తాళ్ళూరు గిరినాయుడు, ఎన్‌డిఎ కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు ప్రతి ఇంటిని సందర్శించి ప్రభుత్వ హామీల అమలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈసందర్భంగా ప్రజలు ప్రభుత్వ పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ముస్తాపురంలో 34లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్లు, సిమెంట్ డ్రైన్‌లను మంత్రి ప్రారంభజంచారు. ఈసందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అమలు చేసిన ప్రతి హామీని ప్రజలకు ఇంటింటికి వెళ్ళి వివరిస్తామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గత రెండేళ్ళుగా రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తూ అభివృద్ధి సంక్షేమాన్ని సమాంతరంగా ముందుకు తీసుకెళుతున్నామన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ, రూరల్ మండల ఆలయాల అభివృద్ధికి రూ.22.40 కోట్ల నిధులు మంజూరు చేశామని, ప్రధాన దేవాలయాలకు రూ.8 కోట్లు సిజిఎఫ్ నిధులు, 18 గ్రామీణ దేవాలయాలకు రూ.90 లక్షలు, 13 శ్రీవాణి భజన మందిరాలకు రూ.4.60కోట్లు కేటాయించినట్లు వివరించారు. రైతుల కోసం అన్నదాత సుఖీభవ పథకం తొలివిడత నిధులను కూటమి ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. 'తల్లికివందనం' పథకం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేల ఆర్థికసాయం అందిస్తున్నా మన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీలో ఇప్పటికే రూ.75కోట్లతో రోడ్లు, డ్రైన్‌లు, మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి సోమశిల పైప్‌లైన్ లీకేజీల మరమ్మత్తులకు కోటికిపైగా ఖర్చుచేశామని, శాశ్వత పరిష్కారానికి రూ.26 కోట్లతో 40కొత్త తాగునీటి పథకాలు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు. ముస్తాపురం దళిత కాలనీలో నూతన కోదండరామస్వామి దేవాలయాన్ని పవిత్రతకు ప్రతీకగా అన్ని వసతులతో నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# శవాలను బైక్‌కు కట్టి సముద్రంలో పడేసి

**• జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు • సముద్రపు వేటలో వివాదాలే ప్రధాన కారణం**




**విజయవాడ,మచిలీపట్నం, జులై 27 ప్రభాతవార్త:** సముద్రపు వేటలో జరిగిన చిన్నపాటి ఘర్షణ నాలుగు కుటుంబాలను వీధిన పడేసింది. ఇరువురి మధ్య జరిగిన ఈ చిన్నపాటి గొడవ జంట హత్యలకు దారి తీయగా నెల రోజుల అనంతరం పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో దర్యాప్తు చేసి సంఘటన మిస్టరీని ఛేదించారు. నిందితులైన జల్లా నాగరాజు, శంకరపు శ్రీనివాస్, గుడివాడకు చెందిన కటికల కళ్యాణ్, దొక్కుమళ్ళ శ్రీకాంత్, షేక్ జిలాని, అబ్బూరి విజయరత్నంలను అరెస్టు చేసి రిమాండుకు పంపించారు. మచిలీపట్నం డిఎస్పీ జి. శ్రీనివాసరావుసోమవారం మచిలీపట్నంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వివరించారు. కృష్ణ జిల్లా, కృత్తివెన్ను మండలం, చినగొల్లపాలెం గ్రామంలోని యానాది కుటుంబాలు సముద్రపు వేటనే జీవనంగా సాగిస్తూ ఉంటారు. అదే గ్రామానికి చెందిన శెట్టి సుబ్బన్న (49), ఇతని అల్లుడు గొలుసు అయ్యప్ప (23) సమీపంలోని ఉప్పుటేరు కొత్త కాలువ ద్వారా సముద్రంలోకి వెళ్ళి చేపలు పట్టి విక్రయిస్తూ ఉంటారు. కాగా, గత నెల 27వ తేదీ రాత్రి చేపలవేటకు వెళ్ళిన మామా అల్లుళ్ళు ఇద్దరూ ఇంటికి తిరిగి రాకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు వారిద్దరూ ఉప్పుటేరు కొత్త కాలువలో శవాలుగా పడి ఉండటాన్ని గుర్తించారు. వారిద్దరినీ చంపి వారి బైక్‌కే కట్టి కాలువలో పడవేసిన స్థితిలో ఉండటం సంచలనం సృష్టించింది.

కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పెడన సీఐ, కంకిపాడు సిఐ, మచిలీపట్నం సీఐ ఆధ్వర్యంలో మూడు బృందాలను ఏర్పాటు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. హత్యకు గురైన శెట్టి సుబ్బయ్యకు, అదే గ్రామానికి చెందిన శంకరపు శ్రీనుతో చేపల వేటకు సంబంధించి రెండు నెల రోజుల క్రితం చిన్నపాటి గొడవలు జరిగాయి. అవి మనసులో పెట్టుకున్న శంకరపు శీను, అతడి స్నేహితుడు జల్లా నాగరాజు, వీరిద్దరికీ పాత పరిచయం ఉన్న గుడివాడకు చెందిన కటికల కళ్యాణ్, దొక్కుమళ్ళ శ్రీకాంత్, షేక్ జిలాని, అబ్బూరి విజయరత్నంలతో హత్యకు పథకాన్ని రచించి సముద్రపు వేటకు వెళ్లి వస్తున్న మామా అల్లుళ్ళు సుబ్బయ్య, అయ్యప్పలను దారుణంగా చంపారు. ఇద్దరి శవాలను వారి బైకుకు తాడుతో కట్టి సముద్రంలో పడేశారు.

**సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుల గుర్తింపు:** జంట హత్యల కేసును ఛేదించడంలో పోలీస్ యంత్రాంగం అన్ని రకాలుగా జల్లెడ పట్టినా ఎలాంటి క్లూ దొరకకపోవడంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సెల్ ఫోన్ల ఆధారంగా కేసును ఛేదించారు. ఈ కేసును పరిష్కరించడంలో సహకరించిన పెడన సీఐ నాగేంద్ర ప్రసాద్, కృత్తివెన్ను ఎస్ఐ పైడి బాబు, దర్యాప్తులో పాల్గొన్న కంకిపాడు సిఐ బీబీ రవికుమార్, సీఐ ఏసుబాబు, గూడూరు ఎస్ఐ ప్రకాష్, సాంకేతిక సిబ్బందిని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ప్రత్యేకంగా అభినందించారు.

## అంతర్రాష్ట్ర జేబుదొంగలు ముఠా అరెస్ట్

**తిరుమల, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమలలో పలురకాలుగా నేరాలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర జేబుదొంగలను తిరుమల టూటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. రాంభగీచ కార్ పార్కింగ్ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం అంతర్రాష్ట్ర నేర ముఠాకు చెందిన ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

కర్ణాటకకు చెందిన బాలాజీ అకాడే(33), మహారాష్ట్రవాసి అప్పాషా మానే (65), నెల్లూరు జిల్లాకు చెందిన కల్తీ రెడ్డి కీర్తి(31) కలసి తిరుమలకు విచ్చేసే భక్తుల రద్దీని ఆసరాగా చేసుకొని బాలాజీ బస్టాండ్, ఉచిత బస్సులు, ఇతర రద్దీ ప్రాంతాల్లో జేబుదొంగతనాలు, పర్సుల చోరీలు, బ్యాగులు కత్తిరించి నగదు, విలువైన వస్తువులు అపహరిస్తున్నట్లు అంగీకరించారు.

దర్యాప్తులో మహిళా నిందితురాలు నకిలీ టిటిడి గుర్తింపు కార్డు తయారు చేసుకుని తాను టిటిడి ఉద్యోగినినని నమ్మిస్తూ విఐపి దర్శనం, ప్రత్యేక దర్శన టికెట్లు, వసతి గదులు ఏర్పాటు చేస్తానని యాత్రికులను మభ్యపెట్టి, ఫోన్‌పే ద్వారా డబ్బులు వసూలు చేస్తూ మోసాలకు పాల్పడుతున్నట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుండి ఒక దొంగిలించిన పర్సు. రూ.5,100 నగదు, మోటార్ సైకిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, నకిలీ టిటిడి గుర్తింపు కార్డు, మూడు సెల్ ఫోన్లు, కట్టర్, చిన్న కత్తి, బ్లేడ్‌లు, గిల్ట్ నగలు స్వాధీనం చేసుకున్నారు.

## కెనరా బ్యాంక్ ముందు దంపతుల ఆత్మహత్యాయత్నం



**కుందుర్పి, జులై 27 ప్రభాతవార్త:** అనంపురం జిల్లా కుందుర్పి మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మండల పరిధిలోని మందలపల్లి గ్రామానికి చెందిన చంద్రకళ నాగేంద్ర దంపతులిద్దరూ ఒంటిపై డీజిల్ పోసుకొని బ్యాంకు ముందర డీజిల్ పోసుకొని హత్య ప్రయత్నం చేశారు. సకాలంలో రైతులు నిలువరించడం తో ప్రమాదం తప్పింది. చంద్రకళ మాట్లాడుతూ తమ మామ పంట రుణాల అప్పు తీర్చాలంటూ మా అకౌంటు హోల్డ్‌లో ఉంచారన్నారు. ఐదు రోజుల క్రితం తమ పిల్లలవి తల్లికి వందనం డబ్బులు డ్రా చేయడానికి వస్తే బ్యాంక్ అధికారులు నాన్న ఇబ్బందులకు గురి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. బ్యాంక్ మేనేజర్‌ని ఎన్నోసార్లు ప్రాధేయపడిన బయటికి వెళ్లాలంటూ దౌర్జన్యం చేస్తున్నారని చంద్రకళ పేర్కొన్నారు.

## ఎపికి సెంట్రల్ రోడ్ ఫండ్ స్కీమ్ కోసం రూ.200 కోట్లు నిధుల విడుదల

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపికి సెంట్రల్ రోడ్ ఫండ్ స్కీమ్ కోసం రూ.200 కోట్లు నిధుల విడుదలయ్యాయి. రాష్ట్రంలో వివిధ రోడ్ల నిర్మాణం, నిర్వహణ తదితరంశాలకు సంబంధించి బిల్లు పెండింగ్‌లో ఉన్నాయి. జాతీయ రహదారుల అనుసంధాన అంశాల్లో బిల్లుల చెల్లింపులో జాప్యం నిర్మాణ పనుల ఆలస్యం కావడానికి కారణంగా భావిస్తున్న క్రమంలో పెండింగ్ బిల్లుల చెల్లింపు, న్యాయపరమైన చిక్కుల నివారణకు నిధులు విడుదల చేసినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.

## గీతం ఫార్మశీ కళాశాలకు 'ఎ' గ్రేడ్

**విశాఖపట్నం, జులై 27 ప్రభాతవార్త:** గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం విశాఖపట్నం, హైదరాబాద్ ప్రాంగణాల్లోని 'స్కూల్ ఆఫ్ ఫార్మశీ' కళాశాలలు 2025-26 విద్యా సంవత్సరానికి గాను నేషనల్ ర్యాంకింగ్ మరియు రేటింగ్‌లో అత్యున్నతమైన 'ఎ' గ్రేడ్‌ను సాధించాయి. ఫార్మశీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పిసిఐ), క్వాలిటి కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూసిఐ) ఎనఎబిఇటి సంయుక్తంగా నిర్వహించిన మొదటి విడత జాతీయ రేటింగ్ ప్రక్రియలో దేశవ్యాప్తంగా బి.ఫార్మశీ కోర్సును అందిస్తున్న 398సంస్థలను పరిశీలించారు. విద్యా ప్రమాణాలు, పరిశోధనలు, మౌలిక సదుపాయాలు, పాలన మరియు విద్యార్థుల నైపుణ్యాల ఆధారంగా ఈ సమగ్ర-మల్యాంకనం నిర్వహించబడింది. ఈ పోటీలో కేవలం 64 సంస్థలు(16.1) శాతం మాత్రమే అత్యుత్తమ 'ఎ 'గ్రేడ్‌ను దక్కించుకున్నాయి. ఇందులో గీతం విశాఖపట్నం ప్రాంగణం జాతీయ స్థాయిలో 43వ ర్యాంకు సాధించి దేశంలోని టాప్ 10.8శాతంలో నిలవగా, హైదరాబాద్ ప్రాంగణం 54వ ర్యాంకుతో టాప్ 13.6 శాతంలో నిలిచిందని గీతం ఐక్యూఎసి సీనియర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రాజా ప్రభు తెలిపారు. ఈ మైలురాయి గీతం విశ్వవిద్యాలయం బి.ఫార్మశీ, ఎమ్‌ఫార్మశీ విద్యతో పాటు పరిశోధనలకు ఇస్తున్న ప్రాధాన్యతను నిరూపిస్తుండటంతో పాటు నాయకత్వ దూరదృష్టి, అధ్యాపకులు, విద్యార్థులు మరియు సిబ్బంది కృషికి దక్కిన గుర్తింపుగా ఆయన పేర్కొన్నారు.

## సాహిత్య విమర్శపై అరసం నేతృత్వంలో శిక్షణ

**అనంతపురం, జులై 27 ప్రభాతవార్త బ్యూరో:** ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సాహిత్య విమర్శ మీద ఆగస్టు 8, 9 తేదీలలో అనంతపురంలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్‌డిటి ఎకాలజీ సెంటర్‌లో రెండురోజుల పాఠశాల జరుగుతుందని అరసం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఈశ్వర్ రెడ్డి, తన్నీరు నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్ధమాన విమర్శకులకు సాహిత్య విమర్శకు సంబంధించిన మెలకువలు నేర్పడం ఈ పాఠశాల ఉద్దేశం. ఈ పాఠశాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి నలభై మంది విద్యార్థులు హాజరవుతారు. ఎన్. వేణుగోపాల్, కె.నాగేశ్వరాచారి, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యాపకులుగా వ్యవహరిస్తారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, కార్యదర్శులు శరత్ చంద్రజ్యోతిశ్రీ, ఏఎంఆర్ ఆనంద్ అతిథులుగా హాజరవుతారు అని తెలిపారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతం

**• 85.28 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి**

**• నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**



**నెల్లూరు(కలెక్టరేట్), జులై 27 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఎస్ఐఆర్ కార్యక్రమం పురోగతి, గణాంకాలు, తదుపరి చర్యలపై కలెక్టర్ వివరాలు వెల్లడించారు. జూన్ 15 నుంచి జూలై 24 వరకు ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, డిజిటైజేషన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించామని తెలిపారు. జిల్లాలోని మొత్తం 19,74,240 మంది ఓటర్లలో 16,83,557 మంది నుంచి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరించి 85.28శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు చెప్పారు. మ్యాపింగ్ పూర్తైన వారిలో 83.5 శాతం మందిని 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల వివరాల ఆధారంగా అనుసంధానం చేయడం జరిగిందని, రాష్ట్రంలోనే ఒక విశేషమైన పురోగతిగా పేర్కొన్నారు. మ్యాపింగ్ కాని 1.8 శాతం మంది ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన 12 రకాల అధికారిక గుర్తింపు పత్రాల్లో ఏదైనా ఒకటి సంబంధిత ఈఆర్ఓకు సమర్పిస్తే వారి ఓటు హక్కు కొనసాగుతుందని స్పష్టం చేశారు. గత 45 రోజులుగా సెలవులు కూడా తీసుకోకుండా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసిన సచివాలయ సిబ్బంది, బిఎల్ఒలు, తహసీల్దార్లు, ఆర్‌డిఒలు, ఎన్నికల ప్రక్రియలో పాల్గొన్న అన్ని శాఖల అధికారులకు నా ప్రత్యేక అభినందనలు అని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. సర్ ప్రక్రియలో కీలకంగా పనిచేసి విజయవంతం చేసిన జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, డిఆర్ఓ విజయ్ కుమార్‌ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు.

## సాగునీటి సమస్య పరిష్కరించండి

**• సిఎం చంద్రబాబుకు వల్లభనేని వంశీ లేఖ**

**విజయవాడ, జులై 27 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గన్నవరం వైసిపి ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ సిఎం చంద్రబాబుకు లేఖ రాశారు. సాగు నీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సమస్యను తక్షణం పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గతంలోనూ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి రైతుల సమస్యలను విన్నవించుకున్నామని తెలిపారు. అప్పుడు కూడా సమస్యను పరిష్కరించారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా అదే విధంగా సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. తనను కలిసేందుకు ముఖ్యమంత్రికి ఇబ్బంది అయితే రైతులు మాత్రమే వచ్చి సమస్యను వివరిస్తారని చెప్పారు. సిఎం అనుమతి ఇస్తే తాను కూడా కలుస్తానని వల్లభనేని పేర్కొన్నారు.

## 'ఈచర్' ఢీకొని ముగ్గురు మృతి

**• చిత్తూరు జిల్లా శాంతిపురం వద్ద ఘటన**

**శాంతిపురం, జులై 27 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో శాంతిపురం మండలం కడపల్లి సమీపంలో సోమవారం ఓ ఈచర్ వాహనం ఢీకొన్న సంఘటనలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. వీరిలో ఐదేళ్ల చిన్నారి సైతం ఉండడం కలచివేసింది. మరో ఐదుమంది తీ వ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటనకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. వి.కోట వైపు నుంచి ఈచర్ వాహనం కుప్పం వైపు వెళ్తుండగా కుప్పం వైపు నుంచి టువీలర్‌లో శివపురం గ్రామంకు చెందిన సుందరప్ప (60), మునివెంకటమ్మ (50)లు తమ స్వగ్రామంకు వస్తున్నారు. కడపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఈచర్ వాహనం వీరి టువీలర్‌ను ఢీకొనడంతో వారు మృతి చెందారు.

అదే ఈచర్ వాహనం సమీపంలో ఉన్న నీళ్ల ట్యాంకరును సైతం ఢీకొంది. దీంతో అక్కడే ఉన్న సాత్విక్ (5), నందిని (14), కాంగావళి (20), అక్షయ (22) తీవ్రంగా గాయపడ్డారు. సాత్విక్‌ను చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించగా మృతి చెందాడు. మృతదేహాలకు కుప్పం ఏరియా ఆస్పత్రిలో పంచనామా నిర్వహించిన అనంతరం కుటుంబీకులకు అప్పగించారు.

కాగా మృతుల కుటుంబీకుల ఆర్తదానాలు అందర్నీ కలచివేశాయి. డిఎస్పీ పార్థసారథి, రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ సంఘటనా స్థలిని పరిశీలించారు. రాళ్లబూదుగూరు ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఈచర్ వాహనం డ్రైవర్ వేగంతో రావడంతోనే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు పేర్కొన్నారు.

28-07pg10:28-07pg10.qxd 7/27/2026 10:55 PM Page 1



# టీమిండియా వరుస ఓటములపై.. గంభీర్, శ్రేయస్ అయ్యర్‌లకు చెక్!



**న్యూఢిల్లీ:** టీమిండియా వరుస ఓటములపై సమీక్ష నిర్వహించేందుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బిసిసిఐ) సిద్ధమైంది. ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనల్లో భారత్ 6 టి20లు, రెండు వన్డేల్లో ఓటమిపాలైంది. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలోఉంచుకొని విదేశాల్లో భారత జట్టు ప్రదర్శన మెరుగయ్యేందుకు చేపట్టాల్సిన మార్పులు, ఆటగాళ్ల ఎంపిక, వ్యూహాలపై వివరంగా చర్చించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ వరుస ఓటముల వెనుక గల కారణాలను బిసిసిఐ ఆరా తీయనుంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌తో పాటు, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌లతో అత్యవసర సమావేశం నిర్వహించి వరుస పరాజయాలకు వివరణ కోరాలనే యోచనలో ఉన్నట్లు సమాచారం. భారత జట్టు పేలవ ప్రదర్శనపై భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు అధికారులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో ప్రస్తుతం జరుగుతున్న టి20 సిరీస్ ముగిసిన వెంటనే ముంబైలోని ప్రధాన కార్యాలయంలో ఈ ఉన్నత స్థాయి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి టీమిండియా టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్‌తో పాటు, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, తాత్కలిక కోచ్ వీవీఎస్ లక్ష్మణ్, సెలెక్టర్లు, బిసిసిఐ అధికారులు హాజరు కానున్నారు. ఈ సమావేశంలో తక్షణ నిర్ణయాలేవి తీసుకోనప్పటికీ గంభీర్, శ్రేయ్యర్ ఇద్దరికీ ఒక గట్టి వార్నింగ్ ఇచ్చే అవకాశం ఉంది. గంభీర్‌కు 2027 వరకు ఒప్పందం ఉన్నం దున అతని పదవికి వచ్చే ముప్పు ఏం లేనప్పటికీ, వన్డే, టి20 క్రికెట్‌లో జట్టు ఘోర ప్రదర్శన ఒత్తిడిని పెంచుతోంది. టెస్ట్‌ల్లో భారత ప్రదర్శన మరీ నాసిరకంగా తయారైంది.

పరిస్థితులు ఇలానే కొనసాగితే 2027 వన్డే ప్రపంచకప్‌లో కూడా భారత్ పేలవ ప్రదర్శన కన బర్చే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. దాంతోనే గంభీర్‌తో అత్యవసర సమావేశానికి బిసిసిఐ సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొత్త టి20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ వైఖరిపై కూడా ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంది. కాకపోతే అతనికి మరికొన్ని సిరీస్‌ల వరకు అవకాశం ఇవ్వవచ్చు. 2026 ఆసియా గేమ్స్‌లో భారత్ గోల్డ్ మెడల్ సాధిస్తే అతనిపై ఉన్న ఒత్తిడి తగ్గనుంది. ఇదే సమయంలో హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కింద పని చేసే సపోర్ట్ స్టాఫ్ భవితవ్యంపై ఈ సమావేశంలో





## వరల్డ్ కప్ మహిళల పిస్టల్..

# ఈషాకు స్వర్ణం

## మనుకు కాంస్యం

**న్యూఢిల్లీ:** ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్ రైఫిల్/పిస్టల్/షాట్‌గన్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో భారత్ డబుల్ పోడియం ఫినిష్‌ను సాధించింది. చైనాలోని హాంగ్‌జౌలో సోమవారం జరిగిన ఈ పోటీల్లో హైదరాబాద్ షూటర్ ఈషా సింగ్ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకోగా, ఒలింపిక్ పతక విజేత మను భాకర్ కాంస్య పతకాన్ని దక్కించుకుంది. ఎనిమిది మంది షూటర్ల ఫైనల్‌లో ఈషా నిలకడైన ప్రదర్శన కనబరిచి, 40 హిట్‌లతో పోడియంపై అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. హోరాహోరీగా సాగిన ఫైనల్‌లో మను పోరాడి, కీలకమైన షూట్‌ఆఫ్‌లో నెగ్గి, 28 హిట్‌లతో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఇద్దరు భారతీయ షూటర్లు ఆకట్టుకున్నారు, మను 586-20న స్కోరుతో అగ్రస్థానంలో నిలవగా, ఈషా 585-18న స్కోరుతో రెండో స్థానంలో నిలిచి ఫైనల్‌లో తమ స్థానాలను సునాయాసంగా ఖరారు చేసుకున్నారు. ఇక మాజీ ఆసియా క్రీడల ఛాంపియన్ రాహి సర్నోబత్ 582-16న స్కోరుతో పతకాల రౌండ్‌కు అర్హత సాధించడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. సిమ్రన్‌ప్రీత్ కౌర్ బ్రార్ (576-20న) మరియు అభిజ్ఞా అశోక్ పాటిల్ (573-16న) ర్యాంకింగ్ పాయింట్స్ ఓన్లీ (ఆర్‌పీఓ) విభాగం కింద పోటీపడ్డారు. కాగా 21 ఏళ్ల హైదరాబాదీ షూటర్ ఈషా ఈ సీజన్‌లో అద్భుతమైన ఫామ్‌లో ఉంది. ఈ యేడాది ఆరంభంలో మ్యూనిచ్‌లో జరిగిన ఫైనల్‌లో 43 హిట్స్‌తో సీనియర్, జూనియర్ ప్రపంచ రికార్డులు రెండింటినీ నెలకొల్పి ఆమె చరిత్ర సృష్టించింది. పారిస్ 2024 ఒలింపియన్, అర్జున అవార్డు గ్రహీత అయిన ఈషా, ప్రపంచంలోని అగ్రశ్రేణి పిస్టల్ షూటర్లలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

## కామన్వెల్త్ గేమ్స్ మహిళల వెయిట్ లిఫ్టింగ్

# జ్ఞానేశ్వరికి రజతం




**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్ 2026 మహిళల 53 కేజీల వెయిట్ లిఫ్టింగ్ ఈవెంట్‌లో భారత క్రీడాకారిణి జ్ఞానేశ్వరి యాదవ్ రికార్డు బ్రేకింగ్ ప్రదర్శనతో రజత పతకాన్ని కైవసం చేసుకుంది. గ్లాస్గోలో సోమవారం జరిగిన స్నాచ్ విభాగంలో జ్ఞానేశ్వరి తన మూడు ప్రయత్నాలలో 82 కేజీలు, 85 కేజీలు, 88 కేజీలను విజయవంతంగా ఎత్తి, ప్రారంభ విభాగం తర్వాత రెండవ స్థానంలో నిలిచింది. నైజీరియాకు చెందిన ఒనోమే ఒమోలోలా డిడిహ్ 93 కేజీలతో అగ్రస్థానంలో నిలవగా, కెనడాకు చెందిన రెబెకా గ్రౌల్క్స్ 83 కేజీలతో మూడవ స్థానంలో నిలిచింది. జ్ఞానేశ్వరి అదే ఊపును క్లీన్ అండ్ జర్క్‌లో కూడా కొనసాగించి, తొలి ప్రయత్నంలో 103 కేజీలను సునాయాసంగా ఎత్తి, రెండవ ప్రయత్నంలో దానిని 107 కేజీలకు మెరుగుపరుచుకుంది. రజత పతకం కోసం జరిగిన పోరులో, జ్ఞానేశ్వరి అత్యంత కీలకమైన సమయంలో తన చివరి ప్రయత్నంలో 111 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి సత్తా చాటింది. ఈ ప్రదర్శన ఆమెకు పోడియంపై స్థానాన్ని సంపాదించి పెట్టడమే కాకుండా, ఒక కొత్త వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శనను, క్లీన్ అండ్ జర్క్‌లో (111 కిలోలు) ఒక కొత్త భారత జాతీయ రికార్డును, మరియు మొత్తం 199 కిలోల (88 కిలోలు + 111 కిలోలు) బరువుతో ఒక కొత్త జాతీయ రికార్డును నెలకొల్పింది.




## హెచ్‌సిఎ డివిజన్ లీగ్ క్రికెట్‌లో

# రాణించిన శ్రేయ్‌సింగ్

**హైదరాబాద్,జులై 27:** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ) ఆధ్వర్యంలో జరుగుతున్న ఏ డివిజన్, బీ డివిజన్ రెండు రోజుల లీగ్ ఛాంపియన్‌షిప్‌లో తొలి రోజు మ్యాచ్‌లు ఆసక్తికరంగా సాగాయి. బ్యాటర్లు భారీ స్కోర్లు నమోదు చేయగా, పలువురు బౌలర్లు ఐదు, ఆరు వికెట్లతో మెరిశారు. వర్షం కారణంగా కొన్ని మ్యాచ్‌లు ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయ్యాయి. చార్మినార్ 308 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులోని బ్యాటర్ శ్రేయ్‌సింగ్ 97 పరుగులతో శతకాన్ని మిస్‌అయినా 8 బౌండరీలు, మూడు సిక్స్‌లు సాధించి శెహభాష్ అనిపించుకున్నాడు. భావేష్ సేథ్ 88 పరుగులు చేశాడు. రిషబ్ బస్లాస్ 6 వికెట్లు పడగొట్టాడు. ప్రత్యర్థి ఈఎంసీసీ తొలి రోజు ఆట ముగిసే సమయానికి 107/1తో నిలిచింది. ఎ డివిజన్: దయానంద్, స్పోర్టింగ్ ఎలెవన్ విజయాలు రౌండ్ 1 తొలి రోజు మ్యాచ్‌లో ఆర్. దయానంద్ జెమినీ ఫ్రెండ్స్‌పై 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జెమినీ ఫ్రెండ్స్ 124 పరుగులకు ఆలౌటవగా చిరాగ్ యాదవ్ (52), అవేజ్ అహ్మద్ (40) రాణించారు. ఎం. ధీరజ్ రావు 6/29తో చెలరేగాడు. అనంతరం దయానంద్ 125/4తో లక్ష్యాన్ని చేరుకుంది. రవి తేజ అజేయ అర్ధశతకం (50..) సాధించాడు. స్పోర్టింగ్ ఎక్స్ఐ కూడా ఎస్‌బిఐపై ఐదు వికెట్లతో గెలిచింది. ఎస్‌బిఐ 133 పరుగులకు ఆలౌట్ అవగా తనయ్ త్యాగరాజన్ 5/14తో అద్భుత బౌలింగ్ చేశాడు. అనంతరం యశ్ సత్వాలేకర్ (52) అర్ధశతకంతో స్పోర్టింగ్ ఎక్స్ఐ 19.4 ఓవర్లలోనే విజయాన్ని అందుకుంది. బడ్డింగ్ స్టార్ 43 ఓవర్లలో 142/2తో బలమైన స్థితిలో నిలిచింది. జైరామ్ కశ్యప్ (70), విభాన్ ఆదిత్య వర్మ (32 నాటౌట్) రాణించారు. కేంబ్రిడ్జ్ ఎక్స్ఐ 256 పరుగులు చేయగా, ఆశ్లేష్ వామన్ 73, అర్వాన్ సత్వాలేకర్ 59 రాణించారు. ఇంపీరియల్ తొలి రోజు 18 పరుగులు వికెట్ నష్టపోకుండా చేసింది. డెక్కన్ వాండరర్స్ 37 ఓవర్లలో 246/3తో భారీ స్కోరు సాధించింది. నితీష్ రెడ్డి 112 బంతుల్లో 107 పరుగులతో శతకం నమోదు చేయగా, సాయి శరణ్ 68, హర్షిత్ చౌదరి 44 పరుగులు చేశారు. ఉమ్మడి రెండు జిల్లాల జట్లు కూడా తొలి ఇన్నింగ్స్‌లో వరుసగా 117, 230 పరుగులుచేశాయి. ఏఓసీఎవర్‌గ్రీన్, ఎస్‌సీఆర్ఎస్ఏడెక్కన్ క్రానికల్‌మ్యాచ్‌లు తడి మైదానం కారణంగా ఒక్క బంతికూడా పడకుండానే రద్దయ్యాయి.

## కామన్వెల్త్ బాక్సింగ్‌లో..

# క్వార్టర్ ఫైనల్స్‌కు సచిన్

**న్యూఢిల్లీ:** కామన్వెల్త్ గేమ్స్‌లో పురుషుల 65 కేజీల బాక్సింగ్ ఈవెంట్‌లో భారత్ బాక్సర్ సచిన్ సివాచ్ క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకున్నాడు. బాక్సింగ్‌ఈవెంట్‌లో 26 యేళ్ల క్రీడాకారుడు, సోమవారం ఇక్కడ స్కాటిష్ ఈవెంట్ క్యాంపస్‌లో జరిగిన పోరులో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, ఇంగ్లాండ్‌కు చెందిన విలియం హెవిట్‌ను 4-1 పాయింట్ల తేడాతో ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లాడు. హెవిట్ వేసిన రెండు వేగవంతమైన పిడిగుద్దులు ఒకటి కుడి నుంచి, మరొకటి ఎడమ నుంచి పోటీ గమనాన్ని నిర్దేశించాయి. తర్వాత సచిన్ రింగ్‌లో తెలివిగా కదులుతూ ఆంగ్లేయుడిపై దాడికి దిగి తన పంచ్‌లను విజయవంతంగా సంధించాడు. అదే సమయంలో హెవిట్ స్పష్టంగా పంచ్‌లు కొట్టడం కష్టతరం చేశాడు. చివరిలో, సచిన్ పూర్తి నియంత్రణలోఉండి, పక్కలనుండి వరుసగా పదునైన పంచ్‌లు విసురుతూ, పాయింట్ల విషయంలో న్యాయనిర్ణేతలు తనకు అనుకూలంగా తీర్పు ఇచ్చేలా ఒత్తిడి తెచ్చాడు. రెండో రౌండ్‌లో హెవిట్ దూకుడుగా బరిలోకి దిగి, భారత ఆటగాడిని కలవరపెట్టే ప్రయత్నంలో అతనిపైకి దూసుకెళ్లాడు. కానీ సచిన్ సంయమనం కోల్పోకుండా ఆ ఒత్తిడిని తట్టుకుని, తన స్థానాన్ని తిరిగి పొంది, సరైన స్కోరింగ్ ప్రదేశాలను అత్యంత సునాయాసంగా లక్ష్యంగా చేసుకుని విజయం సాధించాడు.

# పాలిమర్ కరెన్సీ నోట్లకు తొలి అడుగు

## రూ.10, రూ.20 నోట్లపై పైలట్ పరీక్షలు




**న్యూఢిల్లీ,జులై 27:** భారతదేశంలో పాలిమర్ కరెన్సీ నోట్ల ప్రవేశానికి కేంద్ర ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆర్బీఐ ప్రతిపాదించిన మేరకు రూ.10, రూ.20 విలువ కలిగిన తలా 100 కోట్ల పాలిమర్ నోట్లను ప్రయోగాత్మకంగా విడుదల చేయ డానికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఆమోదం తెలి పింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరీ లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పాలిమర్ నోట్లు ఎలా పనిచేస్తాయో అంచనా వేయడానికి ఈ ప్రయోగాత్మక విడుదల చేపడుతున్నట్లు తెలిపారు. ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతమైతేనే దేశవ్యాప్తంగా విస్తృతంగా ప్రవేశపెట్టే అంశంపై నిర్ణయం తీసుకుం టామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో పాలిమర్ నోట్లపై ఆర్‌బిఐ పైలట్ ప్రాజెక్ట్ ప్రారంభించనున్నట్లు గతంలో వెలువడిన వార్తలకు అధికారిక ధృవీకరణ లభించింది. ఆర్‌బిఐ ప్రకారం, పాలిమర్ నోట్లు ప్రస్తుతం వినియోగిస్తున్న కాగితపు నోట్ల కంటే ఎక్కువ కాలం మన్నికగా ఉంటాయి. అధిక నగదు లావాదేవీలు జరిగే దేశాల్లో పాలిమర్ నోట్ల జీవితకాలం ఎక్కువగా ఉండటంతో వాటి వినియోగం ప్రయోజనకరమని అంతర్జాతీయ అనుభవాలు సూచిస్తున్నాయని తెలిపింది. అయితే పాలిమర్ నోట్ల ప్రవేశంతో కాగితపు నోట్లను పూర్తిగా రద్దు చేయాలనే ఉద్దేశం లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుతం ఉన్న కాగితపు కరెన్సీతో పాటు పాలిమర్ నోట్లు కూడా చలామణిలో ఉంటాయని, కాగితపు నోట్ల స్థానంలో పూర్తిగా పాలిమర్ నోట్లను తీసుకురావాలనే ప్రతిపాదన లేదని పేర్కొంది. పాలిమర్ నోట్లు డిజిటల్ చెల్లింపులపై ఎలాంటి ప్రభావం చూపుతాయో ఇప్పుడే చెప్పడం సాధ్యం కాదని ఆర్‌బిఐ తెలిపింది. అవి సాధారణ చలామణిలోకి వచ్చిన తర్వాత మాత్రమే దీనిపై సమగ్ర అంచనా వేయవచ్చని పేర్కొంది. భౌతిక కరెన్సీ మరియు డిజిటల్ చెల్లింపులు ఒకదానికొకటి ప్రత్యామ్నా యాలు కాకుండా పరస్పర అనుబంధ వ్యవస్థలని, భవిష్యత్తులో కూడా రెండూ కలిసి కొనసాగుతా యని ఆర్‌బీఐ అభిప్రాయపడింది.

# ఐదు రోజుల నష్టాలకు బ్రేక్





## లాభాల్లో ముగిసిన దేశీయ మార్కెట్లు..

**ముంబయి,జులై 27:** ముడి చమురు ధరల తగ్గుదల, ఐటీ షేర్ల ర్యాలీతో జోష్ దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం ఐదు వరుస ట్రేడింగ్ సెషన్ల నష్టాలకు చెక్ పెడుతూ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరలు భారీగా తగ్గడం, భౌగోళిక ఉద్రిక్తతలు సడలడం, తొలి త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలు మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. విదేశీ బ్రోకరేజ్ సంస్థలు ఐటీ రంగ రేటింగ్‌ను 'అండర్‌వెయిట్' నుంచి 'న్యూట్రల్' కు పెంచడంతో ఐటీ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 776.01 పాయింట్లు లాభపడి 76,835.78 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 228.50 పాయింట్లు ఎగిసి 23,995.95 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా ఐదు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 2.67 శాతం, నిఫ్టీ 2.32 శాతం మేర నష్టపోయాయి. నిఫ్టీ లాభాలకు ఎటర్నల్ 5.61, ఇన్ఫోసిస్ 3.59, బజాజ్ ఫైనాన్స్3.57 ప్రధానంగా దోహదపడ్డాయి. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 1.13 శాతం, బిఎస్ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 1.34 శాతం పెరిగాయి. ఎన్ఎస్ఇలో 2,259 షేర్లు లాభపడగా, 1,071 షేర్లు నష్టపోయాయి. 116 షేర్లు మార్పులేకుండా ముగిశాయి. కమోడిటీ మార్కెట్లో సెప్టెంబర్ 2026 డెలివరీకి సంబంధించిన బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 7.93 డాలర్లు 8.19 శాతం తగ్గి 88.85 డాలర్లకు చేరింది. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. రూపాయి విలువ గత ముగింపు 96.5300తో పోలిస్తే 95.9425 వద్ద ట్రేడైంది. ఎంసిఎక్స్‌లో ఆగస్టు 5, 2026 డెలివరీకి సంబంధించిన బంగారం ఫ్యూచర్స్ ధర 0.57 శాతం పెరిగి రూ.1,43,925కు చేరుకుంది. అమెరికా 10 యేళ్ల ప్రభుత్వ బాండ్ యీల్డ్ 0.94 శాతం తగ్గి 4.635 శాతానికి చేరింది. ఈ వారంలో వెలువడనున్న ప్రముఖ టెక్నాలజీ కంపెనీల త్రైమాసిక ఫలితాలు, అమెరికా ఫెడరల్ రిజర్వ్ ద్రవ్య విధాన సమావేశంపైనా ఇన్వెస్టర్ల ఫోకస్ పెరిగింది. ఫెయిర్‌కెమ్ ఆర్గానిక్స్ త్రైమాసిక లాభాల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేయడంతో షేరు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. లోధా డెవలపర్స్ సమీకృత నికర లాభం 103.36 శాతం పెరిగి రూ.1,372.1 కోట్లకు చేరడంతో షేరు 5.27 శాతం ఎగిసింది. ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ స్వతంత్ర నికర లాభం 37.03 శాతం పెరిగి రూ.795.95 కోట్లకు చేరడంతో షేరు 5.08 శాతం లాభపడింది. కెనరా బ్యాంక్ తొలి త్రైమాసికంలో నికర లాభం 2.19 శాతం పెరిగి రూ.4,856 కోట్లకు, మొత్తం ఆదాయం 4.26 శాతం పెరిగి రూ.39,684 కోట్లకు చేరడంతో షేరు 1.08 శాతం పెరిగింది. శేషసాయి పేపర్ అండ్ బోర్డ్స్ స్వతంత్ర నికర లాభం 96.89 శాతం పెరిగి రూ.33.59 కోట్లకు చేరడంతో షేరు 3.42 శాతం ఎగిసింది. జెన్ టెక్నాలజీస్ సమీకృత నికర లాభం 27.83 శాతం తగ్గి రూ.34.46 కోట్లకు చేరడంతో షేరు 5 శాతం పడిపోయింది. వేదాంత్ ఫ్యాషన్స్ షేరు 1.19 శాతం, జిందాల్ స్టీల్ షేరు 2.92 శాతం లాభపడ్డాయి. బిర్లా కార్పొరేషన్ సమీకృత నికర లాభం 3.20 శాతం తగ్గడంతో షేరు 5.42 శాతం క్షీణించింది. టాటా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సమీకృత నికర లాభం 27.78 శాతం పెరిగి రూ.426.98 కోట్లకు చేరడంతో షేరు 1.84 శాతం పెరిగింది. ఎస్‌బీఎఫ్‌సీ ఫైనాన్స్ నికర లాభం 28.98 శాతం పెరిగి రూ.130.12 కోట్లకు చేరినప్పటికీ షేరు 2.01 శాతం నష్టపోయింది.

## కోల్ ఇండియా తొలి త్రైమాసిక లాభం రూ.8,852 కోట్లు

**ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్**



**న్యూఢిల్లీ,జులై 27:** ప్రభుత్వ రంగ బొగ్గు కంపెనీ కోల్ ఇండియా స్వల్ప లాభాల వృద్ధిని నమోదు చేసింది. కంపెనీ నికర లాభం గత యేడాది ఇదే కాలంతో పోలిస్తే 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. షేర్‌హోల్డర్లకు కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరుపై రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. డివిడెండ్‌కు అర్హులైన వాటాదారులను నిర్ణయించేందుకు జులై 31ని రికార్డు తేదీగా నిర్ణయిం చింది. డివిడెండ్ మొత్తాన్ని ఆగస్టు 25, 2026లోపు చెల్లించనున్నట్లు తెలిపింది. తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.46,255 కోట్లకు చేరింది. గత యేడాది ఇదే కాలంలో ఇది రూ.42,919 కోట్లు. ఎబిట్డా 4.1శాతం తగ్గి రూ.12, 069 కోట్లకు పరిమితమైంది. గత యేడాది ఇది రూ.12,588 కోట్లు. ఎబిట్డా మార్జిన్ 29.3 శాతం నుంచి 26.1 శాతానికి తగ్గింది. నికర లాభం 0.6 శాతం పెరిగి రూ.8,852 కోట్లకు చేరింది. ఒక్కో షేరుకు రూ.5.50 మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. షేరు స్వల్ప లాభంతో ముగింపుత్రైమాసిక ఫలితాల అనంతరం కోల్ ఇండియా షేరు ధర సోమవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి 0.02 శాతం పెరిగి రూ.427.50 వద్ద స్థిరపడింది. ఇదే సమయంలో ఎన్ఎస్ఈ నిఫ్టీ50 సూచీ 0.96 శాతం లాభపడింది. రోజంతా కంపెనీ షేరు రూ.425.75 నుంచి రూ.431.00 మధ్య ట్రేడైంది. ప్రారంభంలో రూ.429.50 వద్ద ప్రారంభమైన షేరు, అంతకుముందు ముగింపు ధర రూ.427.40గా ఉంది.



## నాలుగురెట్లు పెరిగిన బిలియనీర్ టాక్స్ పేయర్లు

**న్యూఢిల్లీ,జులై 27:** దేశంలో యేడాదికి రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటిస్తున్న పన్ను చెల్లింపుదారుల సంఖ్య గత ఐదేళ్లలో గణనీయంగా పెరిగింది. ఈ సంఖ్య దాదాపు నాలుగు రెట్లు పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానంలో ఈ వివరాలు వెల్లడించారు. 2025-26 అసెస్‌మెంట్ సంవత్సరంలో రూ.100 కోట్లకు మించి వార్షిక ఆదాయం ప్రకటించిన వారి సంఖ్య 576కు చేరిందని తెలిపారు. 2021-22లో ఈ సంఖ్య 142 మాత్రమే ఉండేదని చెప్పారు. అంటే ఐదేళ్ల వ్యవధిలో దాదాపు 300 శాతం పెరుగుదల నమోదైందని వివరించారు. 2022-23లో ఈ సంఖ్య 301కు చేరగా, తర్వాత ఏడాది స్వల్పంగా తగ్గి 284గా నమోదైంది. ఆ తర్వాత 2024-25లో 415కు పెరిగి, గత యేడాది 576కు చేరింది.

ఆదాయపు పన్ను చట్టం 2025లో బిలియనీర్ అనే పదానికి ప్రత్యేక నిర్వచనం లేదని కేంద్రం స్పష్టం చేసింది. అందువల్ల ఆదాయపు పన్ను రిటర్నుల్లో రూ.100 కోట్లకు పైగా ఆదాయం ప్రకటించిన వ్యక్తుల వివరాలను మాత్రమే అందించినట్లు పేర్కొంది. ఈ గణాంకాలు పన్ను రిటర్నుల ఆధారంగా సేకరించినవేనని వెల్లడించింది. దేశంలో ఆదాయ అసమానతలపై అడిగిన ప్రశ్నకు కూడా కేంద్రం సమాధానం ఇచ్చింది. హౌస్‌హోల్డ్ కన్సప్షన్ ఎక్స్‌పెండిచర్ సర్వే ప్రకారం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయ అసమానత తగ్గినట్లు తెలిపింది. అలాగే 15 ఏళ్లు పైబడిన వారి నిరుద్యోగ రేటు 3.1 శాతానికి తగ్గిందని వెల్లడించింది. ఉపాధి కల్పన, ప్రగతిశీల పన్ను విధానం, ఆరోగ్యం, విద్య, గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధిపై ప్రభుత్వ వ్యయం పెంచడం ద్వారా సమ్మిళిత ఆర్థిక వృద్ధికి కృషి జరుగుతున్నట్లు కేంద్రం వివరించింది.

## సిఇఒ, సిఎఫ్ఒకు జరిమానా




**ముంబయి, జులై 27:** దేశంలోనే ప్రైవేటుబ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. తమ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శశిధర్ జగదీశన్, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీనివాసన్ వైద్యనాథన్ లపై రూ. 1 లక్ష చొప్పున జరిమానా విధించింది. రిటైల్ అసెట్స్ గ్రూప్ హెడ్ అరవింద్ వోహ్రాపై కూడా ఇదే మొత్తంలో జరిమానా వేసింది. ఈ మేరకు సోమవారం నాడు బ్యాంక్ ఒక ప్రకటన విడుదల చేసింది. మహారాష్ట్ర స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి డిపాజిట్లను సమీకరించే విషయంలో జరిగిన అవకతవకలపై బ్యాంకు అంతర్గత విచారణ చేపట్టింది. 2017, 2021 సంవత్సరాల్లో జరిగిన ఈ డిపాజిట్ల సమీకరణపై స్వతంత్ర డైరెక్టర్లతో కూడిన ప్రత్యేక క్రమశిక్షణా కమిటీ దర్యాప్తు నిర్వహించింది. ఈనెల 23న జరిగిన బోర్డు సమావేశంలో ఈ కమిటీ నివేదికను సమీక్షించారు. సంబంధిత అధికారుల ప్రవ ర్తన వ్యాపార పరిధిని దాటడం కిందకు వస్తుందని, ఇందులో ఎలాంటి దురు ద్దేశం లేదా వ్యక్తిగత లాభం లేదని బోర్డు నిర్ధారణకు వచ్చింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా వ్యవహరిం చడంలో ఎటువంటి అలసత్వం ఉండకూడదనే ఉద్దేశంతో, కమిటీ సిఫార్సుల మేరకు బోర్డు ఈ నిర్ణయం తీసుకుంది. ముగ్గురు ఉన్నతాధికారులకు జరిమానాతోపాటు హెచ్చరిక లేఖలు జారీచేసింది. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న ఇతర ఉద్యోగులకు కూడా హెచ్చరిక లేఖలు ఇచ్చింది. విచారణ ఫలితాలను ఆర్‌బీఐకి తెలియజేయాలని బోర్డు ఆదేశించింది.




## టాటా గ్రూప్ ఆదాయం రూ.16.24 లక్షల కోట్లు

## నికర లాభం 52 శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, జులై 27:** టాటా గ్రూప్ సమగ్ర స్థాయిలో మరోసారి బలమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. గ్రూప్ మొత్తం ఆదాయం 7.8 శాతం పెరిగి రూ.16,24,030 కోట్లకు చేరగా, పన్నులు చెల్లించిన తర్వాత నికర లాభం 51.9 శాతం పెరిగి రూ.1,70,525 కోట్లకు చేరిందని టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ వెల్లడించారు. టాటాగ్రూప్ సంస్థల హోల్డింగ్ కంపెనీ అయిన టాటా సన్స్ వార్షిక నివేదికలో వాటాదారులనుఉద్దేశించి చంద్రశేఖరన్ మాట్లా డారు. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ రంగంలో పెట్టుబడుల ప్రవాహం మధ్య కూడా టాటా గ్రూప్ అత్యుత్తమ ఆర్థిక ప్రదర్శన కనబర్చిందన్నారు.

టాటాసన్స్ ఆదాయం 9.1 శాతం పెరిగి రూ.42, 367 కోట్లకు, నికరలాభం 21.8 శాతంపెరిగి రూ.31,961 కోట్లకు చేరింద న్నారు. ఒక్కో షేరుకు రూ.1,10,717 తుది డివిడెండ్ చెల్లించాలని బోర్డు సిఫారసు చేసిందని, దీనికి వాటాదారుల ఆమోదం అవసరమని తెలిపారు. సంస్కరణలు, వ్యాపార పునర్వ్యవస్థీకరణ ఫలితంగానే ఈ వృద్ధి సాధ్యమైందని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ తయారీలో వేగంగా ఎదుగుతున్నటాటా గ్రూప్ ఎలక్ట్రానిక్స్ తయారీ వ్యాపారం కేవలం నాలుగేళ్లలోనే రూ.1,31,082 కోట్ల ఆదాయంతో గ్రూప్‌లో నాలుగో అతిపెద్ద సంస్థగా ఎదిగిందన్నారు.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

వార్త, మంగళవారం 28 జులై 2026
చెలి

# గురుసాక్షాత్ పరంబ్రహ్మ

**గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుదేవో మహేశ్వరః
గురుసాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః**



అజ్ఞానమనే చీకటిని తొలగించి, జ్ఞానమనే జ్యోతిని వెలిగించేవారు మన కన్నతల్లిదండ్రులు ప్రథమ గురువులుగా కాగా, మిగిలిన జీవితం మొత్తం మార్గనిర్దేశనం చేసేవారు గురువు. మానవ జీవిత చరిత్రానికి, భగవద్దర్శనానికి బాటలు వేసేవారే గురువులు. గురుపూర్ణిమ, ఆషాఢ పూర్ణిమ, వ్యాస పూర్ణిమ ఏదైనా పవిత్రమైనదే. వ్యాసభగవానుని జన్మదినం. ఆషాఢ పురాణాలను మనకు అందించిన మహనీయుని జన్మదినం కారణంగా గురుస్థానములో ఆ వ్యాసభగవానుని స్మరిస్తూ చేసుకునే పవిత్రమైన రోజు. ఆషాఢ పూర్ణిమను గురు పూజతో ఉత్సవం చేయటం మన భారతీయ సంస్కృతిలో భాగమైనది. గురువుని త్రిమూర్తి స్వరూపంగా భావిస్తాము. మానవ చరిత్రలోనే అపూర్వమైన ఆధ్యాత్మిక పర్వదినంగా నిలచిన వ్యాస జన్మతిథి. పౌరాణికులు, కథకులు, బోధకులు గురువుతో పురాణాలలో నిక్షిప్తం నిహితం చేయబడిన విషయాలను మానవజాతి జ్ఞానం సంపాదించాలంటే వ్యాస మహర్షి అనుగ్రహం అవసరము. అందుచేత మనం వ్యాస పూర్ణిమ నాడు పౌరాణికులను, మన గురువులను ధూపదీప నైవేద్యాలతో పూజించి వినయ విధానం సత్కరించాలి. గురువులకు గురువుగా ఖ్యాతి గడించిన మహనీయుడు వ్యాసమహర్షి. అందువలన లోకంలో అందరూ శ్రీ వ్యాసమహర్షిని పూజించి, గౌరవించాలి. తమ జీవితాలకు సరైన మార్గ నిర్దేశనం చేయటానికి కావలసిన సాధన సంపత్తి గురువు ద్వారా లభిస్తుందని అందరి విశ్వాసం.



గురువులుగా ప్రసిద్ధిగాంచిన, ఆది శంకరులు, దత్తాత్రేయుడు, గురు దక్షిణామూర్తి మొదలైనవారిని ఈరోజు కొలుస్తారు. ఈ గురుపూర్ణిమ ఉత్సవాన్ని శ్రీ ఆదిశంకరులే ప్రారంభించారని చెబుతారు. గురుపూర్ణిమ నాడు ఈ రోజు దేవాలయాలలో విశేష పూజలు నిర్వహిస్తారు. ఉదయం పాలాభిషేకాలు, అర్చనలు నిర్వహిస్తారు. రోజంతా శ్రీ గురుచరిత్ర, సాయిచరిత్ర పుస్తకాలను, ఉడకబెట్టిన శెనగలను ప్రసాదంగా పంచి పెట్టటమే విశిష్టత.

**కామధేనువు మరి కల్పవృక్షము కూడ గురువు మనసునందు కొలువుయుండు
గురువునకు సరియగు గురుదేవులే సుమా ప్రకృతి పలుకునిచ్చు ప్రభు మనకు !!**

సమస్త ప్రకృతిలో నిండి నిభిఢీకృత్కుడై జానానందాన్ని, ప్రేమను పంచటానికి గురువు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. ఆ మహత్తర జ్ఞానాన్ని అందుకోవటానికి శిష్యులకు చిత్తశుద్ధి అవసరం. మనిషిలో గుప్తంగా దాగి యున్న జ్ఞానాన్ని, విశేష శక్తియుక్తులను వెలికితీసి మార్గనిర్దేశనం కలిగించేవారు గురువు. '

**- డాక్టర్ దేవులపల్లి పద్మజ**

# చిన్నారులకు దూరంగా !

పిల్లలు టేబుల్ మూలలు తగలకుండా, మెట్ల మీద జారకుండా.. ఇలా చాలా జాగ్రత్తలే తీసుకుని ఉంటారు. మామూలు బ్యాటరీలు చిన్న పిల్లల చేతిలో కనిపిస్తాయి. వెంటనే తీసేయొచ్చు. కాని బటన్ తరహా వాటితోనే ప్రమాదం. పిల్లల బొమ్మలు, కొన్నరకాల రిమోట్లలో ఇవి ఉంటాయి. పొరపాటు పిల్లల చేతికి చిక్కి, నోట్లో పెట్టుకున్నారో ప్రమాదం. జీర్ణవ్యవస్థను దెబ్బతీస్తాయి కూడా. కాబట్టి, గమనించుకోండి. ● గోళీలు, పూసలు, మాగ్నెటిక్ బాల్స్.. ఇవి చిన్నారులను ఆకర్షించేవే. మెరుపూనిన రంగులతో ఉంటాయి కదా! వెంటనే నోట్లో పెట్టేసుకుంటారు. గొంతులో ఇరుక్కుపోవడమో, పేగులను దెబ్బతీయడమో చేస్తాయి కూడా. కాబట్టి, గమనించుకోండి. ● గోళీలు, పూసలు, మాగ్నెటిక్ బాల్స్.. ఇవి చిన్నారులను ఆకర్షించేవే మెరుస్తూ రంగులతో ఉంటాయి కదా! వెంటనే నోట్లో పెట్టేసుకుం టారు. గొంతులో ఇరుక్కుపోవడమో, పేగులను దెబ్బతీయడమో చేస్తాయి. వీటినీ అందని చోట్ల ఉంచడం మేలు. ● స్విచ్‌బోర్డుల్లో వేళ్లు ఎక్కడ పెడతారో అని చాలా మంది వాటిని మూసేస్తున్నారు. కానీ ఛార్జింగ్ వైర్లు, కేబుల్స్‌ని మాత్రం స్విచ్ బోర్డులకు పెట్టి వదిలేస్తుం టారు.



పొరపాటున స్విచ్ ఆపడం మరిచిపోయినా, వైర్లు ఎక్కడైనా తెగినా ప్రమాదమే. వాటిని పిల్లలు నోట్లో పెట్టుకుంటే షాక్ గురవుతారు. ● అవసరానికి పని కొస్తాయని బకెట్లు, టబ్బుల్లో నీటిని పట్టి ఉంచు తాం. కానీ చిన్నపిల్లలు నీటిపట్ల ఎలా ఆకర్షితు లవుతారో తెలిసిందేగా? చిన్న ప్రాణాలు పొరపాటున వాటిల్లో పడ్డారంటే ఊపిరాడదు. చిన్నారులకు అందుబాటు లో ఉండకుండా అయినా చూడండి. లేదా వాటిపై ఏవైనా మూతలు ఏర్పాటు చేయడమో మరేవైనా జాగ్రత్తలు తీసుకోవడమో.

# 'మిన్ను' తాకిన సంకల్పంతో..



కలలు కని వాటిని నిజం చేసుకోవాలని మాజీ రాష్ట్రపతి ప్రఖ్యాత శాస్త్రవేత్త ఏపిజె అబ్దుల్‌కలాం ఉపదేశిస్తుం టారు. అలాంటి ధోరణిలోనే ఆలోచించిన ఓ తనయ మిన్నుజోషి తన తండ్రి కలనే తన కలగా ఎంచుకుని సివిల్ సర్వీసెస్‌లో విజయం సాధించారు. సాధారణంగా 'వివాహం విద్యానాశాయ' అంటుంటారు దానిలోని అర్థం గ్రహించిన మిన్ను ఎంతో దాంపత్యంగా తెలుత కుటుంబాన్ని చదువును సమన్వయం చేసుకుంటూ పోలీసుశాఖలో క్లర్క్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఉద్యోగాన్ని, కుటుంబాన్ని సమన్వయం చేసుకుంటూ సివిల్‌లో విజయం సాధించారు.

ప్రస్తుతం ఆమె మహారాష్ట్రలోని అమరావతిలో ఉద్యోగం ఉన్నారు. కేరళలోని పత్తనంతిట్టకు చెందిన మిన్ను, ఓ పోలీస్ అధికారి కూతురు. ఆమె విద్యార్థిగా ఉండగానే తండ్రి మరణించారు. ప్రభుత్వం అందించే కారుణ్య నియామకం కింద 2012లో కేరళ పోలీస్ శాఖలో క్లర్క్‌గా చేరారు. తన కుమార్తె సివిల్ సర్వెంట్ కావాలన్నది ఆమె తండ్రి కల. ఉద్యోగంలో చేరిన తర్వాత కూడా చదువును కొనసాగించిన ఆమె, కేరళ యూనివర్సిటీ నుంచి బయోకెమిస్ట్రీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశారు. ఇస్రో అధికారి జోషి డి.జె.తో వివాహమైంది. ఓ పాప కూడా. తనకున్న చిన్న ఉద్యోగంతో సరిపెట్టుకోకుండా ఒక పక్క ఇంటిపని, మరో పక్క ఉద్యోగం, ఇంకా పక్క సివిల్స్‌ను కఠోర శ్రమతో పూర్తి చేశారు. ఐదుసార్లు విఫలమైనా నిరాశ చెందలేదు. పట్టు విడవలేదు. ఆరో ప్రయత్నంలో 150 ఆల్ ఇండియా ర్యాంకు సాధించారు. తండ్రి కలను నిజం చేయగలిగానన్న సంతృప్తితో ప్రస్తుతం మిన్ను జోషి మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలో భట్కులితివాసా సబ్‌డివిజన్‌కు అసిస్టెంట్ కలెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. ఎన్ని బాధ్యతలున్నా లక్ష్య సాధనలో పట్టుదల ఉంటే సాధించలేనిదే ఉండదని 'మిన్ను' ప్రయత్నం నిరూపించింది.

# రోజువారీ శుభ్రంతో అందం



కొంతమంది ముఖంపై ఎంత వెతికినా ఒక్క మొటిమైనా కనిపించదు. ఇక నల్లమచ్చల జాడే దొరకదు. **మేకప్ మాయజాలం లేకుండానే న్యాచురల్ బ్యూటీస్‌గా కనిపించేస్తుంటారు. ఇలాంటి వాళ్లను చూడగానే.. అందం కోసం ఎన్నెన్ని సౌందర్య చికిత్సలు తీసుకుంటారో అనిపిస్తుంటుంది. నిజానికి ఈ మహిమంతా చికిత్సలు, చిట్కాల్లో కాదు. వారు పాటించే రోజువారీ అలవాట్లు.. మరి, అవేంటో తెలుసుకుందాం..**

✦ ఉదయం నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకునే ముందు ఈ రెండు సందర్భాల్లో ముఖం శుభ్ర పరచుకునే వారు చాలా తక్కువ మంది. ముఖంపై మొటిమలు రావడానికి ఈ నిర్లక్ష్యమూ ఓ కారణం. అందుకే ఈ రెండు సంద ర్భాలతో పాటు.. చెమట ఎక్కువగా వచ్చినప్పుడు తప్పని సరిగా ముఖం శుభ్రం చేసుకోవాలి. ఫలితంగా ముఖంపై దుమ్ము, జిడ్డుదనం తొలగిపోయి చర్మ రంధ్రాలు మూసుకుపోవు. తద్వారా మొటిమలూ ఏర్పడవు. అయితే ఈ క్రమంలో చర్మతత్వానికి సరిపడే ఫేస్‌వాష్‌ను ఎంచుకోవడమూ ముఖ్యమే. ✦ పబ్లిక్ టాయిలెట్ కంటే మొబైల్ స్క్రీన్ ఎక్కువ అపరిశుభ్రంగా ఉంటుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఫోన్ మాట్లాడేటప్పుడు, మొబైల్‌ను తాకిన చేతులతోనే ముఖాన్ని తడుముకోవడం వల్ల ఈ క్రిములు ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయి. ఈ సమస్య దరిచేర కుండా.. ఫోన్ స్క్రీన్‌ను ఎప్పటికప్పుడు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు ✦ చేతుల్ని పదే పదే ముఖానికి తాకించే అలవాటు కొంతమందికి ఉంటుంది. ఫలితంగా చేతులకున్న సక్రిములు, మురికి ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయి. అందుకే ముఖం కడుక్కునేటప్పుడు తప్ప అసలు చేతుల్ని ముఖానికి తాకించకుండా జాగ్రత్తపడాలి ✦ రోజూ వాడే క్రమంలో మన చర్మం, జుట్టు కుదుళ్లలో ఉన్న జిడ్డు దిండు కవర్ల పైకి చేరుతుంది. అది వాతావరణంలోని దుమ్మును ఆకర్షిస్తుంది. ఈ అపరిశుభ్రమైన దిండ్లనే వారాల తరబడి వాడడం, ఇతరులు వీటిని ఉపయోగించడం వల్ల ముఖంపై మొటిమలొస్తాయి. కాబట్టి వారానికోసారైనా దిండ్ల కవర్లను మార్చుకోవడం, ఎవరి దిండువారే వాడుకోవడం మంచిదంటురు.

# బుఖారీ పులావ్



బాస్మతి బియ్యం: అర కిలో, మటన్: అర కిలో, క్యారెట్ తురుము: ఒక కప్పు, పచ్చి బఠాణీ: అర కప్పు, టమాట ముక్కలు: ఒక కప్పు, ఉల్లిగడ్డ: ఒకటి, పచ్చిమిర్చి: రెండు, జీడిపప్పు: పావుకప్పు, కిస్మిస్: ఒక టేబుల్ స్పూన్, అక్రోట్స్: ఐదు, నూనె: అర కప్పు, కారం: ఒక టేబుల్ స్పూన్,

నంముందుగా బాస్మతి బియ్యాన్ని అరగంటపాటు నానబెట్టుకుని పొడిపొడిగా వండాలి. స్టవ్‌మీద కుక్కర్ పెట్టి ఒక టేబుల్ స్పూన్ నెయ్యి వేసి వేడయ్యాక జీడిపప్పు, అక్రోట్స్, కిస్మిస్ జోడించి బాగా వేయించి పక్కన పెట్టాలి. అదే నెయ్యిలో నూనె వేసి దాల్చిన చెక్క, సాజీర, అనాస పువ్వు, యాలకులు, లవంగాలు వేయాలి. కాసేపు వేగాక తరిగిన ఉల్లిగడ్డ, మిర్చి, టమాట కలపాలి. అన్నీ బాగా వేగాక మటన్ వేయాలి. రెండు నిమిషాలు మగ్గిన తర్వాత అల్లం వెల్లుల్లి పేస్ట్, కారం, ధనియాల పొడి, గరం మసాలా, పసుపు, క్యారెట్ తురుము, పచ్చిబఠాణీ, తగినంత ఉప్పు వేసి పది నిమిషాలు సన్నటి మంటపై మగ్గనివ్వాలి. అర లీటర్ నీళ్లు పోసి కుక్కర్ మూత పెట్టి ఐదు విజిల్స్ వచ్చేవరకు ఉడికించాలి. బాగా ఉడికిన మటన్‌లో.. ఉడికించి పెట్టుకున్న బాస్మతి రైస్ వేసి కలిపి పైనుంచి వేయించిన డ్రైఫ్రూట్స్, నెయ్యి వేసి మరో రెండు నిమిషాలు మూత పెట్టుకుంటే నోరూరించే బుఖారీ పులావ్

తెర

# ఘనంగా ప్రారంభమైన 'పొలిమేర 3'

బ్లాక్ బస్టర్ 'బ్లాస్ట్ జోన్' తర్వాత 'పొలిమేర' ఫ్రాంచైజీలోకి యాక్షన్ కింగ్ అర్జున్.. ఘనంగా ప్రారంభమైన 'పొలిమేర 3'. ఓటీటీలో ..'మా ఊరి పొలిమేర'తో సంచలనం సృష్టించి, థియేటర్లలో 'పొలిమేర 2'...తో భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ తెరకెక్కిస్తున్న విజయవంతమైన హారర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీ ఇప్పుడు పొలిమేర3గా మరింత పవర్‌ఫుల్‌గా ప్రేక్షకుల ముందుకు రానుంది. డా.అనిల్ విశ్వనాథ్ దర్శకత్వంలో 'పొలిమేర 3' చిత్రాన్ని వంశీ నందిపాటి ఎంటర్‌టైన్‌మెంట్స్ అండ్, ప్రముఖ నిర్మాత, పంపిణీ దారుడు దివంగత నారాయణదాస్ నారంగ్ ఆశీస్సులతో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బ్యానర్స్‌పై వంశీ నంది పాటి, జాన్వీ నారంగ్‌లు ఈ సినిమాను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ రెండు సంస్థల కలయికతో మరింత పవర్‌ఫుల్‌గా భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నేడు సికింద్రాబాద్‌లోని ఓ గణేష్ ఆలయంలో సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాత, ఎగ్జిబిటర్ నారాయణదాస్ నారంగ్ జయంతి సందర్భంగా చిత్రాన్ని ప్రారంభించడం విశేషంగా నిలిచింది. ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలుగు సినీ




పరిశ్రమకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తొలి క్లాప్ ఇవ్వగా, సీనియర్ నిర్మాత డి. సురేష్ బాబు కెమెరా స్విచ్ఛాన్ చేశారు. యువ నిర్మాత బన్నీవాస్, ఎగ్జిబిటర్ సదానంద్ గౌడ్ చిత్ర బౌండెడ్ స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందించి విజయాన్ని ఆకాంక్షించారు. ఈ ప్రారంభోత్సవ వేడుకలో ప్రముఖ నిర్మాత సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్‌రావు తదితరులు

# 'టాక్సిక్' స్టైల్ పోస్టర్ రిలీజ్



రాకింగ్ స్టార్ యశ్ హీరోగా గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'టాక్సిక్' విడుదలకు ఇక కేవలం నెల రోజులే మిగిలాయి. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా కౌంట్‌డౌన్‌ను ప్రారంభిస్తూ మేకర్స్ మరో కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఫియర్, మిస్టరీ, స్టైల్ కలగలిసిన ఈ పోస్టర్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. ఈ పోస్టర్‌లో యశ్ ప్రశాంతంగా సిగరెట్ వెలిగిస్తున్నట్లు కనిపిస్తున్నారు. పొగ, చీకటి కారణంగా ఆయన ముఖం పూర్తిగా కనిపించకుండా మిస్టరీని కొనసాగించారు. ఆయన చేతి మాత్రం రక్తంతో తడిసి ఉండటం, వేళ్ల నుంచి రక్తపు చుక్కలు జారుతూ తెల్లటి షర్ట్‌పై పడటం చూస్తే ఒక టెర్రిఫిక్ యాక్షన్ సీన్ ని చూపిస్తోంది. యశ్ రఫ్ బియర్డ్, టాటూలతో చేతులు, స్టైలిష్ రింగ్స్, ట్రెల్డ్ ఓవర్‌కోట్‌తో పవర్‌ఫుల్‌గా కనిపించారు. బ్లాక్ అండ్ వైట్ బ్యాక్‌డ్రాప్‌లో రక్తపు ఎరుపు రంగు, సిగరెట్ నిప్పు మాత్రమే ప్రత్యేకంగా హైలైట్ అవుతూ పోస్టర్‌ను మరింత ఆకట్టుకునేలా తీర్చిదిద్దాయి. కెవిఎన్ ప్రొడక్షన్స్ మరియు మాస్టర్ మైండ్ క్రియేషన్స్ నిర్మించిన 'టాక్సిక్' తన ప్రత్యేకమైన ప్రమోషనల్ క్యాంపెయిన్‌తో ఇప్పటికే అందరినీ ఆకట్టుకుంది. కథ గురించి ఎలాంటి వివరాలు వెల్లడించకుండా విడుదల చేస్తున్న ప్రతి పోస్టర్ ప్రేక్షకుల్లో మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. టాక్సిక్ ఈ ఏడాది అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారీ చిత్రాల్లో ఒకటిగా నిలిచింది.

# 'మహేంద్రగిరి వారాహి' సెప్టెంబర్ 11న విడుదల



సుమంత్, ఐశ్వర్య రాజేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న స్పిరిచువల్ మిస్టరీ థ్రిల్లర్ 'మహేంద్రగిరి వారాహి'. సంతోష్ జాగర్లపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'మహేంద్రగిరి వారాహి' మహేంద్రగిరి నేపథ్యంగా, వారాహి మాత డివైన్ పవర్ చుట్టూ సాగే ఈ కథలో ఎన్నో అంతుచిక్కని సంఘటనలు, రహస్యాలు, మిస్టరీతో ప్రేక్షకులకు సరికొత్త సినీ అనుభూతిని అందించబోతుంది. ఈ చిత్రంలో మీనాక్షి గోస్వామి, మాళవిక నాయర్, బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, రాజీవ్ కనకాల, అలీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. . ఇప్పటికే విడుదలైన టీజర్ కి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం సెప్టెంబర్ 11న ఈ చిత్రం ప్రేక్షకులు ముందుకురానున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. రిలీజ్ డేట్ ప్రెస్ మీట్‌లో హీరో సుమంత్ మాట్లాడుతూ: . 'మహేంద్రగిరి వారాహి' జర్నీ రెండున్నరేళ్ల క్రితం ప్రారంభమైంది. సంతోష్ నాకు ఈ సబ్జెక్ట్ చెప్పిన తర్వాత ఒక మంచి నిర్మాత కోసం ఎదురు చూశాం. మధు, లక్ష్మణ్ చాలా ప్యాషనేట్ ప్రొడ్యూసర్స్. ఈ సినిమాకు ఏం కావాలో అన్నీ సమకూర్చి, చాలా గొప్పగా తీర్చిదిద్దారు. టీజర్‌ను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులందరికీ కృతజ్ఞతలు. ఈ సినిమాలో ఇంకా చాలా సర్‌ప్రైజ్ ట్విస్టులు, ఊహించని సన్నివేశాలు, ఆసక్తికరమైన మలుపులు ఉన్నాయి. మీ అందరి ఆశీస్సులతో, అమ్మవారి ఆశీస్సులతో సెప్టెంబర్ 11న థియేటర్లలోకి వస్తున్నాం. సినిమాను మరింత అద్భుతంగా తీర్చిదిద్ది మీ ముందుకు తీసుకొస్తున్నాం. ఈ సినిమా చూసిన తర్వాత మీరు తప్పకుండా సంతృప్తి చెందుతారు. ప్రతి ఒక్కరినీ ఆకట్టుకునే సినిమా అవుతుంది. మా టీమ్ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. దర్శకుడు సంతోష్ జాగర్లపూడి మాట్లాడుతూ.. నాకు ఈ అవకాశం ఇచ్చిన లక్ష్మణ్ గారికి, మధు గారికి ధన్యవాదాలు. అలాగే సుమంత్ కూడా నన్ను బలంగా నమ్మారు

# 'భగవంతుడు' 'సిత్తరాల నవ్వు' పాటరిలీజ్



యంగ్ టాలెంటెడ్ హీరో తిరువీర్ నటిస్తున్న కొత్త సినిమా 'భగవంతుడు'. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తోంది. కన్నడ నటుడు రిషి ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాను ఏషియన్ ఫిలిమ్స్ నారాయణ దాస్ నారంగ్, పనస శంకరయ్య గౌడ్ సమర్పణలో రవి పనస ఫిలిం కార్పొరేషన్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెంబర్ 1గా నిర్మిస్తున్నారు సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ రవి పనస. ఈ సినిమాతో జి.జి. విహారి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రొమాంటిక్ పీరియడ్ పొలిటికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న "భగవంతుడు" సినిమా త్వరలోనే రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సిత్తరాల నవ్వు' రిలీజ్ చేశారు. ఈ పాటను మ్యూజిక్ డైరెక్టర్ కృష్ణ ప్రసాద్ బ్యూటిఫుల్‌గా కంపోజ్ చేయగా, డైరెక్టర్ జి జి విహారి ఆకట్టుకునే లిరిక్స్ అందించారు. ప్రముఖ సింగర్ జావెద్ అలీ రిపీటెడ్‌గా వినేలా పాడారు. 'సిత్తరాల నవ్వు' పాట ఎలా ఉందో చూస్తే సిత్తరాల నవ్వు, అరే సిలకల్లే నువ్వు, చేమంతి పువ్వు, నీలాల కళ్లు, అరే పారే సెలయేళ్లు, ఒంపు పరవళ్లు..అంటూ సాగుతూ ఏరువాక పున్నమి లాంటి అమ్మాయి, కొండగాలి దేవర వంటి అబ్బాయి మధ్య ప్రేమను చూపిస్తూ రూపొందించిన ఈ మట్టి పాట ప్రతి ఒక్కరిని ఇంప్రెస్ చేస్తోంది.

# నటుడిగానే నా ప్రయాణం: జై కృష్ణ




సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేశ్ బాబు సోదరుడు రమేశ్ బాబు తనయుడు జై కృష్ణ ఘట్టమనేని కథానాయకుడిగా చిత్ర పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. నటుడిగా తనను తాను నిరూపించుకుని, ఇండస్ట్రీలో సుస్థిర స్థానాన్ని సంపాదించుకోవడమే తన లక్ష్యమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. జై కృష్ణ హీరోగా నటిస్తున్న తొలి చిత్రం శ్రీనివాస మంగాపురం విడుదల కానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా జై కృష్ణ మాట్లాడుతూ, "దర్శకుడు అజయ్ తీర్చిదిద్దిన పాత్రలు, భావోద్వేగాలు చాలా సహజంగా ఉన్నాయి. ఈ సినిమా ప్రేక్షకులకు బాగా కనెక్ట్ అవుతుందని నమ్ముతున్నాను. నటుడిగా నా ప్రతిభను చాటుకోవడానికి ఇది ఒక చక్కని కథ. మంచి సినిమాలు చేసే నటుడిగా గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా తపన," అని పేర్కొన్నారు.దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ, "మహేశ్ బాబుతరహాలోనే జై కృష్ణ కూడా ఇండస్ట్రీలో సుదీర్ఘ కాలం నిలిచిపోయే కథానాయకుడు అవుతాడు. సినిమా నేను అనుకున్న దానికంటే చాలా బాగా వచ్చింది," అని ధీమా వ్యక్తం చేశారు. నటుడు నరేశ్ విజయకృష్ణ మాట్లాడుతూ, కృష్ణవారసత్వాన్ని జై కృష్ణ ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకెళ్తున్నాడని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నటులు బ్రహ్మాజీ, వడ్లమాని శ్రీనివాస్, సినిమాటోగ్రాఫర్ జై కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 'తీరం' టైటిల్ సాంగ్ విడుదల



భావోద్వేగ కథతో ప్రేక్షకుల ముందుకు రానున్న 'తీరం' హైదరాబాద్‌ల టోని ప్రసాద్ ల్యాబ్‌లో శ్రీ భవానీ క్రియేషన్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న భావోద్వేగ ప్రధాన చిత్రం 'తీరం' టైటిల్ సాంగ్‌ను ఘనంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు పాల్గొని చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా 'పుష్ప' ఫేమ్ నటుడు జగదీష్, ఫన్ బకెట్ మహేష్ విట్ట, నటుడు రాజ్ కుమార్ కసిరెడ్డి, దర్శకుడు ప్రసాద్, జబర్దస్త్ సద్దాం, నటుడు కుమానన్ తదితరులు హాజరై టైటిల్ సాంగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు వంశీ మునగాల మాట్లాడుతూ, తీరం' ప్రతి ఒక్కరి హృదయాలను తాకేలా భావోద్వేగభరితమైన కథతో రూపొందుతోందన్నారు. చిత్రీకరణ విజయవంతంగా పూర్తై ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు నిర్మాత ఉపేందర్ గంగావెల్లి మాట్లాడుతూ, దర్శకుడు వంశీ మునగాల కథ వినిపించిన వెంటనే ఎంతో నచ్చిందన్నారు. కథపై నమ్మకంతోనే ఈ చిత్రాన్ని నిర్మించేందుకు ముందుకు వచ్చానని తెలిపారు. సినిమా నిర్మాణం తుది దశకు చేరుకుందని, విడుదల తేదీతో పాటు ఇతర విశేషాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. హీరో ప్రభు మాట్లాడుతూ, షార్ట్ ఫిల్మ్స్‌తో తన సినీ ప్రయాణాన్ని ప్రారంభించి ఇప్పుడు ఫీచర్ ఫిల్మ్‌లో హీరోగా నటించే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. నటుడు జగదీష్ మాట్లాడుతూ, తీరం అనే టైటిల్ చాలా అర్థవంతంగా ఉందన్నారు.

# 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47' అక్టోబరు 2 విడుదల



'చిట్టిబాబు'గా విక్టరీ వెంకటేష్ పాత్ర పరిచయం. విక్టరీ వెంకటేష్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో రూపొం దుతున్న ప్రతిష్టాత్మక కుటుంబ కథా చిత్రం ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47 (ఎకె 47)' ప్రచార కార్యక్రమాలు అధికారికంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా చిత్రంలోని ప్రధాన పాత్రలను ఒక్కొక్కటిగా పరిచయం చేస్తూ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తొలి పాత్రగా విక్టరీ వెంకటేష్ పోషిస్తున్న 'చిట్టిబాబు' పాత్రను పరిచయం చేయగా, అనంతరం శ్రీనిధి శెట్టి, యువినా పార్థవి, రాజా ప్రజ్వల్ పాత్రలను పరిచయం చేయనున్నారు. ఈ నలుగురి పాత్రలు ఈ ఆత్మీయ కుటుంబ కథకు హృదయంగా నిలవనున్నాయి. ఈ చిత్రంలో వెంకటేష్ చిట్టిబాబు పాత్రలో అలరించ నున్నారు. కుటుంబాన్ని ప్రేమతో, ఆప్యాయతతో, బాధ్యతతో ఒకే తాటిపై నడిపించే కుటుంబ పెద్దగా ఆయన పాత్ర ఆకట్టుకోనుంది. విడుదలైన పాత్ర పరిచయ వీడియోలో వెంకటేష్‌తో పాటు శ్రీనిధి శెట్టి, నారా రోహిత్ కనిపిస్తూ, నవ్వులు, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలతో నిండిన చిత్ర ప్రపంచాన్ని అందంగా పరిచయం చేశారు. సహజమైన నటన, అద్భుతమైన కామెడీ టైమింగ్, కుటుంబ కథా చిత్రాల్లో తనదైన ముద్ర వేసిన వెంకటేష్ మరోసారి అన్ని వయసుల ప్రేక్షకులను అలరించే పాత్రతో రాబోతున్నారు. చిట్టిబాబు పాత్ర ఆయన కెరీర్‌లో మరో చిరస్మరణీ యమైన పాత్రగా నిలిచేలా కనిపి స్తోంది. ఆనందం, అనుబంధాలు, కుటుంబ విలువ లకు ప్రతిరూపంగా ఈ పాత్ర ఉండబోతోంది. తొలి పాత్ర పరిచయంతోనే చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక వరుసగా రానున్న ఇతర పాత్రల పరిచయాలు కూడా 'ఆదర్శ కుటుంబం' ప్రపంచాన్ని మరింత ఆసక్తికరంగా ప్రేక్షకులకు చేరువ చేయనున్నాయి.

## రేపు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గాంధీభవన్‌లో 'ప్రజలతో ముఖాముఖి'



**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** ప్రజా పాలనలో ప్రజాసమస్యల పరిష్కారానికి గాంధీ భవన్‌లో ప్రతి బుధవారం జరిగే 'ప్రజలతో ముఖాముఖి' కార్య క్రమంలో వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, జౌళి, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటున్నారు. ఉయదం 11 గంటల నుంచి ఒంటిగంట వరకు ప్రజల నుంచి విన్నపాలు గాంధీభవన్‌లో స్వీకరింస్తారు.

వెంటనే పరిష్కారం అయ్యేవి ఉంటే ఆయా బాధ్యత కలిగిన అధికారులకు ఫోన్‌లో తెలపడంతోపాటు సంబందిత జిల్లా కలెక్టర్‌లకు కూడా సమస్య సాధనకు అత్యంత ప్రాధాన్యత చూపాలని సూచనలు మంత్రులు చేస్తారు. ఏవైనా సమస్యలు వెంటనే పరిష్కారం కాని ఉంటే వాటిపై విచారణచేసి తగు న్యాయం చేయడానికి అధికారులకు ఆదేశాలతో నిర్ధేశి స్తారు. పిసిసి చీఫ్ మహేష్‌కుమార్ తన మార్కుగా ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని గాంధీ భవన్‌లో ప్రారంభించారు. పార్టీకి ప్రజలకు ప్రభుత్వాన్ని దగ్గర చేయడానికి ఈ కారక్రమం ఎంతగానో దోహదం చేస్తుంది.

## ఫీజు రియింబర్స్ చేయకపోతే పేద విద్యార్థులకు నష్టం

### నా పేరు హనుమంతు.. ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఉంటా : విహెచ్

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** రాజశేఖర్‌రెడ్డి తీసుకొచ్చిన ఫీజు రియంబర్స్ మెంట్ అమలు చేయాలని నా రిక్వెస్ట్ ఫీజు రియంబర్స్మెంట్ చేయకపోతే పేద పిల్లలు ఉన్నత చదువులు చదివే అవకాశం కోల్పోయి నష్టపోతారనీ ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు అన్నారు. సోమవారం గాంధీ భవన్‌లో విహెచ్ విలేఖరులతో మాట్లాడుతూ భట్టి విక్రమార్క రాజశేఖర్ రెడ్డి శిష్యుడిని అంటారు అత్యంత ప్రాధన్యత కలిగిన ఈ ప్రోగ్రాంకు నిధులు కేటాయించాలని అన్నారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఫీజు రియంబర్స్ మెంట్,చేశారుఆయన ఉన్నంత వరకు పీజు రియంబర్స్మెంట్ జరిగిందనీ ఆతర్వాత రియంబర్స్మెంట్ చేయడం లేదనీ ఆవేదన చెందారు. ఒబిసి ల ప్రతినిధిగా బిసిలు నామీద ఒత్తిడి తెస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యా శాఖ మంత్రిగా సిఎం రేవంత్ రెడ్డి ఫీజ్ రియంబర్స్ ను చేయాలని విజ్ఞప్తి చేశారు. ఫీజ్ రియంబర్స్మెంట్ చేయకపోతే సడక్ సేసదావ్ ముందుకు పోదునా అని అడిగారు. నా పేరు హనుమంతు ఎక్కడ అన్యాయం జరిగితే అక్కడ ఉంటానని అన్నారు. తెలంగాణ సాధించడలో విద్యార్థులు కీలకమని గుర్తుచేసుకొన్నారు. తెలంగాణ కోసం ఎంతో మంది విద్యార్థులు చనిపోయారనీ అన్నారు.

## విద్యార్థులపై అమానుష దాడికి కేంద్రమంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలి

### జన్-జికి చట్టసభల్లో ప్రాధాన్యత ఇవ్వడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి

### భువనగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** విద్యార్థులపై జరొగిన అమానుష దాడికి హోమ్ మంత్రి క్షమాపణలు చెప్పాలనీ భువగిరి ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో పార్లమెంట్ వద్ద మీడియాతో సోమవారం మాట్లాడుతూ బాధ్యులైన పోలీసుల అధికారుల పై చర్యలు తీసుకోవాలనీ కోరారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తో అంతా అయిపోయిందని చేతులు దులుపు కుంటే ఉపేక్షించేది లేదనీ అన్నారు. పార్లమెంట సమావేశాలు సజావుగా జరగాలంటే ప్రభుత్వం భాధ్యతతో వ్యవహరించాలనీ అధికార పార్టీకి సూచించారు.సింగపూర్, బ్రిటన్ లాంటి దేశాల్లో "జెన్ జీ" కి చట్టసభల్లో ప్రతినిధులు ప్రాధాన్యత ఇస్తున్నారనీ భారత్ లో కూడా 21 ఏళ్ళ నుంచి 25 ఏళ్ళ లోపు ఉన్న యువత కు చట్టసభలో ప్రాతినిద్యం కల్పిస్తే, వారి సమస్యలపై పూర్తి అవగాహనతో చర్చించి, సమస్యల పరిష్కారం చేయవచ్చని చెప్పారు. ఈ ఆలోచనను పరిగణనలోకి తీసుకోవాలని, 'ఇండియా కూటమి' నేతలకు ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి వివరించనున్నారనీ వచ్చే తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో, ఈ అంశంపై చర్చించి, తీర్మానం చేసే ఆలోచనతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారని తెలిపారు.

## దొడ్డు బియ్యం టన్నుకు రూ.21,700 ధర

### ఇ-వేలం ద్వారా అమ్మకాలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం

**హైదరాబాద్, జులై 27,ప్రభాతవార్త:** పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న దొడ్డు బియ్యాన్ని ఇవేలం ద్వారా ప్రభుత్వం అమ్మకాలు చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం ఉండగా వాటిని నాలుగు లాట్ చేసి ఈ వేలం నాలుగుసార్లు నిర్వహించారు. ఐతే మూడు లాట్లు మాత్రం ఇప్పటివరకు వేలం ప్రక్రియలో అమ్ముడుపోయాయి.అందులో రెండో లాట్లో ఉన్న 43,479 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం ఈ వేలంలో రూ. 21700 టన్నుచొప్పున చెన్నైకి చెందిన సంస్థకు విక్రయించారు. ఎఫ్‌సిఐ కస్టమ్ మిల్డ్ రైస్‌కు కిలోకు 40 నుంచి 42రూపాయలు చెల్లిస్తుంది. టన్నుకు 40వేల నుంచి 42వేల వరకు ఎఫ్‌సిఐ ధర చెల్లించి కొనుగోలు చేసిన దొడ్డబియ్యం ప్రస్తుతం రూ.21700కు విక్రయించారు. రాష్ట్రంలో రేషన్ దుకాణాలకు సన్న బియ్యం ప్రారంభించడానికి ముందే సేకరించిన దొడ్డు బియ్యం పలు ప్రాంతాల్లోని గోదాముల్లో భారీగా నిల్వలు ఉన్నాయి.బియ్యం పూర్తిగా పురుగు పడుతున్నాయని నివేదికలు రావడంతో అమ్మేందుకు టెండర్లు పిలవగా.. ఒక సంస్థ రెండో లాట్లో ఉన్న 43,479 మెట్రిక్ టన్నుల బియ్యం దక్కించుకుంది.బఫర్‌గోదాముల్లో నిల్వలు ఈ వేలంతో కొనుగోలుదారులు తీసుకొన్నారు. చౌకధరల దుకాణంలో నిల్వ ఉన్న బియ్యం విషయంలో వ్యాపారులు ముందుకు రావడంలేదు దీనికోసం పౌరసరఫరాల శాఖ 2025 మార్చిలో సన్న బియ్యం పథకం ప్రారంభించి గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇవ్వడం ప్రారంభించింది.

## ఒఆర్‌ఆర్ పరిధిలోని ఆటోరిక్షా యజమానులకు ఊరట

### ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ లేకుండానే పర్మిట్ బదలీకి అనుమతి: రవాణా శాఖ కమిషనర్

**హైదరాబాద్, జులై 27,ప్రభాతవార్త:** ఔటర్ రింగ్ రోడ్ (ఒఆర్ఆర్) పరిధిలో తిరుగుతున్న పాత ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోరిక్షాల యజమానులు, తమ వాహ =నాల యాజమాన్యం, సిటీ పర్మిట్‌లను పాత వాహనాన్ని స్క్రాప్ చేసి అదే పర్మిట్‌పై కొత్త ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోరిక్షాను భర్తీ చేయాలనుకునే కొనుగోలుదారులకు బదలీ చేసేందుకు వీలుగా తెలంగాణ రవాణా కమీషనర్ ఊరట కల్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు. సీఎఫ్ఎస్‌టి సాఫ్ట్‌వేర్ ప్రకారం రిజిస్ట్రేషన్,పర్మిట్ బదిలీ చేయాలంటే వాహనానికి చెల్లుబాటులో ఉన్న ఫిట్‌నెస్ సర్టిఫికెట్ (ఎఫ్‌సీ) తప్పనిసరి కావడంతో, వెంటనే స్క్రాప్ చేయబోయే వాహనానికి కూడా కొనుగోలుదారులు ఎఫ్‌సీ రెన్యువల్ చేయించుకోవాల్సి వస్తోందని, ఇది అనవసర ఆర్థిక భారంగా మారుతోందని పలు వినతులు అందాయన్నారు. ఈ వినతులను పరిగణనలోకి తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఒఆర్ఆర్ పరిధిలోని పాత ఎల్‌పీజీ, సీఎన్‌జీ ఆటోరిక్షాల యాజమాన్యం పర్మిట్ బదిలీని, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్‌ను తప్పనిసరి చేయకుండానే అనుమతిస్తారు.

## ఐఐటి, నీట్ ర్యాంకులు సాధించే లక్ష్యంగా విద్యార్థులు చదువుకోవాలి

### మహేశ్వరం తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించిన సిఎస్ సంజయ్‌జాజు



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జులై27:**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సోమవారం మహేశ్వరం మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను సందర్శించి పాఠశాలలో విద్యా బోధన, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సంద ర్భంగా విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించిన ఆయన వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, పోటీ పరీక్షలకు సన్నద్ధత, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాల పెంపు వంటి అంశాలపై విలువైన సూచనలు, మార్గదర్శకత్వం అందించారు.విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన కోసం క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో ముందుకు సాగాలని ప్రధాన కార్యదర్శి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తు న్నారని పేర్కొంటూ, ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా అవకాశాలు, సాంకేతిక వనరులు, గ్రంథాలయాలు, ప్రయోగశాలలను పూర్తి స్థాయిలో వినియోగించుకుని జీవితంలో ఉన్నత స్థానాలను అధిరోహించాలని విద్యార్థులకు పిలుపు నిచ్చారు. అనంతరం పాఠశాలలోని తరగతి గదులు, సైన్స్ ప్రయోగశాలలు, కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాల యం, వసతి గృహాలు, తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర మౌలిక వసతులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలపై ఉపాధ్యాయులు, అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, విద్యార్థులకు నాణ్యమైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన వసతుల మంజూరుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.పాఠశాల సమయాల్లో విద్యార్థుల రాక పోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్సు సేవలను పాఠశాల వరకు పూర్తి స్థాయిలో అందు బాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులతో సమన్వయం చేసి తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సందర్శన ముగింపులో పాఠశాల ఆవరణలో మొక్కను నాటిన ప్రధాన కార్యదర్శి, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షి ంచడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీ శశాంక్, శ్రీ కృష్ణ ఆదిత్య జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ), జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పాలమూరు ప్రజలను మళ్లీ మోసగించేలా బిఆర్‌ఎస్ రాజకీయాలు

### కర్ణాటకలో డ్యామ్‌లు కట్టినప్పడు అధికారంలో ఉండి ప్రశ్నించని బిఆర్‌ఎస్ పాలకులు

### బీమా, కృష్ణా నదులపై బ్యారేజ్ కమ్ బ్రిడ్జిలు నిర్మించాలన్న ఆలోచన చేయలేదు: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** కర్ణాటకలో డ్యాంలు కట్టినపుడు అధికారంలో ఉండి బిఆర్ఎస్ పాలకులు ప్రశ్నించలేదని పాలమూరు ప్రజలను మరోమారు మోసం చేయడానికి కుట్రలు చేస్తున్నారని రాష్ట్ర పశు సంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి విమర్శిం చారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మాట్లా డుతూ పాలమూరు జిల్లాకు చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు కర్ణాటకలోని గూడూరు ప్రాంతాన్ని సందర్శించి "కర్ణాటకలో నీళ్ల – తెలంగాణలో బీళ్లు" అంటూ చేస్తున్న ప్రచారం ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయమే తప్ప, పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం కాదని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం నీళ్ళ, నిధులు, నియామకాల కోసం జరిగిందని చెప్పుకునే వారు, బిఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో కర్ణాటకలో ఆనకట్టలు నిర్మించినప్పుడు ఒక్కసారి కూడా వెళ్లి ప్రశ్నించలేదని ఆయన అన్నారు. ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తూ ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.జూరాల ప్రాజెక్ట్ పరిధిలోని రైతుల ప్రయోజనాలను గత ప్రభుత్వం పూర్తిగా నిరక్ష్యం చేసిందన్నారు. భీమా, కృష్ణా నదులపై బ్యారేజ్‌కమ్‌బ్రిడ్జిల నిర్మాణం ద్వారా నీటిని నిల్వ చేసి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించాలనే ఆలోచన కూడా గత ప్రభుత్వానికి రాలేదని ఎత్తిచూపారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని, కర్ణాటక ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ కృష్ణా, భీమా నదులపై బ్యారేజ్‌కమ్‌బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించిన డిపిఆర్ సిద్ధం చేశామని మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కర్ణాటక ప్రస్తుత ముఖ్యమంత్రి డికె శివకుమార్, కర్ణాటక సాగునీటి శాఖ మంత్రులతో కలిసి హెలికాప్టర్ ద్వారా ప్రతిపాదిత ప్రాంతాలను పరిశీలించి, సాంకేతికంగా సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేసి కార్యాచరణ రూపొందించినట్లు వివరించారు.జూరాల ముంపు గ్రామాలైన భూత్పూర్, నేడుగం, అనుగొండ, అంకెనపల్లి, దాదంపల్లి గ్రామాల అభివృద్ధిని గత ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

దశాబ్దకాలంగా ముంపు గ్రామాల ప్రజల సమస్యలను పట్టించుకోకుండా, తగిన నిధులు కూడా విడుదల చేయలేదన్నారు. ప్రస్తుతం ఆ గ్రామాల అభివృద్ధి, పునరావాసం, భూత్పూర్ డ్యాం విస్తరణ వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు.పాలమూరు ప్రజల భవిష్యత్తు కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే, ప్లకార్డులు పట్టుకుని రాజకీయ డ్రామాలు చేయడం వల్ల ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. రైతులు, యువత అన్ని విషయాలు గమనిస్తున్నారని, అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు విరమించుకోవాలని మాజీ ప్రజాప్రతినిధులకు సూచించారు. 'మంచి చేయలేకపోయినా కనీసం చెడు చేయకండి, ప్రజలను మోసం చేసే రాజకీయాలు మానుకోండి, పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం మా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోంది' అని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

## దోస్త్ స్పెషల్ ఫేజ్‌లో ముగిసిన ఆప్షన్ల గడువు

### 30న సీట్ల కేటాయింపు

### మూడు విడతల్లో సీట్ల కేటాయింపు పూర్తి

### ఇప్పటివరకు 1,41,143 మంది చేరిక

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో మొదటి సంవత్సరంలో అడ్మిషన్ల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) పేరుతో డిగ్రీలో అడ్మిషన్లు చేపడుతున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే మూడు విడతల్లో సీట్ల కేటాయింపును పూర్తి చేశారు. ఈ నెల 16న స్పెషల్ ఫేజ్ అడ్మిషన్ల కోసం షెడ్యూల్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. స్పెషల్ ఫేజ్‌లో భాగంగా ఈ నెల 20 నుంచి 26 వరకు రూ. 400తో రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి అవకాశం కల్పించారు. సోమవారంతో వెబ్ ఆప్షన్ల గడువు సైతం ముగిసింది. సోమవారం స్పెషల్ కేటగిరీ విద్యార్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నిర్వహించారు. ఈ నెల 30న సీట్ల కేటాయింపు చేస్తారు. సీటు పొందిన విద్యార్థులు ఈ నెల 30 నుంచి ఆగస్టు 1 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సెల్ఫ్ రిపోర్ట్ చేసిన విద్యార్థులు ఈ నెల 31 నుంచి ఆగస్టు 1 వరకు ఆయా కాలేజీల్లో చేరాలి. మూడు విడతల్లో డిగ్రీ అడ్మిషన్ల కేటాయింపు చేశారు.

ఇప్పటి వరకు జరిగిన అడ్మిషన్ల ప్రక్రియను పరిశీలిస్తే రాష్ట్రంలో 1,41,143 మంది డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరారు. ఇంకా రాష్ట్రంలో 2,96,66 సీట్లు ఖాళీగా ఉన్నాయి. రాష్ట్రంలో 929 ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో 4,37,809 సీట్లు అందుబాటులో ఉండగా.. వాటిలో 1.41,143 మంది మాత్రమే చేరారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ప్రకటించిన దోస్త్ అడ్మిషన్ల లెక్కల ప్రకారం రాష్ట్రంలో 780 డిగ్రీ కాలేజీల్లో 3,71,919 సీట్లు ఉండగా వాటిలో 1,19,016 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. వివిధ సంక్షేమ శాఖ అధ్వర్యంలో కొనసాగుతున్న 79 సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో 23,834 సీట్లు అందుబాటులో ఉంటే అందులో 9,271 సీట్లు భర్తీ అయ్యాయి. నాన్ దోస్త్ విధానంలో అడ్మిషన్లు తీసుకుంటున్న 70 కాలేజీల్లో 42,056 సీట్లు అందుబాటులో ఉంటే వాటిలో 12,856 సీట్లను భర్తీ అయ్యాయి. స్వయం ప్రతిపతి (అటానమస్) హోదా కలిగిన 36 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 45,120 సీట్లు ఉంటే అందులో 27,434 సీట్లు భర్తీ అయ్యాయి. అటానమస్ కాకుండా ఉన్న 116 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో 50,940 సీట్లు అందుబటులో ఉంటే వాటిలో కేవలం 19,389 సీట్లు భర్తీ కాగా ఇంకా 31,551 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఉన్న సీట్లలో కేవలం 43 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. 580 ప్రైవేట్ డిగ్రీ కాలేజీల్లో 2,48,330 సీట్లు ఉంటే వాటిలో కేవలం 59,615 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. 1,88,715 సీట్లు ఖాళీగా మిగిలిపోయాయి.

## జార్జియాటెక్ వర్సిటీలో అడ్మిషన్ వచ్చిన విద్యార్థికి ఆర్‌అండ్‌బి మంత్రి కోమటిరెడ్డి అభినందనలు

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** అమెరికాలోని ప్రముఖ జార్జియాటెక్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో గ్రాడ్యుయేషన్ సీటు సంపాదించిన నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం పెద్ద సూరారం గ్రామానికి చెందిన యరమాద అశ్మిత్ ను రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అభినందించారు. సోమవారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని మర్యాదపూర్వకంగా యరమాద అశ్మిత్ కలిశారు. తన ప్రతిభతో ప్రముఖ జార్జియాటెక్ యూనివర్సిటీలో సీటు సంపాదించిన అశ్మిత్ ను మంత్రి అభినందించారు. నల్లగొండకే కాదు యావత్ తెలంగాణకు, దేశానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చేలా కష్టపడి చదివి, ప్రయో జకుడు కావాలని ఆశీర్వదించారు. అశ్మిత్ తల్లి దండ్రులు యరమాద జగదీష్ రెడ్డి శ్రీలత లకు శుభాకాంక్షలు తెలిపారు. అశ్మిత్ తండ్రి జగదీష్ రెడ్డి ఎవరెజెంట్ టెక్నాలజిస్ అమెరికా హెడ్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తన తండ్రిని ఆదర్శంగా తీసుకుని ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని, అస్మిత్ కు మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆల్ ది బెస్ట్ చెప్పారు.

## విద్యార్థులకు క్షమాపణలు చెప్పాలి.. విమర్శలు చేయడం తగదు

### ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** విద్యార్థులకు క్షమాపణలు చెప్పాల్సింది పోయి బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు విమర్శలు చేయడం తగదని విద్యార్థుల జీవితంతో కేంద్రంలోని బిజెపి చెలగాటం ఆడుతోందని ప్రభుత్వవిప్ డాక్టర్ బల్మూర్ వెంకట్ విమర్శించారు. సోమవారం సిఎల్‌పిలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఇచ్చిన హామీలను పూర్తి చేస్తాం, త్వరలోనే పోలీసు ఉద్యోగాల భర్తీ, మరో 30 వేల ఉద్యోగాల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చింది, త్వరలో వాటిని కూడా భర్తీ చేస్తామనీ చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగుల గురించి మాట్లాడే అర్హత బిజెపి కి లేదనీ అన్నారు.యువతకు పెద్దపీట వేసి, రాష్ట్రంలో దేశంలో చట్టసభ కు పంపించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కిందనీ తెలిపారు. యువత గురించి, యువతకు అవకాశాల గురించి బిజెపి రామ చందర్ రావు మాట్లాడుతుంటేనవ్వొస్తుందనీ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు మొదటి నుంచి అవకాశాలు ఇచ్చారనీ తెలిపారు. అందుకు ఎంఎల్‌సినేను, ఎంపిగా అనిల్ కుమార్ యాదవ్, మరో 20 మంది యువ నాయకులకు కార్పొరేషన్లలో అవకాశం కల్పించారనీ తెలిపారు.ఇటీవల కేరళలో యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం, మంత్రి వర్గంలో చోటు కల్పించారనీ చెప్పారు.

## నేరాల దర్యాప్తులో ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదికలు కీలకం

### డిజిపి ఆనంద్ వెల్లడి




ఎఫ్ఎస్ఎల్‌లో జరిగిన కొత్త ఉద్యోగుల నియామక ప్రక్రియ కార్యక్రమంలో పాల్గొన్న డిజిపి సి.వి ఆనంద్. ఫొటోలో ఎఫ్ఎస్ఎల్ డైరక్టర్ శిఖాగోయల్ తదితరులు

**హైదారబాద్, జులై 27, ప్రభాతవార్త:** పోలీసు శాఖలో ఫోరెన్సిక్ విభాగం ఎంతో కీలకమైనదని డిజిపి సి.వి ఆనంద్ అన్నారు. కీలక కేసుల్లో ఈ విభాగం అందించే నివేదికలు కేసుల విచారణ వేగవంతం అయ్యేందుకు, నిందితులకు శిక్షలు పడేలా చేసేందుకు ఉపయోగపడతాయని ఆ యన తెలిపారు. నాంపల్లిలోని ఎఫ్ఎస్ఎల్ విభాగంలో కొత్తగా చేరిన 57 మంది సైంటిఫిక్ ఆఫీసర్లకు డిజిపి సోమవారం నాడు నియామక ప త్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర నిరూపణలో ఎఫ్ఎస్ఎల్ పాత్ర అత్యంత కీలకమని అన్నారు. దేశంలో అమ ల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలకు అనుగుణంగా శాస్త్రీయ దర్యాప్తు ప్రమాణాలను మరింత మెరుగుపడాలని ఆయన అన్నారు. ఈ విభా గం అందించే నివేదికలు ఛార్జిషీట్‌కు కోర్టుల్లో కేసుల నిరూపణలకు దోహదం చేస్తాయని ఆయన తెలిపారు. కీలక కేసుల్లో శాస్త్రీయ ఆధారాలు బలంగా లేకుంటే నేరస్తులు శిక్షల నుంచి తప్పించుకుంటారని డిజిపి తెలిపారు. ఈ నేపథ్యంలో ఎఫ్ఎస్ఎల్ ఉద్యోగుల విధి నిర్వహణ ఎంతో ముఖ్యమైనదని ఆయన తెలిపారు. ఈ విషయంలో ఎఫ్ఎస్ఎల్ అధికారులు మరింత పరిణతి చెందాలని, నివేదికలు రూపొందించడంలో పక్కాగా వుండాలని, నేరగాళ్లు శిక్షల నుంచి తప్పించుకునేందుకు అవకాశం లేకుండా చూడాలని ఆయన వెల్లడిచారు.

ఎఫ్ఎస్ఎల్‌లో మరింత సిబ్బ ందిని పెంచేందుకు కృషి చేస్తామని, దీంతో పాటు ఈ విభాగానికి కావాలసిన సాంకేతిక ఉపకరణాలను అందజేస్తామని డిజిపి హామీ ఇచ్చారు. ఎఫ్ఎస్ఎల్ డైరక్టర్ శిఖా గోయల్ మాట్లాడుతూ తమ విభాగంలో సిబ్బంది కొరతవున్నా విధి నిర్వహణలో ఎక్కడా రాజీ పడడం లేదని తెలిపారు. సిబ్బంది కొరతవున్నా 80 శాతం కేసులను పరిష్కరించామని ఆమె తెలిపారు. డిఎన్ఎ విశ్లేషణ, కంప్యూటర్ ఫోరెన్సిక్, నార్కోటిక్స్, టాక్సికాలజి తదితర విభాగాల్లో అధునాతన పరిజ్ఞానంతో సేవలందిస్తు న్నామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఎల్ జాయింట్ డైరెక్టర్లు మధుశ్రీ, ధార్మిత, మధుకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సచివాలయంలో ఎస్సీ వర్గీకరణ సబ్‌కమిటీ మంత్రులకు రోస్టర్ పాయింట్లపై సమీక్షించాలని విజ్ఞప్తి చేస్తున్న జి.చెన్నయ్య

## రైసు మిల్లర్లపై పిడి చట్టంతో విరుచుకుపడుతున్న విజిలెన్స్

### సిద్దిపేటలో బియ్యం అక్రమ రవాణాదారు బచ్చు రత్నాకర్‌పై పిడియాక్టు ప్రయోగం

**హైదరాబాద్, జులై 27,ప్రభాతవార్త:** తెలంగాణ వ్యాప్తంగా రైసుమిల్లులపై విజిలెన్స్ అధికారులు దాడులు చేయడంతోపాటు ధాన్యం పక్కదారి పట్టించిన వారిపై పిడియాక్టు ప్రయోగం చేస్తూ అక్రమార్కులను నియంత్రించే కఠిన చర్యలు తీసుకొంటున్నారు. మరోవైపు రేషన్‌బియ్యంతో అక్రమదందా చేస్తున్నవారిని కూడా వదిలి పెట్టంలేదు. సూర్యాపేట జిల్లా బాలెంల పరిధిలోని వజ్ర రైస్ కార్పొరేషన్, వజ్ర వికాస్ రైస్ మార్ట్‌లలో విజిలెన్స్ అధికారులు తనిఖీచేయగా ధాన్యాన్ని మాయమైనట్లు గుర్తించి వట్టె జానయ్య యాదవ్ పై పిడియాక్టు ప్రయోగించారు.టిఆర్‌పి పార్టీ జనరల్ సెక్రటరీ వట్టె జానయ్య యాదవ్‌పై కేసు నమోదయింది. రూ.73 కోట్ల విలువైన ధాన్యాన్ని వట్టె జానయ్య పక్కదారి పట్టించి దోచుకున్నాడని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు నిర్ధాంచినట్లు తెలిసింది. 29,188 టన్నుల ధాన్యాన్ని పక్కదారి పట్టించడంతో జానయ్య కుమారుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వడ్లను అక్రమంగా తరలిస్తున్న లారీలను అదుపులోకి తీసుకుని, రెండు మిల్లులలోని ధాన్యాన్ని సీజ్ చేశారు.రూ.73 కోట్ల విలువైన ధాన్యాన్ని మిల్లుల నుంచి దొడ్డిదారిన మళ్లించిన టిఆర్‌పి పార్టీ జనరల్ సెక్రటరీ వట్టె జానయ్య యాదవ్ పరారిలో ఉన్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు యాదాద్రి భువనగిరి జిల్లాలోని రైస్ మిల్లుల్లో భారీగా సిఎంఆర్ రైస్ మాయమైంది. భువనగిరి మండలం అనంతారంలో యాదాద్రి రైస్ ఇండస్ట్రీలో 2022-23, 2024-25 రబీ సీజన్లకు చెందిన 6.700 మెట్రిక్ టన్నుల రైస్ కనిపించకుండా పోవడంతో పౌరసరఫరాల శాఖ అధికారులు భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ రూ.24.30 కోట్లుగా అంచనా వేస్తున్నారు. మిల్లుకు చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సిద్దిపేటకు జిల్లా గజ్వేల్ కు చెందిన బచ్చు రత్నాకర్‌పై పోలీసులు పిడి యాక్ట్ నదమోదు చేసి అరెస్టుచేశరు రేషన్‌బియ్యం అక్రమంగా రవణా చేస్తూ ఆరు సార్లు పోలీసులకు పట్టుబడ్డారు. రేషన్ లబ్దిదారులనుంచి డిలర్ల నుంచి బియ్యం కొనుగోలు చేసి వడ్డేపల్లి రైస్‌మిల్లులో నిల్వచేసి బ్లాక్‌లో విక్రయించడం ఇతనికి అలవాటుగా నేరం మారింది. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నియంత్రణ కింద అతనిని అరెస్టుచేసి చర్లపల్లిజైలుకు పోలీసులు తరలించారు.

## రోస్టర్ పాయింట్లపై సమీక్షించండి

### సబ్‌కమిటీకి మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య విజ్ఞప్తి

**హైదారబాద్ (సైఫాబాద్), జులై 27, ప్రభాతవార్త:**ఎస్సీ వర్గీకరణలో ద్వారా వచ్చిన రోస్టర్ పాయింట్ల వల్ల మాల, మాల ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాలపై సమీక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య ఎస్సీ వర్గీకరణ సబ్ కమిటీకి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం సచివాలయంలో వర్గీకరణ సబ్ కమిటీ మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి, దామోదర రాజనర్సింహ, అడ్లూరి లక్ష్మణ్, పొన్నం ప్రభాకర్, సీతక్క, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారులు విజయే ంద్రబోయి, శ్రీధర్ తదితరులను కలిసి జి.చెన్నయ్య కలిసి రోస్టర్ పాయింట్ల వల్ల మాలలకు జరుగుతున్న అన్యాయాలపై వినతిపత్రాన్ని అందజేసి వివరించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వర్గీకరణలోని రోస్టర్ పాయింట్ల వల్ల మాల, మాల ఉపకులాలకు విద్యా, ఉద్యోగ రంగాలలో తీరని అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సబ్ కమిటీ సమీక్షించాలని, సిఎం రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని మాలలకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.